మన

రైతువాణి

వ్యవసాయ మాసపత్రిక

మే : 2021

నల్లటి కండ పై ఉదయించే

ఎర్రటి సెమట సుక్కకు వందనం

మేడే శుభాకాంక్షలు

మేడే స్పెషల్



మేడే శుభాకాంక్షలతో...

GEETHA GR

★ ★ Hotel with
★ ★ ★ Star facilities

HOTEL
Geetha
REGENCY
Central A.C.
a place with unique features

4/1, అరండల్‌పేట, గుంటూరు-2. ఫోన్ : 2219101 (8 లైన్లు) సెల్ : 98663 19730. ఫ్యాక్స్ : 2233233

*ఫుల్లీ ఫర్నిష్డ్ 33 ఎగ్జిక్యూటివ్ రూమ్స్ *9 డీలక్స్ రూమ్స్ *3 సూట్ రూమ్స్

ధరణి - నాన్ వెజిటేరియన్ మల్టీకుజిన్ రెస్టారెంట్
నాగార్జున - వెజిటేరియన్ రెస్టారెంట్

సంస్కృతి - భావన
వివాహాలకు, రిసెప్షన్‌లకు, ఎగ్జిబిషన్స్, సేల్స్ కొరకు,
మీటింగులకు ప్రత్యేకంగా డిజైన్ చేయబడిన హాలు

HOTEL Daspalla
DASPALLA HOTELS LIMITED
Suryabagh, VISAKHAPATNAM - 530 020
Ph: 0891-2564825 (6 Lines).
Fax : 0891-2562043
E-mail: dspvizag1@rediffmail.com
hoteldaspalla@gmail.com

EXECUTIVE COURT
DASPALLA RESORTS LIMITED
Waltair, Main Road, VISAKHAPATNAM
Phones : +91-891- 2717 300 - 305, 6512555, 56,
Fax ; + 91-891-2717444, Cell : 98663 19737
E-mail : decvizag1@rediffmail.com

HOTEL Daspalla HYDERABAD
JUBLEE HILL RESORTS LTD.
Road No.37, Jublee Hills,
HYDERABAD - 500033.
Ph: 23547214, Fax: 23247213
Email: jublee.resorts@rediffmail.com

dh Daspalla Resorts Ltd.
JAYA RESIDENCY
20-6-5, Seethapathi Rao Street
KAKINADA
Ph : 2377301, 9866319733

TYCOONS & HERITAGE
RESTAURANTS
Vizag

HOTEL Geetha REGENCY
4th Lane, Arundal Pet, GUNTUR
Ph : 2219101, Cell : 9866319730
E-mail : geetharegency@rediffmail.c

మన
రైతువాణి

మే - 2021

సంపుటి : 31 సంచిక : 5

వెల : రూ. 20 పేజీలు : 52

సంవత్సర చందా : రూ. 230/-

ఎడిటర్
పి. నరసింహారావు

ఎడిటోరియల్ బోర్డు
వై. కేశవరావు
మద్రావు సూర్యనారాయణ

చీఫ్ రిసోర్స్ పర్సన్
ప్రొ. ఎన్. వేణుగోపాలరావు
ఎం.ఎస్.సి.(ఎజి) పి.హెచ్.డి.

బ్యూరో చీఫ్
యు. రామకృష్ణ

మార్కెటింగ్ మేనేజర్
మన్నెం శ్రీనివాసరావు

మన రైతువాణి
3/4బి, వడ్డేశ్వరం బైపాస్, వడ్డేశ్వరం (పోస్ట్)
తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా
పిన్ : 522 502
సెల్ నెం : 9490098222
E-mail : rytuvani@gmail.com

చెక్కులు, డి.డి లు Mana Rytu vani పేరుతో పంపాలి.
SBI Ac No : 52024133051
IFSC : SBIN0020343

విషయసూచిక

ఉక్కు ఉద్యమానికి దేశ మద్దతు కూడగడతాం 6
కరోనా కల్లోలంలో జనాన్ని ముంచేస్తున్న మోడీ 9
ఎరువుల ధర మోత 12
ఫిక్స్‌డ్ ఛార్జీల షాక్! 15
రైతు, కార్మిక శంఖారావం సభలతో స్ఫూర్తి 18
కుంజా బొజ్జికి రైతు సంఘం ఘన నివాళి 20
బీజేపీ, దాని మిత్రపక్షాలను ప్రజలు తిరస్కరించారు 21
వ్యవసాయ రసాయనాల పేర్ల గారడీ 22
హైబ్రిడ్ సీతాఫలం తోటలు 25
వేసవిలో రైతులు పొలాల్లో చేయాల్సిన పనులు 29
బెండను ఆశించే ఎర్రనల్లిని నివారించడం ఎలా? 30
కర్బుజాలో సరికొత్త వంగడాల సాగు 31
కూరగాయల్లో రసాయన అవశేషాలు
నష్టాలు - పరిష్కారాలు 32
వేసవిలో లోతు దుక్కులు ప్రయోజనాలు 37
మిరప సాగులో మెళకువలు 38
కూరగాయ పంటలో జీవన ఎరువుల ప్రాముఖ్యత 41
కాండం మొక్కల ద్వారా దొండసాగు 43
సహజసిద్ధ ఎరువులతో ఆకు, కాయగూరల సాగు 45
బచ్చలిలో పోషక విలువలు, సాగు పద్ధతులు 47
ఓ మోడీ సారూ! చెప్పండి మీరు!! (పాట) 49
చిక్కకోయీ కరోనాకు...,రాబోయే తరాల కోసం (కవితలు) 50


మీరు సురక్షితంగా ఉండటానికి ఇది మా భద్రతా కవర్
వ్యవసాయ చట్టాలు
కార్పొరేట్


కరోనా వైరస్ యుద్ధం కంటే తక్కువ కాదు. మేము అలసిపోలేము. మేము ఆపలేము
తదుపరి ఆదేశం ఏమిటి ప్రభూ

గేతోపదేశాలు


బెంగాల్ జాతి ఈ దేశంకోసం త్యాగం చేసింది : మోడీ
ఇప్పుడు నీవంతు
కార్పొరేట్
వ్యవసాయ చట్టాలు


కరోనా కోసం వ్యాక్సిన్ ఇస్తాం. కానీ మనకు కాదు.
నిరుద్యోగం
కులతత్వాలు
జాగ్రత్తగా ఉండండి. కరోనా వైరస్ ఇంకా పోలేదు : మోడీ


ప్రతిఘటన
రైతు - మీడియా మధ్యలో నువ్వు అక్కడ నిలబడాలి

సంపాదకీయం...

కరోనా విలయతాండవం

"గో గో" అంటేనో, "పళ్లాలు మోగిస్తేనో" పోయే రకాన్ని కాదని మనల్ని గేలి చేస్తూ ఎప్పుడో తేల్చి చెప్పేసింది కరోనా. తనకు పేద-ధనిక, కులం-మతం, ప్రాంతం-జాతి భేధాలు లేవని మిమ్మల్ని కబళించడమే నా పని అంటూ యావత్ మానవ సమాజాన్ని వణికించేస్తున్నది. కరోనాకు మందు లేదని మొదట్లో అనుకున్నా.. మన దేశం సహా అనేక దేశాలు వ్యాక్సిన్‌ను కనుగొని వేసే కార్యక్రమం చేపడుతున్నాయి. అయితే ఈ పని ఒక్క రోజులోనే, నెలలోనో, సంవత్సరంలోనో పూర్తయ్యే పనికాదు. వ్యాక్సిన్ సరఫరా కూడా అంతంత మాత్రమే. అ లోపు జరిగే కరోనా విలయతాండవాన్ని ఆపే చర్యలు కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదు.

ఢిల్లీలో అనుమతి తీసుకొని పెట్టిన చిన్న మత సమావేశం ద్వారా దేశంలో కరోనా పాకిందని నెలల తరబడి ప్రచారం చేసిన కేంద్ర ప్రభుత్వం.. ఆ తరువాత కొన్ని మతాల వారి సమావేశాలు, మేళాలు, ఉత్సవాలకు అభ్యంతరం చెప్పలేదు. ఇటీవల జరిగిన కుంభమేళాకు మొత్తం 30 లక్షల మంది హాజరయినట్లు చెప్పారు. గంగానదిలో మునిగిన వారికి కరోనా పోతుందని కొందరు సెలవిచ్చినా.. దేశం మొత్తం ఇది కరోనా వ్యాప్తికి దోహదం చేస్తుందని దేశ వాసులు పెట్టిన గగ్గోలు కేంద్ర ప్రభుత్వ చెవికెక్కలేదు. ఇదే సమయంలో ఎన్నికలు కూడా ఒకటి. ప్రధాని, హోంమంత్రి పెద్ద పెద్ద సభలను, ర్యాలీలను నిర్వహించి కరోనా వ్యాప్తి గురించి గాలి కొదిలేశారు. ఫలితంగా దేశం పెద్ద మూల్యమే చెల్లించుకుంటోంది.

అమెరికాలో రోజుకు రెండేసి లక్షల కరోనా కేసులు బయటపడుతున్నప్పుడు ఇదే విలయం అంటూ ఇక్కడ మనం ఎంతో వ్యథ చెందాం. అమెరికా వెళ్లిన వారిని రావద్దని, ఇక్కణ్ణుంచి వెళ్లేవారిని వెళ్లొద్దని చెప్పాం. ఇప్పుడు సాక్ష్యాత్తూ మనం చేసిన విధంగానే అమెరికా కూడా మన దేశం పట్ల ఇలాగే అంటోంది. భారతీయులెవరినీ ఆగస్టు వరకూ తనదేశం రావడానికి అనుమతించబోమని చెపుతోంది. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కరోనాను కనిష్టంగా నిరోధించవచ్చో ప్రపంచ అనుభవాలన్నీ.. ఆఖరికి కేరళ రాష్ట్ర ప్రభుత్వ కృషి కూడా మన ముందరే ఉన్నా వాటిని పట్టించుకోలేదు. కరోనా నిరోధ కృషిలో కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఐక్యరాజ్య సమితి గుర్తింపు కూడా పొందిన విషయం భారతీయులందరికీ తెలిసిందే.

ఏమైనా ఇప్పుడు కరోనా దేశంలో విలయతాండం చేస్తున్నది. ప్రస్తుతం రోజూ నాలుగు లక్షల మందికి పైగా కరోనా పాలిట పడుతున్నారు. చావులు కూడా వేలల్లోనే ఉంటున్నాయి. సెకండ్ వేవ్ ఉధృతి దాల్చే ప్రమాదం ఉందని ఎంతో కాలం నుంచి సంబంధిత వైద్యవేత్తలు చెపుతున్నా.. పెడచెవిని పెట్టిన ఫలితమే ఇది. ప్రస్తుతం ఆసుపత్రులు చాలడం లేదు. బెడ్లు దొరకడం లేదు. ఎవరైనా మరణిస్తేనే బెడ్డు. ఆఖరికి ప్రాణవాయువు కూడా సరఫరా చేయలేని దయనీయ స్థితిలో ఉంది కేంద్ర ప్రభుత్వం. ప్రాణవాయువు సరఫరా లేక ఎంతో మంది మృత్యువాత పడ్డారు. వీటిని ఏమనాలి? వీటిని ప్రభుత్వ హత్యలే అనాలి. కేరళ రాష్ట్రం దీనికి మినహాయింపు. ఆ ప్రభుత్వ ముందు చూపు ఫలితంగా తన రాష్ట్ర అవసరాలు పోను.. మూడు నాలుగు రాష్ట్రాలకు ప్రాణవాయువును సరఫరా చేస్తున్నది. ఇలాంటి ఆలోచనలు కేంద్రప్రభుత్వానికి ఎందుకు రావో మరి?.

ప్రభుత్వ రంగంలోని విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటుకు బేరం పెట్టినా.. ఇందుకు వ్యతిరేకంగా అందులో పనిచేస్తున్న కార్మికులు తమ నిరసనలను తెలియజేస్తూనే ఆక్సిజన్ ఉత్పత్తిని చేపట్టి దేశానికి అందిచడం మహత్తరమైన విషయం. దీనికి కేంద్ర ప్రభుత్వం సిగ్గు పడాలి. అయితే ఈ విషయంలో రాష్ట్రాలను సతాయిస్తోంది. మొదటి వేవ్ అతి తక్కువగానే ఉన్నప్పటికీ లాక్‌డౌన్ వల్ల దేశం కోట్లాది వలస కార్మికుల, శ్రమజీవులు పడిన బాధ మన కళ్లముందరే కనిపిస్తోంది. వాళ్ల జీవితాలు ఇప్పటికీ కుదుట పడలేదు. ఈ దశలోనే మళ్లీ సెకండ్ వేవ్ విలయతాండవం వచ్చి పడింది. ఎన్ని చెప్పినా కేంద్ర ప్రభుత్వం క్షణాల్లో ఈ వ్యాధి వ్యాప్తిని నిరోధించే అవకాశం లేదు. ఇది ఎంత కాలం కొనసాగుతుందో చెప్పనూ లేము. రోమ్ నగరం తగులబడి పోతుంటే ఆ దేశ రాజు పిడేలు వాయిస్తూ కూర్చున్న చందంగా మన కేంద్ర ప్రభుత్వం కూడా వ్యవహరించి ఈ దుస్థితికి తెచ్చింది. ఈ కేంద్ర ప్రభుత్వాన్ని దేశ ప్రజలు ఎన్నటికీ క్షమించబోరు.

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేస్తామని రైతు కార్మిక నాయకులు ప్రకటించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణ నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఢిల్లీలో జరుగుతున్న రైతాంగ పోరాట స్థాయికి ఉక్కు పోరాటాన్ని తీసుకువెళ్తామని, దేశమంతా తిరిగి మద్దతు కూడగడతామని చెప్పారు. ఈ పోరాటంలో కార్మికులతోపాటు రైతులు కూడా భాగస్వాములవుతారని అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ, ఎపి రైతు సంఘాల సమన్వయ కమిటీల ఆధ్వర్యంలో ఏప్రిల్ 18న విశాఖ ఆర్కె బీచ్‌లో రైతు కార్మిక శంఖారావ సభ జరిగింది. సభకు పెద్దఎత్తున రైతులు, కార్మికులు తరలివచ్చారు. సభకు ముందు విశాఖలో ప్రదర్శన నిర్వహించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినాదంతోపాటు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నినాదాలు ఈ ప్రదర్శనలో మార్మోగాయి. రైతు కార్మికుల ఐక్యత వర్ధిల్లాలన్న నినాదాలు పెద్దఎత్తున వినిపించాయి. అనంతరం జరిగిన సభలో ఢిల్లీ రైతాంగ ఉద్యమ నేత, బికెయు జాతీయ నాయకులు రాకేష్‌సింగ్ తికాయత్, ఆలిండియా కిసాన్ సభ జాతీయ నాయకులు అశోక్‌ధావలే, ఎపి రైతు సంఘాల సమన్వయ రాష్ట్ర కమిటీ కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎఐఎడబ్ల్యుయు నాయకులు బి.వెంకట్, కిసాన్ సభ జాతీయ నాయకులు బలకరన్‌సింగ్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ సి.హెచ్.నరసింగరావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలని అన్నారు. లేని పక్షంలో రైతులు, కార్మికుల నుంచి తీవ్రస్థాయి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

బికెయు జాతీయ నాయకులు తికాయత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు జరుగుతున్న పోరాటాలకు దేశవ్యాప్తంగా రైతుల మద్దతు ఉందని అన్నారు. వ్యవసాయ చట్టాల రద్దు డిమాండ్లపై ప్రధానితో జరిపే చర్చల్లో విశాఖ ఉక్కు కార్మాగార ప్రయివేటీకరణ చేయబూనే అంశాన్ని ప్రస్తావిస్తామన్నారు. భవిష్యత్తులో కార్మికులు కలసి అనేక ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ముందుకొచ్చిందని తెలిపారు. ఇన్సూరెన్సు, బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్, రైల్వే, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు.. రైతు, కార్మిక పోరాటాల్లో భాగస్వాములు కావాలన్నారు. విజయం సాధించే వరకూ ఉద్యమాన్ని కొనసాగించాలని కోరారు.

ఆలిండియా కిసాన్ సభ జాతీయ నాయకులు అశోక్‌ధావలే మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పెద్ద ఎత్తున పోరాడాలన్నారు. బలిదానాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాల ద్వారానే కాపాడుకోగలమని తెలిపారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ అమ్మేందుకు మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు. జాతీయోద్యమంలో ఏ పాత్రాలేని ఆర్ఎస్ఎస్ కేంద్ర ప్రభుత్వాన్ని వెనకుండి నడిపిస్తూ ప్రభుత్వ రంగాలను కార్పొరేట్ల చేతుల్లో పెడుతోందని విమర్శించారు. కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చేలా మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు.

ఎపి రైతు సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. బ్యాంకులకు డబ్బులు ఎగ్గొట్టిన పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయల అప్పులు మాఫీ చేసిన



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న బి.కె.యు జాతీయ నాయకులు రాకేష్ సింగ్ తియాకత్

కార్మిక, కర్షక ప్రదర్శన - విశాఖపట్నం

మోడీ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నించారు. మెజారిటీ ఉందని అహంకారంతో రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు, నిర్ణయాలు చేస్తే ప్రజలు ఊరుకోరన్నారు.

కిసాన్‌సభ జాతీయ నాయకులు బలకరన్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రయివేటీకరించి దోపిడీకి మోడీ ప్రభుత్వం దారులు తెరిచిందన్నారు.

ఎఐఎడబ్ల్యుయు నాయకులు బి.వెంకట్ మాట్లాడుతూ... వ్యవసాయం, ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేటీకరణ చేసే మోడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు కలిసి పోరాడాలన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలు సేకరించి ప్రధానికి నిరసన తెలియజేయాలన్నారు.

ఈ సభలో రైతు నాయకులు ధర్మపాల్ సింగ్, యుద్వేర్‌సింగ్, పరిరక్షణ కమిటీ కన్వీనర్ జె.అయోధ్యరామ్, ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, రాష్ట్ర రైతు నాయకులు రావుల వెంకయ్య, మర్రాపు సూర్యనారాయణ, జి.జమలయ్య, దడాల సుబ్బారావు, ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రజా కార్మిక సంఘాల కన్వీనర్ ఎం.జగ్గునాయుడు, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు జె.వి.సత్యనారాయణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర నాయులు కె.లోకనాథం, రైతులు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రైతు, కార్మిక ర్యాలీ

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, ఎపి రైతు సంఘాల సమన్వయ కమిటీ సంయుక్తంగా చేపట్టిన రైతు కార్మిక శంఖారావ సభ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. ముందుగా ఉడా పార్కు సమీపంలోని పార్క్ హోటల్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి జాతీయ రైతు సంఘాల నాయకులు రాకేష్‌సింగ్ తికాయత్, అశోక్‌ధావలే, బలకరన్‌సింగ్, బి.వెంకట్, వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుండి వేలాదిగా తరలివచ్చిన రైతులు, కార్మికులతో కలిసి ఆర్కే బీచ్ వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ర్యాలీ చేపట్టారు. విశాఖ ఉక్కు -ఆంధ్రుల హక్కు, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రయివేటీకరణ ఆపాలి, మోడీ డౌన్‌డౌన్, మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలి అనే నినాదాలతో బీచ్ రోడ్డు హోరెత్తింది. ప్రారంభంలో పోలీసులు ర్యాలీని అడ్డుకునే ప్రయత్నం చేసినా దానిని అధిగమించి ర్యాలీ ముందుకు సాగింది.

దేశమంతటా రైతు పోరాటం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ సరిహద్దుల్లో అన్నదాతలు చేస్తున్న పోరాటం దేశవ్యాప్తంగా విస్తరించాలని, ఈ దిశగా రైతాంగం ముందుకు సాగాలని ఏప్రిల్ 19న విజయవాడలో జరిగిన కర్షక, కార్మిక శంఖారావ సదస్సు పిలుపునిచ్చింది. రైతాంగం, కార్మికులు ఎదుర్కొంటున్న ఆరు ప్రధాన సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్లతో విజయవాడలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ఎపి రైతు సంఘాల సమన్వయ కమిటీ, ఎపి సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్తంగా కర్షక, కార్మక శంఖారావ సదస్సును నిర్వహించాయి. వామపక్షాల రాష్ట్ర నాయకులు, వివిధ సంఘాల నాయకులతోపాటు ప్రజాస్వామ్య, ప్రజాతంత్రవాదులు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేదికపై నాయకులంతా శంఖం పూరించి కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా సమరనాదం మోగించారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బికెయు జాతీయ నాయకులు రాకేష్‌సింగ్ తికాయత్ ప్రభృతులు ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు కూడా వ్యవసాయ రంగాన్ని, దేశాన్ని నాశనం చేసేందుకేనని తికాయత్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతుకు మేలు చేసేందుకే ఈ చట్టాలు చేశామని కేంద్ర ప్రభుత్వం బుకాయిస్తోందన్నారు. దేశాన్ని రైతు ఎలా బతికిస్తున్నాడో.. అలాగే రైతును కూడా బీజేపీ వినాశకర విధానాల నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎఐకెఎస్‌సి జాతీ య అధ్యక్షులు అశోక్‌ధావలే మాట్లాడుతూ.. విషసర్పంలాంటి బీజేపీకి అసెంబ్లీలో ఒక్క సీటు కూడా ఇవ్వని రాష్ట్రం ఎపి అని, ఇందుకు రాష్ట్ర ప్రజలకు అభినందనలని అన్నారు.

విజయవాడ సదస్సులో మాట్లాడుతున్న బి.కె.యు జాతీయ నాయకులు రాకేష్ సింగ్ తియాకత్

విజయవాడ సదస్సుకు హాజరైన జాతీయ ప్రతినిధులు, ప్రజలు

ఎఐఎడబ్ల్యు జాతీయ అధ్యక్షులు బి.వెంకట్ మాట్లాడుతూ.. రైతుల పాలిటి శాపాలు వంటి చట్టాలు చేసిన కేంద్రంపై పోరాడకుండా మౌనం పాటిస్తే ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు దేశద్రోహులుగా మిగిలిపోతారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎఐకెఎస్ పంజాబ్ అధ్యక్షులు బల్కరన్‌సింగ్ బ్రార్ మాట్లాడుతూ.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి దాని స్థానంలో కేంద్రం మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తోందని విమర్శించారు. ఈ పోకడలను అడ్డుకోవాలని కోరారు.

రైతు ఉద్యమానికి సంఘీభావ నిధి

ఢిల్లీలోని రైతాంగ ఉద్యమంలో ప్రాణాలర్పించిన వారికి నిమిషం పాటు మౌనం పాటించి సదస్సు నివాళులర్పించింది. రైతాంగ పోరాటానికి సంఘీభావ నిధిగా వడ్డే శోభనాద్రీశ్వరరావు కుమార్తె కొడాలి వెంకటలక్ష్మి అన్నపూర్ణ సేకరించిన రూ. 6,01,000 మొత్తాన్ని రాకేష్‌సింగ్ తికాయత్‌కు అందజేశారు. సదస్సుకు ఏపి రైతు సంఘం అధ్యక్షులు వై.కేశవరావు స్వాగతం పలికారు. రైతు సంఘం నాయకులు కెవివి ప్రసాద్ వందన సమర్పణ చేశారు.

డెయిరీల ఆస్తులను లీజుకు ఇవ్వొద్దు

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి ఏపి రైతు సంఘం ఖండన

రాష్ట్రంలో మూతపడిన పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ఆస్తులను అమూల్ కంపెనీకి లీజుకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని ఏపి రైతు సంఘం ఖండించింది. ఈ మేరకు రైతు సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై.కేశవరావు, మర్రాపు సూర్యానారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకూ నడుస్తున్న గ్రామ పాల ఉత్పత్తిదార్ల సంఘాలను జనవరి ఒకటి నుంచి రాష్ట్ర ప్రభుత్వమే మూయించి, వాటి పరిధిలో అమూల్ పాల సేకరణ కేంద్రాలను పెట్టించిందని, ఇప్పుడు మూతపడిన అన్ని సహకార సంఘాల పరిధిలోని ఆస్తులను అమూల్‌కు లీజుకు ఇస్తామని ప్రభుత్వం నిర్ణయించడం శోచనీయమన్నారు. ఇప్పటికే చిత్తూరు, కడప, ఒంగోలు డెయిరీల పరిధిలో అమూల్ కంపెనీ పాల సేకరణకు ఒప్పందం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా రాష్ట్రంలో మూతపడిన అన్ని సహకార డెయిరీల ఆస్తులను అమూలుకు లీసుకు ఇస్తామని నిర్ణయించడం వల్ల రాష్ట్రంలో సహకార డెయిరీ వ్యవస్థ మరింతగా బలహీనపడుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో మూడంచెల సహకార డెయిరీ వ్యవస్థ ఉనికిలో ఉందన్నారు. గ్రామ పాల ఉత్పత్తిదార్ల సంఘాలు, జిల్లా డెయిరీ సహకార సంఘం, రాష్ట్ర ఫెడరేషన్ వ్యవస్థ ఉందని, వీటి పరిధిలో విలువైన ఆస్తులున్నాయని అన్నారు. ఇవి రైతుల, కార్మికుల శ్రమతో సమకూర్చబడ్డాయని, ఈ విధంగా దశాబ్దాల కాలంగా సహకార రంగంలో సమకూర్చుకున్న ఆస్తులు, సహకార

సంఘాలు రైతు నిర్వహణలోనే ఉండాలని అన్నారు. గ్రామ, జిల్లా సంఘాలకు తాజాగా ఎన్నికలు జరిపి, ఎన్నికైన పాలకవర్గాలకు బాధ్యతలు అప్పగించాలని కోరారు. అమూల్ నేరుగా సహకార సంఘంతోనే ఒప్పందం చేసుకోవాలన్నారు. కనుక ప్రభుత్వం అమూల్‌తో లీజు ఒప్పందం మానుకొని, సహకార సంఘాలకు 1964 సహకార చట్టం ప్రకారం ఎన్నికలు జరిపి, ఎన్నికైన పాల వర్గాలకు బాధ్యతలు అప్పగించి వారితోనే అమూల్ ఒప్పందం చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గతంలో ప్రకటించినట్లు సహకార డెయిరీలకు పాలుపోసిన రైతులందరికీ లీటరుకు నాలుగు రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.



కరోనా కల్లోలంలో జనాన్ని ముంచేస్తున్న మోడీ



వి. శ్రీనివాసరావు
ఎ.పి రైతు సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి

వ్యాక్సిన్ డిప్లమసీ పేరుతో ఖ్యాతి వస్తుందని నమ్మించి మన వ్యాక్సిన్ విదేశాలకు పంపారు. ఈలోగా దేశంలో కొరత వచ్చింది. ఒక డోసు తీసుకున్న వారికి రెండో డోసుకు ఉంటుందో లేదో తెలియని పరిస్థితి. ఏప్రిల్ 11 నుండి 14 వరకు 'వ్యాక్సిన్ మహోత్సవం' పేరుతో మారుమోగించారు. కాని వ్యాక్సిన్ లేకుండానే 'వ్యాక్సిన్ ఉత్సవం' అంటే ప్రపంచమే నవ్విపోతుంది. ఈ మహమ్మారిని ఎదిరించడానికి అవసరమైన వ్యాక్సిన్ ప్రభుత్వమే ప్రజలకు అందించాలి. కాని మోడీ ప్రభుత్వం దాన్ని సైతం వ్యాపారంగా మార్చేసింది.

దేశాన్ని మరో కరోనా ప్రవాహం ముంచెత్తుతోంది. ఇది గత సంవత్సరం దాని కన్నా మరింత తీవ్రంగా ఉంది. వేగంగా విస్తరిస్తోంది. గ్రామాలను కూడా ముంచెత్తుతోంది. ఈసారి యువతరం ఎక్కువగా దీని బారిన పడుతున్నారు. మరణాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఇది అక్షరాలా ప్రజారోగ్య సంక్షోభమే. ఇది సాధారణ ఆరోగ్య అత్యవసర పరిస్థితికన్నా తీవ్రమైనది. భారత దేశం ఇంత దీనావస్థలో మునుపెన్నడూ లేదు. మనల్ని చూసి ప్రపంచమే నివ్వెరపోతోంది. భారతదేశం కరోనాలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని న్యూయార్క్ టైమ్స్ పత్రిక వెల్లడించింది. ఆర్థిక రంగంలో అగ్రస్థానం లోకి రాకున్నా కరోనాలో మొదటి స్థానం సాధించినందుకు మోడీని అభినందించాలి. ఈ వైరస్ బారినపడుతున్న వారి సంఖ్య అధికారిక లెక్కల కన్నా ఎన్నో రెట్లు ఎక్కువ వుంటుందని, ప్రభుత్వం వాస్తవాలను దాస్తున్నదని మీడియాలో విశ్లేషణలు వస్తున్నాయి. మన అనుభవం చూసినా ఇది నిజమని అర్థమవుతుంది.

నీరో చక్రవర్తిలా మోడీ మహారాజా

మోడీ తీరు చూస్తుంటే రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయించుకుంటున్న చక్రవర్తి లాగా ఉన్నారు. దేశమంతా కరోనా భయంతో గగ్గోలు పెడుతుంటే ఆయన బెంగాల్ చుట్టూ తిరుగు తున్నారు. ఢిల్లీలో కూర్చొని మన్ కీ బాత్ లో మాట్లాడుతూ జనం గుమికూడొద్దని, దూరం ఉండాలని సుద్దులు చెపుతారు. ఆయనే బెంగాల్ వెళ్లి అంత జనాన్ని పోగేసినందుకు తమ కార్యకర్తల్ని పొగుడుతారు. ఈ రెండు నాల్కల ధోరణి కరోనా వ్యాప్తికి కారణమవుతోంది. ఆయనకన్నా తామేమీ తక్కువ తినలేదని కుంభమేళాలో లక్షలాదిమందిని చూసి భక్తబృందం మురిసిపోతుంది. అంతేకాదు గంగా జలాల్లో మునిగితే కరోనా దగ్గరకు కూడా రాదని సూక్తులు వినిపిస్తున్నారు. గత సంవత్సరం ఢిల్లీలో తబ్లిక్ సమావేశంపై బిజెపి చేసిన దాడిని మరిచిపోలేం. మానవత్వాన్ని మరచి మతాన్ని బట్టి తీర్పునివ్వడం మతోన్మాదులకు సహజ నైజం. జనం హాహాకారాలు మోడీ చెవిన పడటం లేదు. మోడీ భక్తబృందం జనం ఏడవటానికి నోరు తెరిచినా నొక్కేస్తున్నారు. మేధావులు, ప్రతిపక్షాలు సూచనలు చేసినా సహించలేకపోతున్నారు. వారిపై దేశద్రోహులని ముద్ర వేస్తున్నారు. సిపియం నాయకులు సీతారాం ఏచూరి కుమారుడు చనిపోతే దేశమంతా విచారం వ్యక్తం చేసింది. కాని మోడీ బృందానికి ఆ మాత్రం ఇంగిత జ్ఞానం కూడా లేదు. బీహార్ ఎమ్మెల్యే ఒకరు ఈ సందర్భాన్ని ఉపయోగించుకొని ఏచూరిని చైనా ఏజెంటు అంటూ ఆయన కొడుకును చైనా వైరస్ కాటేసిందని వాగాడు. దేశమంతా ఛీకొట్టినా వారికి సిగ్గులేదు. తమ నాయకుడు చేసిన నీచపు వ్యాఖ్యలకు బిజెపి కనీసం విచారంకూడా వ్యక్తం చేయలేదు. అదీ వారు నేర్చుకున్న భారతీయ సంస్కృతి. వారిని చూసి భరతమాత సిగ్గుతో తల దించుకుంటోంది.

ప్రజారోగ్యంతో ప్రభుత్వాల చెలగాటం

కరోనా కల్లోలం ఇంత తీవ్రంగా ఉన్నా దాన్ని నిరోధించడంలోను, ప్రజలకు ఉపశమనం కల్పించడంలోను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలయ్యాయి. టెస్టింగు, ట్రేసింగు, ట్రీట్మెంటు అనే త్రి సూత్ర పథకాన్ని

అమలు చేయాలి. కాని ఈసారి పరీక్షల లేమి, ఆస్పత్రులలో పడకల కొరత, ఆక్సిజన్ కొరత, మందుల బ్లాక్ మార్కెటింగు ఇలా అన్నీ సమస్యలే.

పరీక్షలేవీ ?

రోగ లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయాలి. కాని పాత పరీక్షా కేంద్రాలన్నింటికీ ఎత్తేశారు. రాపిడ్ టెస్టులు జరగ డం లేదు. ఇక ఆర్‌టిపిసిఆర్ టెస్టుకిస్తే ఫలితం ఎప్పుడొ స్తుం దో తెలియదు. ఈలోగా పేషంట్లు కలసిమెలసి తిరుగుతూనే ఉంటారు. ఇతరులూ దాని బారిన పడతారు. టెస్టు ఫలితం రాకముందే ఆస్పత్రిపాలై అసువులుబాసినవారున్నారు. ఇంత టి హృదయ విదారకరమైన దుస్థితి గతంలో కూడా లేదు.

బెడ్లు లేవు

ఒక వేళ పాజిటివ్ వస్తే ఆస్పత్రిలో బెడ్లు దొరకడం లేదు.ఇంటి దగ్గరే ఐసొలేషన్ లో ఉన్నా ఉన్నట్లుండి ఆక్సిజన్ శాతం తగ్గిపోతే ఆస్పత్రుల చుట్టూ తిరిగినా బెడ్డు దొరకడం లేదు. దానికీ పెద్ద పెద్ద రికమెండేషన్లు కావాల్సి వస్తోంది. అయినా దొరక్క అలసిపోయి ఆస్పత్రుల ముందే నేలకొరిగిన వారూ ఉన్నారు. పేదవారే కాదు మధ్యతరగతి ఆపైన వర్గాల వారికి కూడా తిప్పలు తప్పలేదు.

బ్లాకులో మందులు

బెడ్డు దొరికించుకున్నా రెమ్‌డెసివిర్ లాంటి మందులు రాస్తే వాటి కోసం కాళ్లకు బలపం కట్టుకొని తిరగాల్సి వస్తోంది. ఎన్ని మందుల షాపు చుట్టూ తిరిగినా దొరక్క బ్రోకర్లను పట్టుకొని మూడు వేలుండే ఇంజక్షన్‌ను ముప్పయి నలభై వేలు పెట్టి బ్లాకులో కొనుక్కోవాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో మందుల బ్లాక్ మార్కెట్ గురించి వినడం ఇదే తొలిసారి. మందుల కంపెనీలే లాభాల కోసం వాటిని దాచిపెట్టి అమ్ముతున్నాయా? లేదంటే మధ్య దళారీలు బ్లాక్ చేస్తున్నారా? ఇంతవరకు ప్రభుత్వానికే అంతుబట్టలేదా? లేదా తెలిసీ చెప్పడం లేదా? ఏమైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యానికి ఇంతకన్నా పెద్ద నిదర్శనం ఇంకేమి కావాలి? రెమ్‌డెసివిర్ లాంటి మందుల్ని తయారు చేసే కంపెనీలు రెండూ మూడే ఉన్నాయి. వారు ఇతర దేశాలకు వాటిని ఎగుమతి చేసి లాభాలు పోగేసుకుంటున్నాయి. వాటిపై ప్రభుత్వానికి ఎలాంటి నియంత్రణా లేదు.

ఆక్సిజన్‌కు దిక్కు లేదు

ఆక్సిజన్ సరఫరా లేక ఆస్పత్రులలో జనం గిలాగిలా కొట్టుకొని డాక్టర్ల కళ్ల ముందే వారు కళ్లు మూస్తుంటే డాక్టర్లు కన్నీళ్లు పెట్టుకోవడం మినహా ఇంకేమీ చేయలేని తమ నిస్సహాయతకు తామే సిగ్గుపడే స్థితి నేడు కనిపిస్తున్నది. ఆక్సిజన్ కొరత దేశ రాజధానిలోని పెద్దపెద్ద కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే వచ్చింది. ఆక్సిజన్ సరఫరా లేక విజయనగరం ఆస్పత్రిలో పదిమంది దాకా చనిపోవడం ఎవరికైనా కన్నీరు పెట్టిస్తుంది. అర్ధరాత్రి హాహాకారాలతో ఆస్పత్రి ఆవరణంతా మారుమోగిపోయింది. మన రాష్ట్రంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ తగినంత ఆక్సిజన్ తయారు చేస్తున్నా దాన్ని సరిగ్గా వినియోగించుకోవడంలో మన రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఒకవైపు ఆక్సిజన్ కొరత లేదని మంత్రులు పదేపదే ప్రకటిస్తున్నారు. మరో వైపు అన్ని ఆస్పత్రులూ ఆక్సిజన్ కొరతతో అల్లాడుతున్నాయి. మరీ ముఖ్యంగా చిన్న ఆస్పత్రులకు అసలు సరఫరానే లేదు. మధ్యలో ఆక్సిజన్ ఎలా ఆవిరైపోతున్నది.

పథకాలు అవసరమే...కానీ ప్రజల ప్రాణం అంతకన్నా ముఖ్యం

ఘన రాష్ట్ర ప్రభుత్వం రోజువారి పథకాల అమల్లో మునిగి తేలుతోంది. వివిధ పథకాల ద్వారా ఈ క్లిష్ట సమయంలో ప్రజలకు సహాయం అందించడం ముఖ్యమే. కాని దానికి ముఖ్యమంత్రి స్థాయిలో అన్ని పనులు పక్కనపెట్టి ప్రారంభాలు చేసి పంచాల్సిన అవసరం లేదు. వాటిని రొటీన్ గా బ్యాంకులో జమ చేయొచ్చు. విలువైన ఆ సమయాన్ని కరోనా నివారణకు వినియోగించి ఉంటే దీని నష్టాన్ని కొంతవరకైనా తగ్గించడానికి అవకాశం ఉండేది. ప్రభుత్వం ముందే మేల్కొని ఉంటే ఐసొలేషన్ లేదా క్వారంటైన్ కేంద్రాలను తెరచి చాలా మందికి ఊరట కల్పించి ఉండొచ్చు.

నరకం చూస్తున్న పేషంట్లు

మరో వైపు ప్రైవేటు ఆస్పత్రులలో ఇదే అదనుగా టెస్టుల పేరుతో వేలకు వేలు గుంజేస్తున్నారు. హోం క్వారంటైన్ లో వుండే వారికి ఆన్‌లైనులో వైద్యం అందించడానికి లేదా కనీసం మందుల కిట్ ఇవ్వడానికి కూడా సరైన ఏర్పాట్లు లేవు. మారుమూల ప్రాంతాల ప్రజలు ఇక చెప్పనలవి కాదు. పట్టణాల్లోనే పేషంటు పరిస్థితి తీవ్రమైన వెంటనే 104 లేదా 108 అంబులెన్సు కోసం ఫోన్ చేస్తే వస్తున్నట్లే ఉంటుంది కానీ ఎప్పటికో కానీ రాదు. రాత్రి చేస్తే ఉదయానికి వచ్చిన ఘటనలు కూడా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మాటల్లో తప్ప భరోసా ఆచరణలో కనిపించడం లేదు. ఒకటి రెండు రోజుల నుండి కొంత ప్రయత్నం మొదలైనా అది తీవ్రతకు తగ్గట్లుగా లేదు.

వ్యాక్సిన్ సరఫరాలో వైఫల్యం.

అన్నింటిలోకి పెద్ద వైఫల్యం వ్యాక్సిన్. గత సంవత్సరం ఆగస్టు 15కే భారతీయ వ్యాక్సిన్ వచ్చేస్తుందని డబ్బా వాయించారు ప్రధాని. వాస్తవాలతో నిమిత్తం లేకుండా బడాయికి పోయి ప్రజల్ని భ్రమల్లో ముంచారు. అయినా జనవరి నాటికి రెండో దశ టెస్టింగు పూర్తి చేసుకొని మూడో దశ టెస్టు నేరుగా ప్రజల మీద చేయడానికి అనుమతినిచ్చింది. రెండు కంపెనీలు ప్రధానంగా వీటిని తయారు చేస్తున్నాయి. కోవిషీల్డు పేరుతో సీరం సంస్థ (పూనా) ఆక్స్‌ఫర్డు నుండి దిగుమతి చేసుకున్న టీకాను అభివృద్ధి చేసింది. కోవాగ్జిన్ పేరుతో భారత్ బయోటెక్ (హైదరాబాద్) దేశీయ టీకాను తయారు చేసింది. రెండూ ముడి సరుకును విదేశాలు ముఖ్యంగా అమెరికా, యూరోపుల నుండి దిగుమతి చేసుకోవాలి. కాని అమెరికా ఎగుమతులపై ఆంక్షలు పెట్టింది. దానితో మన ఉత్పత్తి నిలిచిపోయింది. అప్పటికే విదేశాలకు ఎగుమతి చేయడానికి మన ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇది కూడా అమెరికా ఒత్తిడి ఫలితమే. వ్యాక్సిన్ డిప్లమసీ పేరుతో ఖ్యాతి వస్తుందని నమ్మించి మన వ్యాక్సిన్ విదేశాలకు పంపారు. ఈలోగా దేశంలో కొరత వచ్చింది. ఒక డోసు తీసుకున్న వారికి రెండో డోసుకు ఉంటుందో లేదో తెలియని పరిస్థితి. ఏప్రిల్ 11 నుండి 14 వరకు వ్యాక్సిన్ మహోత్సవం పేరుతో మారుమోగించారు. కాని వ్యాక్సిన్ లేకుండానే వ్యాక్సిన్ ఉత్సవం అంటే ప్రపంచమే నవ్విపోతుంది. కరోనా

నివారణకు వ్యాక్సిన్ మినహా మరో మార్గం లేదని శాస్త్రవేత్తలు, డాక్టర్లు చెప్తున్నారు. ఈ మహమ్మారిని ఎదిరించడానికి అవసరమైన వ్యాక్సిన్ ప్రభుత్వమే ప్రజలకు అందించాలి. చాలా దేశాలు అలా అందిస్తున్నాయి కూడా. కాని మోడీ ప్రభుత్వం దాన్ని సైతం వ్యాపారంగా మార్చేసింది. ఈ రెండు కంపెనీల నుండి కేంద్రం సగం రూ. 150కు సేకరించి 45 సంవత్సరాలు దాటిన వారికి అందిస్తుంది. మిగతా వారికి అంటే 18-45 సంవత్సరాల మధ్య వారు ప్రైవేటు ఆస్పత్రుల్లో డబ్బులు పెట్టి కొనుక్కోవాలని మొదట ప్రకటించింది. ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో వెంటనే మాట మార్చి రాష్ట్ర ప్రభుత్వాలు కొనుక్కొని ఉచితంగా ఇవ్వొచ్చని చెప్పి తాను బాధ్యత నుండి తప్పుకుంది. రాష్ట్ర ప్రభుత్వాలకైతే రూ.600 కు, ప్రైవేటు ఆస్పత్రులకు రూ.1200కు అమ్మాలని కేంద్రం నిర్దేశించింది. ఇంతకన్నా వివక్షత ఏమన్నా ఉందా? ఏ కంపెనీ అయినా ప్రైవేటువారికే అమ్ముకుంటుంది తప్ప సేవాతత్పరతతో రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వదు. మే 1 నుండి 18 సంవత్సరాలు దాటిన వారికి కూడా ఉచితంగా టీకాలు వేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి మరల వెనక్కి తగ్గింది. కారణం టీకాలు లభ్యం కాకపోవడమే. అమ్మ పెట్టదు అడుక్కోనివ్వదన్న చందంగా కేంద్రం వ్యవహరిస్తోంది.

వైద్యం కార్పొరేట్ పరం

వైద్యో నారాయణో హరి అన్నారు పెద్దలు. కాని నేటి పాలకులు వైద్యో కార్పొరేట్ హరీ అంటున్నారు. వైద్య రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ పరం చేసిన దుష్ఫలితం ఇది. వ్యాపారం చేయడం ప్రభుత్వం పని కాదని నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యకు అర్థం ఇదే. విద్య, వైద్యం లాంటి సేవారంగాలను కార్పొరేట్ పరం చేస్తే ఎలాంటి దుష్ఫలితాలు వస్తాయో, సమాజం ఎంతగా నష్టపోతుందో దీన్ని బట్టి మనకు స్పష్టమవుతుంది. మోడీ పాలనా సామర్థ్యంపై యువతలో కనువిప్పు విధానాల వైఫల్యంతో పాటు యాజమాన్య లోపాలూ కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు మోడీ పెద్ద సమర్థుడైన పాలకుడని నమ్మినవారి కళ్లు తెరుచుకుంటున్నాయి. డబ్బాలో గులకరాళ్లు వేసి కొడితే వచ్చినట్లు శబ్దాడంబరం తప్ప ఆచరణ శూన్యమని దేశం నేడు కోడై కూస్తోంది. కంచు మోగినట్లు కనకంబు మోగునా అని ఏనాడో ఒక కవి అన్నాడు. అది మోడీ విషయంలో నూటికి నూరు పాళ్లూ నిజం. మోడీ బంగారం అనే నోళ్లే నేడు కరోనా సంక్షోభంలో ఆయన నాయకత్వ తీరును చూసి అది బంగారం కాదు కంచు మోతే అంటున్నాయి.

పాలకుల విధానాలపై గొంతు విప్పాలి

అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును మార్చాలంటే ప్రజలు గొంతు విప్పక తప్పదు. కరోనా భయంతో వెనకడుగు వేయకుండా ధైర్యంగా ముందుకొచ్చి ముఖ్యంగా యువతరం గొంతు విప్పాలి. ఆరోగ్యం మన జన్మహక్కని అరవాలి. దాని కోసం రోడ్డు మీదకు రావాల్సిన అవసరం లేదు. ఇంట్లో ఉండి కూడా సోషల్ మీడియా ద్వారా మీ గొంతు వినిపించవచ్చు. పాలకుల కళ్లు తెరిపించడానికి మేము సైతం అంటూ ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. సార్వజనీన వ్యాక్సినేషన్ ఉచి తంగా వేయాలని డిమాండు చేయాలి. బ్లాక్ మార్కెటింగుపై యుద్ధం ప్రకటించాలి. ప్రభుత్వాల మత్తు వదిలిం చాలి. ప్రజా చైతన్యమనే కొరడాతో ప్రభుత్వాలను మేల్కొలపాలి. ✱

నల్లచట్టాలు రద్దయ్యే వరకు పోరాటం ఆగదు

రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ప్రతిజ్ఞ

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేసిన వ్యవసాయ నల్ల చట్టాలు రద్దయ్యే వరకు పోరాటం ఆగదని ఏపి రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ప్రతిజ్ఞ బూనాయి. గుంటూరు జిల్లా, వడ్డేశ్వరంలోని కెబి భవన్ వద్ద రైతు, వ్యవసాయ కార్మిక, కౌలురైతు సంఘాలు సంయుక్తంగా మే డే ను శనివారం నిర్వహించాయి. ఈ సందర్భంగా మూడు సంఘాల జెండాలను ఆయా సంఘాల రాష్ట్ర నాయకులు మర్రాపు సూర్యనారాయణ, దడాల.సుబ్బారావు, పి.జమలయ్యలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... భారతదేశ వ్యవసాయ రంగాన్ని పెట్టుబడిదార్లు, కార్పొరేట్లకు కట్టబెట్టి రైతు కూలీలను రోడ్డున పడేయడానికి బిజెపి ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను, విద్యుత్ బిల్లులను తెచ్చిందని అన్నారు. వీటిని రద్దు చేయాలని గత 5 నెలలుగా దేశవ్యాప్తంగా రైతాంగం పోరాటాలు చేస్తోందని తెలిపారు. ఇప్పటికి వందలాది మంది రైతులు ఆత్మ బలిదానంగావించబడ్డారని అన్నారు. వీరి స్ఫూర్తితో భారతదేశ

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల కబంధ హస్తాల నుండి కాపాడుకుంటామని, చట్టాలు రద్దయ్యేవరకు పోరాటం విరమించబోమని ప్రతిజ్ఞ బూనారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ✱



ఎరువుల ధర మోత

ఎం. కోటేశ్వరరావు
సీనియర్ పాత్రికేయులు

రైతాంగానికి తమ పంటలకు గిట్టుబాటు ధరలు ఎంత ముఖ్యమో వాటిని సాగు చేసేందుకు అవసరమైన పెట్టుబడులు-వాటి ధరలు కూడా అంతే ప్రాధాన్యత కలిగి ఉంటాయి. ఇఫ్‌కో సంస్థ ప్రస్తుతం ఉన్న మిశ్రమ ఎరువుల ధరలపై 45 నుంచి 58 వరకు పెంచుతూ ఒక ప్రకటన చేసింది. కొన్ని వార్తల ప్రకారం ఈ కంపెనీ తన మేనేజర్లకు పంపిన సమాచారం బయటకు పొక్కటంతో వాటిని నిర్ధారిస్తూ ప్రకటన చేయాల్సి వచ్చింది. యూరియా మినహా ఇతర ఎరువుల మీద ప్రభుత్వ నియంత్రణ ఎత్తివేసిన విషయం తెలిసిందే.

తాజా పెంపు ప్రతిపాదన రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగించేదిగా కనిపించటంతో అనూహ్యంగా ప్రభుత్వమే వేగంగా స్పందించింది. అయితే ఇది ఎత్తుగడా? చిత్తశుద్ధి ఎంత? కేంద్ర మంత్రి ప్రకటించినట్లుగా దౌత్య మార్గాల ద్వారా దిగుమతి చేసుకొనే ఎరువులు, ముడి పదార్థాల ధరలను నిజంగా తగ్గించటం సాధ్యమేనా? ఇలాంటి ప్రయత్నం ముడి చమురు విషయంలో, ఇతర దిగుమతుల విషయంలో ఎందుకు చేయటం లేదు? వ్యాపార విషయాల్లో దౌత్య పద్ధతులు ఎంత మేరకు సఫలీకృతం అవుతాయి? మేం ప్రయత్నించాం, సాధ్యం కాలేదు, దేశం కోసం భారం భరించక తప్పదు అనే పేరుతో చివరకు రైతుల మీద మోపుతారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇఫ్‌కో సంస్థ మన దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అతి పెద్ద సహకార సంస్థ. దేశంలో 19 శాతం యూరియా, 29 శాతం మిశ్రమ ఎరువుల మార్కెట్ వాటా కలిగి ఉంది. ఉత్పత్తి-మార్కెటింగ్ కార్యకలాపాలే కాదు, ఇతర రంగాల్లోకి కూడా అది ప్రవేశిస్తోంది. ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి రానున్న ధరల పెంపుదల ప్రకటన వెలువడగానే ప్రభుత్వం రంగంలోకి దిగి ఇఫ్‌కోతోపాటు ఇతర ఎరువుల కంపెనీలతో సంప్రదింపులు ప్రారంభించింది. అంతర్గతంగా ఏమి జరిగిందో తెలియదు, ప్రస్తుతం ఉన్న నిల్వలు అయిపోయేంతవరకు పాతధరలకు విక్రయిస్తామని కంపెనీలు హామీ ఇచ్చినట్లు ప్రకటనలు వెలువడ్డాయి. దీనికి నిజంగా కంపెనీలు కట్టుబడి ఉంటాయా, అమలు చేసేందుకు ప్రభుత్వాలు పూనుకుంటాయా అన్నది చెప్పలేము. ఫ్యాక్టరీల నుంచి వెలువడిన ఎరువుల సంచుల మీద పాత ధరలు ముద్రించిన నిల్వల వరకు ఆ ధరలే ఉంటాయని వార్తలు వచ్చాయి. అవి ఎన్ని ఉన్నాయి? ప్రభుత్వం వైపు నుంచి స్పష్టంగా ప్రకటన లేదు. చిల్లర, టోకు వర్తకులు, రవాణా కేంద్రాలు, గోడౌన్లలో ఉన్న ఎరువులను పాత ధరలకు విక్రయిస్తామని చెప్పినట్లు, ఇఫ్‌కో సంస్థ వద్ద 11.25 లక్షల టన్నుల పాత నిల్వలు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. పాత రేట్లతో ముద్రించిన ఎరువులను మాత్రమే విక్రయించాలని మార్కెటింగ్ విభాగాన్ని ఆదేశించినట్లు ఇఎఫ్‌కో ఎమ్‌డీ యుఎస్ అవస్తి చెప్పారు.

కొద్ది నెలలుగా అంతర్జాతీయంగా ఎరువుల ధరల పెరుగుదల, మన దేశంలో ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేని కారణంగా ముందు చూపుతో తయారీదారులు ఉత్పత్తి నిలిపివేశారా? ఇవన్నీ ఇప్పటికైతే సమాధానం లేని ప్రశ్నలే. ఈ ఏడాది ఖరీఫ్ వరకు పాత ధరలకే ఎరువులు లభిస్తాయని మంత్రులు నమ్మబలుకుతున్నారు. ఈ రంగంలో అసలేం జరుగుతోందో, పాలకుల హామీలు ఏ మేరకు అమలు

జరుగుతాయో చూద్దాం. ఏప్రిల్ ఎనిమిదవ తేదీన ఎరువుల సంచులపై కొత్త ధరలను ముద్రించింది. అయితే అవి సుమారు ధరలు మాత్రమే అని - రైతుల కోసం ముద్రించినవి కాదని పేర్కొనటం గమనార్హం. శివకాశీ బాణసంచా ధరల మాదిరి ఇలా కూడా ముద్రిస్తారా?

ఇఫ్‌కో సంస్థ ప్రకటించిన ప్రకారం ఎరువుల ధరల పెంపుదల ప్రతిపాదన ఇలా ఉంది. (50 కిలోల ధర రూపాయల్లో)

ఎరువు రకం	పాత ధర	కొత్త ధర
10:26:26	1,175	1,775
12:32:16	1,185	1,800
20:0:13	925	1,350
డిఏపి	1,200	1,900

ఇంత భారీ ఎత్తున ధరలను పెంచితే రైతాంగం మీద పెను భారం పడనుంది. ఇప్పటికే మూడు వ్యవసాయ చట్టాల రద్దును కోరుతూ చేస్తున్న రైతాంగ ఆందోళన మరింతగా పెరిగేందుకు ఇది తోడ్పడుతుంది. గత పది సంవత్సరాలుగా ఎరువుల మీద ఇస్తున్న సబ్సిడీ మొత్తాలలో ఎలాంటి మార్పు లేదు. అంతకు మించి కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. పెరిగిన మేరకు అదనపు భారాన్ని రైతులే భరిస్తున్నారు. ఇప్పుడు పెరిగేది కూడా పూర్తిగా వారే మోయక తప్పదు. ఎరువుల తయారీకి దిగుమతి చేసుకుంటున్న ముడి వస్తువుల ధరలు, దిగుమతి ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిన కారణంగా ధరలు పెంచక తప్పదని ఉత్పత్తిదారులు చెబుతున్నారు. ఎరువుల శాఖ మంత్రి డివి సదానంద గౌడ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడారు. సరఫరా సక్రమంగా ఉంటే, దిగుమతుల ధరలు తగ్గితే తాము ధరలను పెంచాల్సిన అవసరం ఉండదని, అందువలన ప్రభుత్వం ఆ మేరకు చర్యలు తీసుకోవాలని బంతిని అటువైపు నెట్టారు. మొరాకో, రష్యా దేశాల నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న ఎరువులు, ముడి సరకుల మీద బైడెన్ సర్కార్ దిగుమతి సుంకాలను గణనీయంగా పెంచింది. అందువలన వాటిని సరసమైన ధరలకు మన దేశానికి మరలిస్తే ఉపయోగమని కంపెనీల ప్రతినిధులు చెప్పారు. దౌత్యపరమైన చర్యల ద్వారా ఆ ప్రయత్నం చేస్తామని, అంతవరకు ధరలు పెంచవద్దని మంత్రి కోరారు. ఇది సాధ్యమేనా? ప్రయివేటు కంపెనీలకు మరో రూపంలో మనం ప్రయోజనం కలిగిస్తే అవి ఎరువులను తక్కువకు మనకు ఇస్తాయి. రైతులకు ఎరువుల సబ్సిడీ పెంచటానికే మొరాయిస్తున్న సర్కార్ విదేశీ కంపెనీలకు అలాంటి లబ్ధి చేకూర్చేందుకు పూనుకుంటుందా?

అమెరికా, బ్రెజిల్, చైనాలలో ఎరువుల వినియోగం ఎక్కువగా ఉన్నందున అక్కడి నుంచి గిరాకీ కారణం కూడా అంతర్జాతీయ మార్కెట్లో ధరల పెరుగుదలకు దారితీసింది. మన ప్రధాని నరేంద్రమోడీ పలుకుబడి కారణంగా ఒకవేళ మనకు సరఫరా చేసే ఎరువులు, ముడిసరకుల ధరలను తగ్గిస్తే మిగతా దేశాలు చూసూ్తా ఊరుకుంటాయా? ఐరోపా, అమెరికా మార్కెట్లలో డిఏపి ఎరువుకు మంచి డిమాండ్ ఉంది. గతేడాది అక్టోబరులో డిఏపి టన్ను ధర 400 డాలర్లు ఉండగా ఇప్పుడు 540 డాలర్లవరకు పెరిగింది.

ఇఫ్‌కో డిఏపి కొత్త ధర రూ.1,900 అని ప్రకటించగా అదే ఎరువు ధరను క్రిబ్‌కో, జువారీ, పారాదీప్, ఎంసిఎఫ్ఎల్ రూ.1,700 అని, చంబల్ ఫెర్టిలైజర్స్ రూ..1,600, ఇండోరామ్ రూ..1,495గా పేర్కొన్నాయి. గత ఆరేళ్ల కాలంలో దేశంలో రసాయన ఎరువుల వినియోగం 16శాతం లేదా 2015-16 నుంచి 2020-21 మధ్య 510లక్షల టన్నుల నుంచి 590లక్షల టన్నులకు పెరిగింది. వీటిలో యూరియా 55 నుంచి 60శాతం వరకు ఉంటున్నది. ఎరువుల వినియోగం పెరుగుతున్నప్పటికీ వాతావరణ పరిస్థితులను బట్టి హెచ్చు తగ్గులు ఉంటున్నాయి. గత పదేళ్ల సగటును చూసినపుడు 500 లక్షల టన్నులు ఉంది. గత ఆరేళ్లలో 2020-21లో డిఏపి, మిశ్రమ ఎరువుల వాడకం ఎక్కువగా ఉన్నట్లు ఫిబ్రవరి వరకు అందిన సమాచారం వెల్లడించింది.

కేంద్ర ప్రభుత్వం రాజ్యసభకు అందించిన సమాచారం ప్రకారం సగటున హెక్టారుకు 2015-16లో ఎరువుల వినియోగం 135.76 కిలోలు ఉండగా మరుసటి ఏడాదికి 123.41కి తగ్గింది, 2019-20కి 133.44 కిలోలకు పెరిగింది. పైన పేర్కొన్న పట్టిక ప్రకారం నాలుగు ఎరువులను కలిపి 50 కిలోల యూనిట్‌గా తీసుకుంటే సగటున పాత ధర రూ.1,121 ఉంది, పెంపుదల అమల్లోకి వస్తే రు.1,706 అవుతుంది. ఈ లెక్కన దేశ సగటు వినియోగాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే ఒక హెక్టారుకు పెరిగే పెట్టుబడి భారం రు.2,991 నుంచి రు.4,553కు పెరుగుతుంది. గరిష్ట స్థాయిలో బీహార్‌లో హెక్టారుకు 245.25 కిలోలు వినియోగిస్తుండగా అత్యల్పంగా కేరళలో 36.49 కిలోలు మాత్రమే వినియోగిస్తున్నారు. సగటున రెండువందల కిలోలు వినియోగిస్తున్న రాష్ట్రాలలో పంజాబ్, హర్యానా, తెలంగాణా ఉన్నాయి. దేశ సగటు కంటే తక్కువ వినియోగం ఉన్న రాష్ట్రాలలో మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, చత్తీస్‌ఘర్ ఉన్నాయి. దీన్ని మరోవిధంగా చెప్పాలంటే బీహార్‌లో ఒక హెక్టారు ఉన్న రైతుకు భారం రు.2,991 నుంచి రు.4,553కు పెరిగితే అదే కేరళలోని రైతుకు రు.818 నుంచి రు.1,245కు పెరుగుతుంది. బీహార్ రైతుకు అదే విధంగా కేరళ రైతుకు కేంద్రం నిర్ణయించే ధాన్య మద్దతు ధర ఒకే విధంగా ఉంటుంది.(బీహార్‌లోని బిజెపి-జెడియు సర్కార్ రైతులను గాలికి వదలి వేస్తే కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వం అదనంగా చెల్లిస్తున్నది అది వేరే విషయం.)

మన కంపెనీలు ఎరువుల ధరలు పెంచటం గురించి బెలారస్ (పూర్వపు సోవియట్ యూనియన్‌లోని బైలో రష్యా రిపబ్లిక్) బెలారష్యన్ పొటాష్ కంపెనీ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. జనవరి నెలలో అంగీకరించిన దానికంటే 13శాతం అదనంగా టన్ను ధర 280 డాలర్లకు తాము ఇండియన్ పొటాష్ లిమిటెడ్‌తో కొత్త కాంట్రాక్టు



(ఏప్రిల్) కుదుర్చుకున్నామని కంపెనీ తన వెబ్‌సైట్‌లో వెల్లడించింది. ఈ కంపెనీయే చైనాకు ఏడాది పాటు ఇదే ధరకు సరఫరా చేసేందుకు ఫిబ్రవరిలో ఒప్పందం చేసుకుంది. ఇదే విధంగా ఇజ్రాయెల్‌కు చెందిన ఐసిఎల్ గ్రూప్ కూడా గతం కంటే 50 డాలర్లు అదనంగా అదే ధరకు ఇండియన్ పొటాష్‌కు ఆరులక్షల టన్నులు అందించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు ప్రకటించింది. అయితే బెలారస్ కంపెనీ కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఇతర దేశాల్లోని పొటాష్ కంపెనీలు తప్పు పట్టాయి. ఈ ధరలు మార్కెట్ స్థితిని ప్రతిబింబించటం లేదని, తాము ఆ ధరకు విక్రయించేది లేదని ప్రకటించాయి. బెలారస్ కంపెనీ పెంచినది 13శాతం అయితే మన కంపెనీలు 50శాతంపైగా పెంపుదలను ప్రకటించటాన్ని చూసి అనేక విదేశీ కంపెనీలు ఆశ్చర్యపోవటమే కాదు, ధరల పెంపుదల ఆలోచన కలిగించినందుకు భారత కంపెనీలకు కృతజ్ఞతలు చెబుతున్నాయి.

అమ్మోనియం(డిఏపి) కంటే పొటాష్ (ఎంఓపి)ధరలు తక్కువగా ఉన్నప్పటికీ అవి కూడా పెరుగుదలను సూచిస్తున్నాయి. బెలారస్, రష్యా, కెనడా,ఇజ్రాయెల్, జోర్డాన్, జర్మనీల నుంచి మన దేశం పొటాష్ దిగుమతి చేసుకుంటున్నది. పొటాష్ పూర్తిగా మన దేశం దిగుమతుల మీదే ఆధారపడి ఉంది. డిఏపి పరిస్థితి కూడా దాదాపు అదే. ముడి పదార్థాలను దిగుమతి చేసుకొని ఇక్కడ ఎరువును తయారు చేస్తున్నాము. పొటాష్, ఫాస్ఫేట్ ఎరువులకు నిర్ణీత మొత్తం మాత్రమే సబ్సిడీ ఇస్తామని 2010లో యుపిఏ ప్రభుత్వం నిర్ణయించిన విధానాన్నే మోడీ సర్కార్ కూడా అనుసరిస్తున్నది. కంపెనీలు ధరలు పెంచితే ఆ మొత్తాన్ని రైతులే భరించాలి. ఒక్క యూరియా విషయంలోనే కేంద్రం ధరలను నిర్ణయిస్తున్నది. ఆ మేరకు కంపెనీలకు సబ్సిడీని చెల్లిస్తున్నది.

2013 తరువాత అంతర్జాతీయంగా టన్ను డిఏపి ధర 560 డాలర్లకు పెరగటం ఇదే ప్రథమం. దీనికి తోడు మన రూపాయి విలువ పతనం కూడా ఎరువుల ధరల మీద ప్రతికూల ప్రభావం చూపుతోంది. డిఏపి ధరలు అక్టోబరులో 400 డాలర్లు ఉండగా ఇప్పుడు 540కి పెరిగాయి. అదే విధంగా ఎరువుల తయారీకి అవసరమైన అమ్మోనియా, సల్ఫర్ ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. గత సంవత్సరం మొత్తం ఎరువుల వినియోగం 610లక్షల టన్నులు ఉంటుందని అంచనా. కాగా దీనిలో 55శాతం యూరియా ఉంది. మిశ్రమ ఎరువుల ధరలు గణనీయంగా పెరిగినందున చౌకగా లభించే యూరియాను రైతులు విరివిగా వాడుతున్నారు. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం 79వేల కోట్ల రూపాయలు ఎరువుల సబ్సిడీకి కేటాయించగా దానిలో యూరియా ఒక్కదానికే 59వేల కోట్లు పోనుంది. ఇప్పటికే యూరియా ధర తక్కువగా ఉన్నందున అవసరానికి మించి వాడుతున్నారని, అది భూ ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నదని చెబుతున్నారు. దీనిలో వాస్తవమూ ఉంది, యూరియా సబ్సిడీ తగ్గించే ఎత్తుగడా ఉంది. ఇతర మిశ్రమ ఎరువులకు సబ్సిడీ ఇస్తే ఏ రైతు కూడా తన పొలం ఆరోగ్యాన్ని చేతులారా చెడుగొట్టుకోడు, వాటినే వినియోగిస్తాడు.

చివరిగా ఎరువుల ధరల తగ్గింపునకు ప్రభుత్వ పలుకుబడి, దౌత్యాన్ని వినియోగిస్తామని చెప్పటం గురించి చూద్దాం. నిజానికి కేంద్ర ప్రభుత్వానికి అంత పలుకుబడే ఉంటే దాన్ని ఒక్క ఎరువుల దిగుమతికే ఎందుకు పరిమితం చేయాలి ? ఎరువులు ఎంత ముఖ్యమో, పెట్రోలియం ఉత్పత్తులు కూడా అంతే ప్రాధాన్యత కలిగినవి. అంతర్జాతీయ ధరలకు అనుగుణ్యంగా ఎంత పెరిగితే అంత మేరకు డీజిలు, పెట్రోలు మీద వడ్డిస్తామని చెబుతున్న కేంద్రం ఎరువుల విషయంలో భిన్నంగా వ్యవహరించటానికి కారణం ఏమిటి ? చమురు ధరలు ఎంత పెరిగినా, కేంద్రం పన్ను వడ్డింపు ఎంత పెంచినా వినియోగదారులు కిక్కురు మనటం లేదు. వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడుల ధరలు పెరిగితే అది ఆ రంగంలో తీవ్ర సంక్షోభానికి దారి తీస్తుంది. గతంలో అనేక రాష్ట్రాలలో రైతులు ఆందోళనలు జరిపిన చరిత్ర ఉంది. ఇప్పుడు రాజధాని ఢిల్లీ పరిసరాల్లో కొనసాగుతున్న రైతుల తిష్ట కూడా దానిలో భాగమే. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత ఫలితాలు బిజెపికి ప్రతికూలంగా వచ్చినా అనుకూలంగా వచ్చినా రైతు ఉద్యమాన్ని ఏదో ఒక రూపంలో అణచివేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో ఎరువుల ధరలు పెంచితే అందునా త్వరలో ఖరీఫ్ తరుణం ప్రారంభం కానున్నందున రైతుల ఉద్యమానికి ఆజ్యం పోస్తాయి. నియంత్రణ ఎత్తివేసిన ప్రభుత్వం ఎరువుల ధరలను పెంచకుండా కార్పొరేట్ కంపెనీలను ఎంతకాలం కట్టడి చేయగలదు? ముడి చమురు ధరలను కట్టడి చేసేందుకు సౌదీ, ఇతర దేశాల మీద వత్తిడి తెస్తామని, చమురు ఆయుధాన్ని వినియోగిస్తామని ఆ శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రగల్భాలు పలికారు, ఏమైంది? ఇప్పుడు ఎరువుల మంత్రి సదానంద గౌడ ప్రకటనలకూ అదే గతి పడుతుందా? వ్యాపారం, లాభాలే ధ్యేయంగా వ్యవహరించే కార్పొరేట్లు ఒక దేశానికి తక్కువ రేటుకు, మరొక దేశానికి ఎక్కువ రేటుకూ ఇచ్చిన దాఖలాలు ఇంతవరకు లేవు.



ఫిక్స్‌డ్ ఛార్జీల షాక్!

ఈ ఆర్థిక సంవత్సర (2021-22) విద్యుత్ టారిఫ్‌ను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కాములు) ప్రకటించాయి. రాష్ట్రంలోని గృహ విద్యుత్ వినియోగదార్లపై గతంలో ఎన్నడూ లేనిది కొత్తగా ఫిక్స్‌డ్ చార్జీలు వడ్డించారు. కనీస ఛార్జీలు లేవంటూనే డిస్కాములు ఈ కొత్త భారాన్ని మోపాయి. మిగిలిన చార్జీల విషయంలో దాదాపు మార్పు లేదు. గతంలో వున్న రాయితీలు కొనసాగుతాయి. అయితే, గృహ వినియోగదారులపై వేసిన ఫిక్స్‌డ్ చార్జీల ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. రాష్ట్రంలోని మొత్తం వినియోగదారుల్లో అత్యధికులు గృహస్తులే కనుక దాని విస్తృతి కూడా అధికం.

కనీస చార్జీలు లేవంటూనే..

ఇకపై గృహ వినియోగదారుల నుంచి కనీస ఛార్జీలు వసూలు చేయబోమంటూనే ఫిక్స్‌డ్ ఛార్జీగా కిలోవాట్‌కు పది రూపాయలు వసూలు చేయాలన్న డిస్కాముల ప్రతిపాదనను ఇఆర్‌సి అంగీకరించింది. సాధారణంగా ఫిక్స్‌డ్/ డిమాండ్ ఛార్జీలు గృహేతర - హెచ్.టి వినియోగదార్ల నుండి మాత్రమే వసూలు చేస్తారు. పేద, మధ్యతరగతి గృహ వినియోగదార్ల నుండి కూడా దాన్ని వసూలు చేయడం దారుణం. అందువల్ల ప్రతి గృహ వినియోగదారుపై ఏడాదికి కనీసం రూ.120 అదనపు భారం పడుతుంది. ఒక్క బల్బు వాడే వారైనా నెలకు అదనంగా పది రూపాయలు కట్టాలి.

నెలకు పది యూనిట్లు వినియోగించే గృహస్తు ఇంతకుమునుపు కనీస ఛార్జీ మూలంగా నెలకు ఇంధన(కనీస)ఛార్జీ 25.00+ కస్టమర్ ఛార్జీ 25.00+ విద్యుత్ సుంకం + 0.60) రూ.50.60 చెల్లిస్తే.. ఇకపై (14.50+25+0.60 + ఫిక్స్‌డ్ ఛార్జీ 10) రూ.50.10 చెల్లించాలి. అంటే తగ్గేది కేవలం అర్ధ రూపాయే! ఒక నెలలో ఒక్క యూనిట్ కూడా వాడని వారు గతంలో (25+25+0+0) రూ.50 చెల్లించేది ఇప్పుడు (0+25+0+10) రూ.35 చెల్లిస్తే సరిపోతుంది (కింది పట్టికను చూడండి). అలా నెలకు 17 యూనిట్లు వాడే వారి



బి. తులసీదాస్,
పూర్వ సంపాదకులు,
మన రైతువాణి

వరకు కొత్త టారిఫ్ ప్రకారం బిల్లు పెరగదు. నెలకు 18 యూనిట్ల నుండి వడ్డన పెరుగుతుంది. కాబట్టి కనీస ఛార్జీ రద్దు చేసి ఫిక్స్‌డ్ ఛార్జీలు విధిస్తున్నామన్న డిస్కాముల వాదన బూటకం. ఫిక్స్‌డ్ ఛార్జీలు గృహ వినియోగదారులకు ముమ్మాటికీ భారమే!. నెలకు 20 యూనిట్లు వాడే నిరుపేద వినియోగదారు ఇప్పుడు రూ.55 బిల్లు చెల్లిస్తున్నవారు ఇకపై ఫిక్స్‌డ్ ఛార్జీ కలిపితే రూ.65 చెల్లించాలి. ఇలాంటి నిరుపేదలపైనే ఈ పెంపు 18 శాతం. అదే కనెక్టెడ్ లోడ్ ఎక్కువ అంటే మిక్సీ, ఫ్రిజ్, కూలర్ వంటివి ఉంటే ఫిక్స్‌డ్ ఛార్జీ భారం ప్రతి కిలోవాట్‌కూ పది రూపాయల చొప్పున ఇంకా పెరుగుతుంది. నామమాత్రపు విధింపు అంటూనే ఓ కొత్త భారాన్ని మోపుతున్నారు. అంతేగాక కనెక్టెడ్ లోడ్ ఎక్కువగా ఉందన్న సాకుతో వినియోగదారులపై వేధింపులు పెరిగేందుకూ అవకాశం ఉంది. విద్యుత్ అధికారులు 2019లో ఇళ్లలో చొరబడి మీ ఇంట్లో ఫ్రిజ్ వుంది, ఎ.సి వుంది, అదనపు కనెక్టెడ్ లోడ్‌కు కన్సమ్షన్ డిపాజిట్ కట్టాలని వేధింపులకు పాల్పడడం, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిన తరువాత వెనక్కు తగ్గిన విషయం చాలామందికి గుర్తుండే ఉంటుంది.

ఇంతింతై..

ఒకసారి ఫిక్స్‌డ్ ఛార్జీ అంటూ వేస్తే అది తదనంతర కాలంలో పెరుగుతూ పోయే ప్రమాదం ఉంది. సర్వీసు ఛార్జీల పేరిట కేంద్ర ప్రభుత్వం 1994లో ప్రారంభించినపుడు టెలిఫోన్ బిల్లు, జీవిత బీమా మినహా ఇతర బీమా ప్రీమియం, స్టాక్ మార్కెట్ బ్రోకరేజి- ఈ మూడింటిపైనే నాటి ఆర్థిక మంత్రి మన్మోహన్‌సింగ్ ప్రతిపాదించారు. ఆ ఏడాది దేశమంతటా కలిపి సేవా పన్ను 3,943 మంది నుండి కేవలం రూ. 407 కోట్లు మాత్రమే సమకూరింది. ఆనాటి కేంద్ర ప్రభుత్వ పన్ను ఆదాయంలో అది ఒక్క శాతం కూడా లేదు. అనంతరం ఆ పన్ను సకల సేవలకూ విస్తరించడమేగాక 5 శాతంతో ప్రారంభమైన పన్ను రేటు 15 శాతానికి ఎగబాకింది. ఇప్పుడు జిఎస్‌టి రూపంలో 18 శాతం వరకు వసూలు చేస్తున్నారు. కాబట్టి సర్కారు ఓ కొత్త భారాన్ని ప్రవేశపెడితే అది అలా అలా ఆంజనేయుడి తోకలా పెరుగుతూ జనం నడ్డి విరుస్తుంది. నయా ఉదారవాద ఆర్థిక విధానాల్లో భారాలు వేయడానికి ప్రభుత్వాలు ఇలాంటి కొత్తకొత్త పద్ధతులు అనుసరిస్తున్నారు.

ఆర్ఇసిఎస్‌ల రద్దు

విశాఖపట్నం జిల్లా అనకాపల్లి, విజయనగరం జిల్లా చీపురుపల్లి, చిత్తూరు జిల్లా కుప్పం కేంద్రాలుగా వున్న గ్రామీణ విద్యుత్ సహకార సొసైటీ (ఆర్ఇసిఎస్)లను ఆయా డిస్కాముల్లో విలీనం చేస్తున్నట్టు ఎపిఇఆర్‌సి ప్రకటించింది. గ్రామీణ విద్యుత్ సహకార సంఘాల నిర్వహణకు ప్రభుత్వం సిఫార్సు చేయనందున వాటిని తమ ఆధీనంలోకి తీసుకోవాలని డిస్కాంలను ఆదేశించామన్నారు. ఇదిలా వుండగా లైసెన్స్ రెన్యువల్ కోసం నిర్దేశించిన రుసుము ఒక లక్ష రూపాయలు ఇఆర్‌సికి చెల్లించామని చీపురుపల్లి ఆర్ఇసిఎస్ ఎం.డి మీడియాకు చెప్పారు. ఈ పాలనాపరమైన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి. ఈ మూడు ఆర్ఇసిఎస్‌లు వెనుకబడిన ప్రాంతాల్లోనే పని చేస్తున్నాయి. ప్రధానంగా చెరకు (బెల్లం గానుగలు), మామిడి, కూరగాయలు ఇతర ఉద్యానవన పంటలపై ఆధారపడి జీవిస్తున్న రైతాంగానికి, ఆ ప్రాంతాల్లోని చిన్న ప్రాసెసింగ్ పరిశ్రమలకూ ఈ ప్రతిపాదన వల్ల తీవ్ర నష్టం కలుగుతుంది. కాబట్టి ఇలాంటి విధానపరమైన మార్పు చేయడానికి ముందుగా సంబంధిత సంస్థలు, వ్యక్తుల (స్టేకహోల్డర్ల)తో ఇఆర్‌సి విడిగా పబ్లిక్ హియరింగ్ నిర్వహించి వుండాల్సింది. అలాంటిదేమీ లేకుండా ఏకపక్షంగా విలీన ప్రకటన చేయడం వెనుక ఇంకేవైనా కారణాలున్నాయేమో పరిశీలించాలి. అయితే ఆయా ప్రాంతాల్లో వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఆర్ఇసిఎస్‌లను కొనసాగిస్తామని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పి.రామచంద్రారెడ్డి మీడియాకు తెలిపారు. ఆచరణలో ఏమవుతుందో చూడాలి. వెనుకబడిన ప్రాంతాల రైతుల ప్రయోజనాలకు, ఆర్ఇసిఎస్ ఉద్యోగులకు హానికరమైన విలీన ప్రతిపాదనను ఉపసంహరించుకోవడం అవసరం.

కొన్ని సానుకూల అంశాలు

మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు రూ.11,741.18 కోట్లు లోటు అంచనా చూపగా ఎపిఇఆర్‌సి సునిశిత అధ్యయనం చేసి నికర లోటు రూ. 7,433.80 కోట్లుగా నిర్ణయించినందున రూ.4,307.38 కోట్ల భారం వినియోగదారులపై లేదా ప్రభుత్వంపై పడకుండా నివారించింది. అలాగే 2014-15 నుంచి 2018-19 వరకు నిర్ణయించిన రూ.3,013 కోట్ల ట్రూ అప్ ఛార్జీలు, 2020-21లో ట్రూ డౌన్ (తాత్కాలిక సర్దుబాటు) రూ. 3,373 కోట్లను పరిగణనలోకి తీసుకున్నందున వినియోగదార్లపై కొత్తగా భారం పడలేదు. వివిధ తరగతులకు రాయితీల కింద సరఫరా చేసే విద్యుత్ వ్యయం 2021-22లో మొత్తం రూ.9,091.36 కోట్లు ప్రభుత్వం భరించడానికి ఆమోదం తెలిపింది. విద్యుత్ ఒప్పందం లేని ప్రయివేటు విద్యుత్ కేంద్రాల నుంచి విద్యుత్ సేకరించాలన్న యాజమాన్యాల అభ్యర్థనను ఎపిఇఆర్‌సి తిరస్కరించడం హర్షణీయం. విద్యుత్ ధరలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి తక్కువ ధరలున్నప్పుడు కొనుగోలు చేసేలా ప్రతీ డిస్కాంలోనూ ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించడం మంచిదే. అయితే ఆ సెల్ పని ఎలా వుందన్నదీ ఇఆర్‌సి పర్యవేక్షించడం అవసరం. అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌసింగ్, హౌసింగ్ సొసైటీల ఇళ్లనూ గేటెడ్ కమ్యూనిటీ/ విల్లాల మాదిరిగా పరిగణించి హెచ్‌టి-1 గృహ వినియోగదారుల కేటగిరీ ఛార్జీలు వసూలు చేస్తామన్న డిస్కాములు ప్రతిపాదనను ఇఆర్‌సి తిరస్కరించడం సబబైనది.

డిస్కాములు సమర్పించిన ఎఆర్ఆర్‌లను ఇఆర్‌సి సునిశితంగా పరిశీలించినట్టు కనిపిస్తోంది. నికర లోటు తగ్గించడం, ట్రూ అప్ ప్రతిపాదనను ట్రూ డౌన్‌తో సర్దుబాటు చేయడంతోపాటు విద్యుత్ కొనుగోలు విషయంలోనూ తగిన జాగ్రత్తలను నిర్దేశించింది. ఇలాంటి చర్యల మూలంగా యూనిట్ విద్యుత్ కాస్ట్ ఆఫ్ సర్వీసు వ్యయం రూ.7.17లుగా డిస్కాంలు ప్రతిపాదించగా ఇఆర్‌సి దాన్ని రూ.6.37కు తగ్గించడం గమనార్హం. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, దళితులు, గిరిజనులు, ఇతర బలహీన వర్గాలకు ప్రస్తుతం ఇస్తున్న రాయితీలు

	పాత బిల్లు						కొత్త బిల్లు					
నెలకు యూనిట్లు →	10	20	50	100	200	300	10	20	50	100	200	300
ఇంధన ఛార్జీ	14.50	29.00	72.50	260.00	620.00	1550.00	14.50	29.00	72.50	260.00	620.00	1550.00
కస్టమర్ ఛార్జీ	25.00	25.00	25.00	40.00	45.00	50.00	25.00	25.00	25.00	40.00	45.00	50.0
విద్యుత్ సుంకం	0.60	1.20	3.00	6.00	12.00	18.00	0.60	1.20	3.00	6.00	12.00	18.00
ఫిక్స్‌డ్ ఛార్జీ	0	0	0	0	0	0	10.00	10.00	10.00	10.00	20.00	40.00
మొత్తం	50.60	55.20	110.50	306.00	677.00	1618.00	50.10	65.20	120.50	316.00	697.00	1658.00

యథాతథంగా కొనసాగిస్తారు. అయితే ఈ సబ్సిడీలను విద్యుత్ చట్టం (2003) సెక్షన్ 65 కింద ఇవ్వాలని ఇఆర్సి పేర్కొంది. తద్వారా ఈ రాయితీలకు చట్టబద్ధత సమకూరడమేగాక డిస్కాములకు ప్రభుత్వం నుండి ముందుగా జమ కావడానికీ తోడ్పడవచ్చు.

పవన, సౌర విద్యుత్‌లో ఆధునిక టెక్నాలజీ అభివృద్ధితో ప్రపంచమంతటా విద్యుదుత్పత్తి వ్యయం తగ్గుతూ వస్తోంది. ఆ ప్రయోజనం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ వినియోగదారులకూ దక్కాలి. గతంలో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలవల్లనే ఇప్పటికీ డిస్కాముల విద్యుత్ కొనుగోలు వ్యయం అధికంగా వుంది. దండగమారి పిపిఎల నుండి బయటకు వచ్చినా, సమీక్షించి, తగ్గించుకున్నా ప్రజలకు మేలు జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంప్‌సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తోంది. ఈ విషయంలో డిస్కాములు ఇఆర్సి ఇప్పటివరకు అనుమతి పొందలేదు కనుక రైతులకు నష్టదాయకమైన మీటర్ల బిగింపు ప్రక్రియ నిలిపివేతకు విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఆదేశిస్తే అన్నదాతలకు ఊరట కలుగుతుంది.

ధాన్యం రైతుకు దక్కని మద్దతు

కళ్లాల్లోనే కొనుగోలు మొక్కుబడిగా రైతు భరోసా కేంద్రాలు

గుంటూరు జిల్లాలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు మొక్కుబడిగా సాగుతోంది. రబీలో 2.20 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఆరు లక్షల టన్నుల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రబీలో ఉత్పత్తి అయిన ధాన్యం కొనుగోలుకు 559 రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడానికి జిల్లా జాయింట్ కలెక్టర్ అనుమతి ఇచ్చారు. 1.60 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇప్పటికి 40 కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైంది. 'ఎ' గ్రేడ్ రకం క్వింటాలు కనీస మద్దతు ధర రూ.1888 చొప్పున 75 కేజీల బస్తా రూ.1,416కి కొనుగోలు చేయాలి. మిల్లర్లు, దళారీలు రైతుల వద్ద నుంచి 75 కిలోల బస్తా రూ.1,250 నుంచి రూ.1300 వరకు కొనుగోలు చేస్తున్నారు. సాధారణ రకానికి కనీస మద్దతు ధర రూ.1,868 చొప్పున 75 కేజీల బస్తాను రూ.1,401కు కొనుగోలు చేయాల్సి వుంది. రూ.1,100 నుంచి రూ.1,200 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. నర్సరావుపేట, గురజాల రెవెన్యూ డివిజన్ల పరిధిలో సోనా మసూరి ఎక్కువగా సాగు చేశారు. ఎకరాకు దిగుబడి 30 నుంచి 35 బస్తాల ధాన్యం మాత్రమే వస్తోంది. సోనా మసూరి సాగు వల్ల మంచి ధర వస్తుందని ఆశించినా, కనీస మద్దతు ధర లభించడం లేదు. రైతు భరోసా కేంద్రాలు, కొనుగోలు కేంద్రాలలో విక్రయిస్తే వెంటనే సొమ్ము ఇవ్వడం లేదని, అనేక ఆంక్షలు పెడుతున్నారని, సొమ్మును వెంటనే ఇచ్చే వ్యాపారులకు కళ్లాల్లోనే ధాన్యాన్ని విక్రయిస్తున్నామని రైతులు చెబుతున్నారు. గత ఖరీఫ్‌లో 15 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తికాగా ప్రభుత్వం 3.09 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది.

మద్దతు ధరకు కొంటాం : జెసి

ప్రస్తుతం గుంటూరు, నర్సరావుపేట, గురజాల రెవెన్యూ డివిజన్ పరిధిలో 559 రైతు భరోసా కేంద్రాల పరిధిలో రబీలో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నాం. తెనాలి డివిజన్‌లో మరో 97 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం.

– దినేష్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్

అయినకాడికి అమ్ముకుంటున్నారు

రబీలో ధాన్యం కొనుగోలులో కనీస మద్దతు ధర లభించడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో ఆంక్షలు, సొమ్ము చెల్లింపులో జాప్యం వల్ల రైతులు పొలాల్లోనే బస్తాకు రూ.100 నుంచి రూ.150 వరకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం ఆంక్షలు సడలించి వారంలోగా సొమ్ము చెల్లిస్తామని భరోసా ఇవ్వాలి.

– వై.రాధాకృష్ణ, కౌలు రైతు సంఘం పశ్చిమ జిల్లా కార్యదర్శి

ఆశించిన ధర రావడం లేదు

పిడుగురాళ్ల మండలం కామేపల్లిలో 1001 రకం సాగు చేశాను. కౌలు రూ.15 వేలు చెల్లించాను. 25 బస్తాల దిగుబడి వచ్చింది. ఆశించిన దిగుబడి రాలేదు. కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తే సొమ్ము కోసం 15 రోజుల వ్యవధి పట్టే అవకాశం ఉంది. 75 కేజీల బస్తాను రూ.950కు కొనుగోలు చేశారు. కరోనా పెరుగుతున్నందున లాక్‌డౌన్ పెడతారన్న భయంతో తక్కువ ధరకు అయినా ముందే అమ్ముకుంటున్నాం. పల్నాడులో ఈసారి వరి సాగు ఆశాజనకంగా లేదు.

– ముక్కాల పిచ్చయ్య

కళ్లంలోనే అమ్మేశా

సోనా మసూరి సాగు చేశారు. 30 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ప్రభుత్వ మద్దతు ధర కన్నా కొంత తక్కువ అయినా పొలాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. బస్తా రూ.1300కి అమ్ముకున్నా. మద్దతు ధర ప్రకారం రూ.1,416 రావాలి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్మితే డబ్బులు ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని కళ్లంలోనే ధాన్యాన్ని వ్యాపారికి అమ్మేశాను.

– దాచేపల్లి మస్తాన్, కౌలు రైతు, గుళ్లపల్లి నకరికల్లు మండలం



రైతు, కార్మిక శంఖారావం సభలతో స్ఫూర్తి

పి. జమలయ్య

దేశ చరిత్రలో ఓవైపు కార్మికులు, మరో వైపు రైతులు ఐక్యంగా ఉద్యమాలు నిర్వహించడం మంచి పరిణామం. రైతు, కౌలు రైతులకు వ్యవసాయ కూలీలకు జీవనాధారంగా ఉన్న వ్యవసాయ రంగాన్ని ఆదానీ, అంబానీ వంటి దేశ, విదేశీ సంస్థలకు కట్టబెట్టడం, ప్రజల సొమ్ముతోను, ప్రభుత్వ నిధులతోను, కార్మికుల శ్రమతోనూ నిర్మితమైన ప్రభుత్వం రంగాన్ని కార్పోరేట్ సంస్థలకు అమ్ముతున్న ఈ తరుణంలో రైతాంగ ఉద్యమాలు, కార్మికవర్గ పోరాటాలు ఐక్యంగా నిర్వహించడం ఒక చారిత్రాత్మక ఘట్టంగా పేర్కొనవచ్చు. రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని ఉత్తర భారత్‌లో జరుగుతున్న 'కిసాన్ మహా పంచాయతీల' మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లోనూ ఏప్రిల్ 18, 19 తేదీలలో విశాఖ, విజయవాడ, ఒంగోలులో జరిగిన రైతు కార్మిక శంఖారావం సభలు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. ఇటు కరోనా, అటు ఉపాధి, వ్యవసాయ పనులు ఉధృతంగా ఉన్నప్పటికీ వేలాది మంది రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు అన్ని వర్గాల ప్రజలు వచ్చి విజయవంతం చేశారు. నాయకుల ఉపన్యాసాలు విని ఉత్సాహపడ్డారు. కరోనా నిబంధనలు పాటిస్తూ, శాంతి భద్రతలకు ఇబ్బంది కలగకుండా ఎంతో క్రమశిక్షణతో ఈ సభలను జయప్రదం చేశారు. విశాఖలో జరిగిన సభకు శ్రీకాకుళం జిల్లా మంథసా, సోంపేట విజయనగరం జిల్లా పార్వతీపురం, విశాఖ జిల్లా నుంచి నక్కపల్లి, నర్సీపట్నం తదితర దూర ప్రాంతాల నుంచి కూడా రావడం విశేషం. రైతు సంఘాల సమన్వయ కమిటీ, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సంయుక్తంగా ఈ సభలు నిర్వహించాయి. 2020 జూన్ నుండి ప్రారంభమైన రైతాంగ ఉద్యమం ఉత్తర భారతదేశం నుండి దేశవ్యాప్తంగా విస్తరించింది. ఢిల్లీలో నవంబరు 26 నుండి జరుగుతున్న పోరాటానికి కార్మికవర్గం అండగా నిలబడింది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం లాభనష్టాలతో సంబంధం లేకుండా ప్రభుత్వ సంస్థలను దేశీ, విదేశీ సంస్థలకు అమ్ముతుంది. కార్మిక చట్టాలను హరించి వేసి నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చింది. దానిలో భాగంగానే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రతిపాదనలను ముందు తీసుకు రావడంతో కార్మికవర్గం ఉలిక్కిపడి పడింది. పోరాడి సాధించుకున్న ఉక్కు పరిశ్రమను అమ్మే ప్రయత్నాలు చూసి కార్మికవర్గంలో రక్తం సలసలా కాలింది. రైతాంగం ఉద్యమానికి అండగా నిలబడుతూనే మరోవైపు విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమ బాట పట్టింది. అన్ని వర్గాల ప్రజలను, రైతులను కూడ గట్టింది. ఢిల్లీలో జరుగుతున్న రైతాంగ ఉద్యమానికి మద్దతుగా విశాఖ స్టీల్ కార్మికవర్గం నిధులు పంపి అండగా నిలబడింది. మీరు ఒంటరిగా లేరనీ మీతో మేము ఉన్నామనీ దన్నుగా నిలిచింది. విశాఖ స్టీల్ కార్మికులు చూపిన స్ఫూర్తితో విశాఖ ఉక్కు పరిరక్షణకు కోసం చేస్తున్న ఉద్యమానికి సంఘీభావం తెలపడానికి రైతు ఉద్యమ జాతీయ నాయకత్వం విశాఖకు కదిలి వచ్చింది. దీక్షలు చేస్తున్న కార్మికులకు మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా విశాఖ ఆర్.కె బీచ్‌లో గొప్ప రైతు, కార్మిక శంఖారావం సభ జరిగింది. ఈ సభల్లో బికెయు జాతీయ అధ్యక్షుడు రాకేశ్ సింగ్ తికాయత్, ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు యం.అశోక్ ధావలే, జాతీయ నాయకులు బలకణ్ సింగ్ బ్రార్, ధర్మపాల్ సింగ్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితర నాయకులు ఉత్తేజ పూర్వకంగా ప్రసంగించారు. విశాఖ ఉక్కు ఆంధ్రులకే కాకుండా భారత్ ప్రజల హక్కుని నినదించారు. సభకు హాజరైన నాయకత్వం మాట్లాడుతూ.. మన వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే రైతు వ్యతిరేక

చట్టాలు రద్దు చేసే వరకూ ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విధానాన్ని ఉపసంహరించకపోతే కేంద్ర బిజెపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. అదానీ, అంబానీలకు ప్రధానమంత్రి మోడి ఊడిగం చేస్తున్నారన్నారు. మత విధ్వంసాన్ని రెచ్చగొట్టి ప్రజలకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కి కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టడం దుర్మార్గమన్నారు. ఉద్యమాల ద్వారానే మోడీ మెడలు వంచాలని పిలుపునిచ్చారు. సభలు జయప్రదంగా జరగటానికి జీపు జాతాలు జరిగాయి. వందలాది గ్రామాల్లో జనరల్ బాడీ సమావేశాలు, బృంద సమావేశాలు జరిగాయి. రచ్చబండ చర్చలు జరిగాయి. లక్షపైగా కరపత్రాలు పంచారు. ఆకర్షణీయమైన వాలు పోస్టరు వేసి గోడలకు అంటించారు. బిజెపి ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను గురించి ప్రజలకు వివరించారు. వందలాది మంది కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు. విశాఖలో జరిగిన సభ సందర్భంగా సంస్కృతి దళాలు, ప్రజ కళాకారులు రైతు చట్టాలపై పాడిన పాటలు, నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిరసిస్తూ పాడిన పాటలు సమరశీల పోరాట స్ఫూర్తిని నింపాయి. విచిత్ర వేషాల ద్వారా రైతు చట్టాల దుష్ప్రభావాలను ప్రజలకు అర్థమయ్యేలా ప్రదర్శించారు. విజయవాడలో జరిగిన సభ సందర్భంగా రైతుల చట్టాలపై పాడిన పాటలు రైతుల హృదయాలను కదిలించాయి. ఒంగోలు సభ సందర్భంగా బాలబాలికలు కాడీ, మేడి, నాగళ్ళతో చేసిన నృత్యాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధాన విశేషం ఏమిటంటే.. దెబ్బయి మూడేళ్ల వయస్సు కల్గిన మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఉత్సాహంగా పాల్గొనటం. అంతేగాక ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు అశోక్ ధావలే, బికెయు అధ్యక్షుడు రాకేశ్ తికాయత్ విరామం లేకుండా సభల్లో పాల్గోవడం చెప్పుకోవాలి. వీరితోపాటు రాష్ట్ర నాయకులు కూడా తమ వయసును లెక్క చెయ్యకుండా చురుకు పాల్గొన్నారు. ఈ సభలు అననుకూల పరిస్థితుల్లో జరిగినప్పటికీ రైతులు, కౌలు రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తుల వారు, విద్యార్థులు, యువజనులు అన్ని వర్గాల ప్రజల్లో పోరాటాల పట్ల ఆత్మవిశ్వాసాన్ని నింపాయి.

(రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం)

సహకార రంగంలోనే సంగం డెయిరీ

ఎపి రైతుసంఘం డిమాండ్

సంగం డెయిరీని సహకార రంగంలోనే నడపాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.కేశవరావు, మర్రాపు సూర్యనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. సంగం డెయిరీలో అవినీతి, ఆస్తుల బదలాయింపు కేసులో డెయిరీ చైర్మన్, ఎండిలు అరెస్టు అయిన నేపథ్యంలో డెయిరీ రోజువారీ కార్యకలాపాలకు ఆటంకం లేకుండా రైతులకు, వినియోగదారులకు సమస్య కాకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సహకార స్ఫూర్తికి విఘాతం కలిగించే కంపెనీ చట్టం నుండి సంఘం డెయిరీని సహకార చట్టంలోకి తీసుకురావాలని, డెయిరీ పాలకవర్గానికి ఎన్నికలు జరిపించాలని, అవినీతికి, ఆస్తుల బదలాయింపుకు పాల్పడిన వారిపై విచారణ వేగవంతం చేసి బాధ్యులను శిక్షించాలని కోరారు. సంగం డెయిరీ వరకే విచారణ పరిమితం చేయకుండా కంపెనీ చట్టంలో ఉన్న విశాఖ డెయిరీపై కూడా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

1964 సహకార సంఘాల చట్టం ద్వారా రిజిస్టర్ అయిన గుంటూరు పాల ఉత్పత్తిదారుల సహకార యూనియన్‌లో 1977లో ఏర్పడిందని పేర్కొన్నారు. నాటి కాలంలో సహకార రంగాన్ని ప్రోత్సహించడం వల్ల గుంటూరు జిల్లాలో సుమారు 500 గ్రామాల్లో పాల ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడి జిల్లా డెయిరీ విస్తరణకు తోడ్పడ్డాయని తెలిపారు. రెండు దశాబ్దాల్లో గ్రామసంఘాలు పెరిగాయని, పాల సేకరణ పెరిగిందని పేర్కొన్నారు. సంగం డెయిరీ తన కార్యకలాపాలను విస్తరించుకుంటూ పాల రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ డెయిరీకి సొంత ఆస్తులు సమకూర్చుకుంటూ అభివృద్ధి చెందిందని తెలిపారు.

1990 తర్వాత పాలకవర్గాల్లో వచ్చిన విధానపరమైన మార్పుల వల్ల సహకార రంగాన్ని దెబ్బతీయడం ప్రారంభమైందని పేర్కొన్నారు. 1964లో సహకార చట్టంలో డెయిరీ నడిస్తే ప్రభుత్వ జోక్యం, అజమాయిషీ ఎక్కువగా ఉందనే నెపంతో 1995లో పరస్పర సహాయక సహకార చట్టంలోకి సంగం డెయిరీని మార్చుకున్నారని తెలిపారు. అక్కడితో ఆగకుండా 2013 జూన్ 18న ప్రొడ్యూసర్స్ కంపెనీ చట్టంలోకి సంగం డెయిరీని మరోసారి మార్చుకున్నారని పేర్కొన్నారు. దీంతో డెయిరీలో సహకార స్ఫూర్తి పూర్తిగా అడుగంటిపోయి, చైర్మన్ ఇష్టారాజ్యం పెరిగి అవినీతి కార్యక్రమాలకు తెరతీసిందని, వీటిపై రైతుసంఘం ఆందోళన కార్యక్రమాలు చేసిందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం కంపెనీ చట్టంలో ఉన్న డెయిరీలపై విచారణ జరపాలని, ప్రభుత్వం గతంలో ప్రకటించినట్లు కోపరేటివ్ వ్యవస్థను బలపర్చడానికి విధానపరమైన వైఖరి తీసుకోవాలని, ప్రభుత్వం ప్రోత్సాహకంగా లీటరు పాలకు అదనంగా రూ.4 వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కుంజా బొజ్జికి రైతు సంఘం ఘన నివాళి

గిరిజనోద్యమ నిర్మాత, తెలంగాణా సాయుధ పోరాట యోధుడు, మూడు సార్లు సీపీఎం పక్షాన గెలుపొంది పీడిత ప్రజలకు ఎనలేని సేవలు అందించిన కుంజా బొజ్జి శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, 95వ వసంతంలో గత ఏప్రిల్ 12న కన్నుమూశారు. ఆయనకు ఏపి రైతు సంఘం ఘనంగా నివాళు లర్పిస్తోంది.

భార్య లాలమ్మ మూడేళ్ల కిందటే చనిపోయారు. వారికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు కాగా, వీరిలో ఓ కుమారుడు మరణించారు. ఓ కుమారుడు రైతు సంఘంలో పనిచేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లా వరరామచంద్రపురం మండలం (ఇప్పటి తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గం)లోని అడవి వెంకన్నగూడెం గ్రామంలో కుంజా జోగయ్య, లక్ష్మమ్మ దంపతులకు ఆరో సంతానంగా బొజ్జి జన్మించారు. 1948లో లాలమ్మతో ఆయన వివాహం జరిగింది. తెలంగాణా సాయుధ దళాలతో పరిచయం ఏర్పడి కొరియర్‌గా పనిచేశారు. ఆ సందర్భంగా దళాలు ఇచ్చిన పెద్ద బాలశిక్ష పుస్తకం ద్వారా చదువు నేర్చుకున్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం తీసుకున్నారు. భద్రాచలం నుంచి సీపీఎం పక్షాన మూడు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించినప్పటికీ సాధారణ జీవితం గడిపారు. ప్రాణం కన్నా తాను నమ్మిన సిద్ధాంతానికే ప్రాధాన్యత ఇచ్చారు.

అడవి వెంకన్నగూడెంలో ఇంటి వద్ద ఉన్న సమయంలో బొజ్జిని.. ఆనాటి పీపుల్స్‌వార్ నక్సలైట్లు 'నీవు సీపీఎంకు రాజీనామా చేయాలి' అంటూ తుపాకులతో బెదిరించారు. 'నా ప్రాణం పోయినా పరవాలేదు. నేను పార్టీకి రాజీనామా చేయను' అని ధైర్యంగా బదులిచ్చిన ధైర్యశాలి. ఎన్నో ప్రలోభాల ఆశ చూపి ఆయనను లొంగ దీసుకోవడానికి ఇతర పార్టీలవారు ఎంత ప్రయత్నించినా లొంగని ధీరుడు. ఆ విధంగా ఆయన పార్టీ పట్ల, ప్రజల పట్ల స్పష్టత కలిగి జీవితాంతం నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరించారు.

భద్రాచలం మన్యంలో నిరుపేద గిరిజన, గిరిజనేతరుల సమస్యల పరిష్కారం కోసం విశేష కృషి చేశారు. మేకల పుల్లరికి వ్యతిరేకంగా గిరిజనులను ఐక్య పరిచి అటవీ శాఖవారితో పోరాడి దాన్ని నిలుపుదల చేయించారు. వ్యవసాయ కార్మికుల కూలిరేట్ల సాధన కోసం, అటవీ ఉత్పత్తులను సేకరించే కార్మికులకు గిట్టుబాటు ఇవ్వాలని, గిరిజన కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పోరాటాలు నిర్వహించారు. రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులకు సరైన ధర ఇవ్వాలని అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించారు.

1985లో మొదటిసారి ఆయన సీపీఎం పక్షాన భద్రాచలం శాసనసభ్యుడిగా విజయం సాధించారు. ఆ తరువాత వరుసగా 1989, 1994ల్లో కూడా ఎమ్మెల్యేగా గెలుపొందారు. క్రీడా పరిభాషలో చెప్పాలంటే ఎమ్మెల్యేగా ఆయన హ్యాట్రిక్ కొట్టారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో కనీస సౌకర్యాల కల్పనపై నడుం కట్టారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు, వాటిని అధికారులకు తెలియజేసి పరిష్కరింప చేసేందుకు ఆయన బస్సు రాని తమ గ్రామం నుంచే సైకిల్‌పై తిరిగే వారు. మహానేత పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకొని తాను నమ్మిన సీపీఎంలోనూ, శాసనసభలోనూ క్రియాశీలకంగా పనిచేశారు. ఈ క్రమంలో ఆయన్నందరూ ఏజెన్సీ సుందరయ్య అని పిలిచేవారు.

1985 నవంబరులో జీడిగుప్ప గ్రామం పర్యటనకు వెళ్లి తిరిగి వస్తుండగా పీపుల్స్‌వార్ నక్సలైట్లు దారికాచి బొజ్జిని నిలువరించారు. ఆయనను తుపాకి మడమతో కొట్టడంతో పక్కటెముకలు విరిగాయి. బొజ్జితోపాటు ఉన్న పార్టీ నాయకులైన బండారు చంద్రరావు, బత్తుల భీష్మారావులను గొడ్డళ్లతో నరికారు. భీష్మారావు అక్కడే చనిపోగా చంద్రరావు నెల రోజుల తరువాత ఆసుపత్రిలో చనిపోయారు. కుంజాబొజ్జిని సీపీఎంకూ, శాసన సభ్యత్వానికి రాజీనామా చేయాల్సిందిగా హెచ్చరించారు. రాజీనామా ప్రశ్నేలేదని ఆయన బదులిచ్చాడు.

బొజ్జి భద్రాచలం డివిజన్ రైతు సంఘం అధ్యక్షుడిగా, రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రెండు దఫాలు (1986, 89ల్లో) ఎన్నికయ్యారు. వారి కుమారుడు నాగిరెడ్డి రైతు సంఘం నాయకుడిగా మండలంలో పనిచేస్తున్నారు. సమస్యలను నిరంతరం అధ్యయనం చేస్తూ.. వాటి పరిష్కారానికి కృషి చేస్తూ.. శాసనసభలో పేదల వాణిని వినిపిస్తూ.. ప్రజా ఉద్యమాలను కదం తొక్కించిన కుంజా బొజ్జి ఎన్నడూ ఆడంబరాలకు పోలేదు. సామాన్యుడిగా ఉంటూనే ఉన్నతంగా ఆలోచించేవారు. వారికివే విప్లవ జోహార్లు!.

- బిబిజి తిలక్

ఏపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు

బీజేపీ, దాని మిత్రపక్షాలను ప్రజలు తిరస్కరించారు

సంయుక్త కిసాన్ మోర్చా స్పష్టీకరణ

బీజేపీ, దాని మిత్రపక్షాల ప్రజావ్యతిరేక రాజకీయాలను ప్రజలు తిరస్కరించారని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) స్పష్టం చేసింది. రైతు వ్యతిరేక బీజేపీని శిక్షించి, ఎన్నికల్లో ఓడించినందుకు పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు ప్రజలను ఎస్‌కెఎం అభినందించింది. మోడీ కార్పొరేట్ అనుకూల విధానాల్లో భాగంగా రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చారని, తద్వారా రైతుల, కార్మికుల జీవితాన్ని, జీవనోపాధిని అణచివేసేందుకు, చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ వ్యతిరేక ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని తెలిపింది. బడా కార్పొరేట్లు, ఎంఎస్‌సిలకు అనుకూలంగా రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చిన బీజేపీని ఓడించాలని విజ్ఞప్తి చేస్తూ ఎస్‌కెఎం, ఎఐకెఎస్‌సిసి ఆధ్వర్యాన వందకు పైగా బహిరంగ సభలు నిర్వహించామని ఎస్‌కెఎం గుర్తు చేసింది. లక్షలాది కరపత్రాలను పంపిణీ చేశామంది. రైతులు, గ్రామీణ ఓటర్లు ఎక్కువగా రైతు సంఘాల పిలుపును స్వీకరించడంతో బీజేపీకి పరాజయం ఎదురైందని ఎఐకెఎస్‌ఎస్ తెలిపింది.

ఇలా ఉండగా... దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న ఆందోళన మే రెండో తేదీకి 157వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎస్‌కెఎం నేతలు బల్బీర్ సింగ్, రాజేవాల్, హన్నన్‌మొల్లా, డాక్టర్ దర్శన్‌పాల్, యుధ్వీర్‌సింగ్, జగ్జీత్‌సింగ్ దల్లేవాల్, గుర్నమ్ సింగ్ చాదుని, యోగేంద్ర యాదవ్, అభిమన్యు కోహర్ తదితరులు మాట్లాడుతూ.. పౌరుల జీవనోపాధి సమస్యలపైన, రైతు వ్యతిరేక కేంద్ర వ్యవసాయ చట్టాలు, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు వంటి బీజేపీ చేసిన ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో తీర్పు ఇచ్చారన్నారు. ఈ విషయంలో తమ మద్దతుకు స్పందించినందుకు బెంగాల్, ఇతర రాష్ట్రాల పౌరులను అభినందిస్తున్నామని అన్నారు. భారత దేశం నలుమూలల నుంచి వచ్చిన రైతుల ప్రతిఘటనను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. ఈ ఉద్యమం మన రాజ్యాంగం అనుసరించే ప్రజాస్వామ్య విలువలను వ్యాప్తి చేస్తూనే ఉంటుందని, మా డిమాండ్లు నెరవేరేవరకూ ఉద్యమం మరింత బలోపేతం అవుతూనే ఉంటుందని వారు పేర్కొన్నారు.

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు

కేరళ (మొత్తం స్థానాలు 140)

లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) : 99

సిపిఎం - 67, సిపిఐ - 17, కేరళ కాంగ్రెస్ (మణి) -5, జనతాదళ్ సెక్యులర్ - 2, ఎన్‌సిపి-2, ఎల్‌జెడి-1, ఐఎన్ఎల్- 1, కాంగ్రెస్, ఎస్-1, ఆర్‌ఎస్‌పి ఎల్- 1, కేరళ కాంగ్రెస్ (బి)-1

యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) : 41

కాంగ్రెస్ -21, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ - 15, కేరళ కాంగ్రెస్ -2, ఎన్‌సికె - 1, కేరళ కాంగ్రెస్ (జె)-1, ఆర్‌ఎంపి -1

పశ్చిమ బెంగాల్ (మొత్తం స్థానాలు 294)

తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) : 217

బీజేపీ - 75, ఇతరులు -2

తమిళనాడు (మొత్తం స్థానాలు 234)

డిఎంకె ఫ్రంట్ : 155

దిఎంకె 133- కాంగ్రెస్ -18, సీపీఎం -2 , సీపీఐ -2

ఎఐఎడిఎంకె ఫ్రంట్ : 73

అన్నాడిఎంకె - 64, పిఎంకె - 5,

బీజేపీ - 4, **ఇతరులు - 6**

అస్సాం (మొత్తం స్థానాలు -126

బీజేపీ ఫ్రంట్ : 69

బీజేపీ - 60, అస్సాం గణపరిషత్ - 9

కాంగ్రెస్ ఫ్రంట్ - 45

కాంగ్రెస్ - 29, ఎఐడియుఎఫ్ - 16,

బీటీపీఎఫ్ - 4 ఇతరులు - 8

పుదుచ్చేరి (మొత్తం స్థానాలు - 30)

ఎఐఎడిఎంకె ఫ్రంట్ : 16

ఎఐఎన్ఆర్ కాంగ్రెస్ 10, బీజేపీ - 6

డిఎంకె ఫ్రంట్ : 9

డిఎంకె - 5, కాంగ్రెస్ -4,

ఇతరులు - 5

వ్యవసాయ రసాయనాల పేర్ల గారడీ

ప్రొఫెసర్ ఎన్. వేణుగోపాలరావు
సెల్ : 9490098905

(గత సంచిక తరువాయి)

కలుపు మందులు

1. 2,4-డి ఎమైన్ సాల్ట్ 58 శాతం : డబ్ల్యుఎస్సి అండ్ ఎస్ఎల్ (ఫినోలిక్ తరగతి) : కాయ్.ఎం; సఫాయ 700 (దేవీదయాళ్), ఆరా 5 అండ్ ఎస్ఎల్; వీడోల్ సూపర్ (ఎక్సల్), ట్విస్టర్, ఇరేజర్ ; వీడ్ మార్ సూపర్ (ధనూకా), వీడోర్ క్రిస్టల్, జురా (అటుల్), కాప్చర్ (కానరి), విల్లో మైన్ (విల్లో ఉడ్)

2. 2,4-డి ఇథైల్ ఈస్టర్ 38 శాతం : హిట్ 44, కిల్ వీడ్ (కిల్ పెస్ట్), వీడ్ మార్ (ధనూకా), కిల్ హర్బ్ 38 (ట్రాపికల్), వీడ్ కిల్లర్ (సూపర్ సిఎస్ఎల్), కటవుట్ (క్రిస్టల్), రుగో (అతుల్), ఫైటర్ 38 (సిసిఎల్), కిసాన్ 38 (ఎడిఎల్)

3. 2,4-డ-జథైల్ ఈస్టర్ 20 శాతం : ఎలక్ట్రాన్ 200 (దేవీదయాళ్), జురా 22,5 (అతుల్)

4. 2,4-డి సోడియం సాల్ట్ 80 శాతం (సింథటిక్ ఆగ్సిన్ తరగతి) : ఫెర్నోగ్సాన్ (సింజంటా), కె-డి (కెఆర్), వీడ్ స్టార్ (షావలెస్), సత్య 80 (దేవీదయాళ్), డోసెల్ (ఎక్సఎల్), సూపర్ హిట్ కిల్ హెర్బ్ (ట్రాఫికల్) సాలిక్స్ (అతుల్), ఫైటర్ 80 (సిసిఐఎల్), కిసాన్ 80 (ఎడిఎల్)

5. అనిలోఫాస్ 30 ఇ.సి : ఆర్మీ (ఐఐఎల్)

6. అట్రాజైన్ 50 డబ్ల్యు.పి., (ట్రై ఎజైన్ తరగతి) : మిల్జైన్ (ఎంఐఎల్), అట్రాటాఫ్ (టాటా), రసాయజైన్ (కెఆర్), అల్ట్రాస్టార్ (షావాలెస్), ఎటాక్ (దేవీదయాళ్), సోలరొ (పిఎల్ ఇండియా), ఎట్రోసెల్ (ఎక్సఎల్), సుమత్ (సుమిల్), జాన్‌గార్డ్ (ఘర్డా), ట్రాక్స్ (షివాలిక్), ఎట్రాఫిల్ (ఇండోఫిల్), ధనూజైన్ (ధనూకా), స్ట్రైక్ (ఐఐఎల్), ఛాపెట్ (కిల్‌పెస్ట్), టాగ్ టాఫ్ (ఎడ్వాన్స్, ఎట్రాసుల్ (సల్ఫర్‌మిల్స్), సిట్రా (పిసిసిపిఎల్), ధ్వంస (బయోస్టాండర్డ్), పొలార్ (కానర్), అట్రో (అంబర్), ఎట్రాగోల్డ్ (సిసిఐఫెల్), అంబ్రా 50 (ఎడిఎల్)

7. ఎజిమ్ సల్ఫ్యూరాన్ 50 శృతం (డి.ఎఫ్) : సెగ్‌మెంట్ (డూపాంట్)

8. బ్రిస్ ప్రై బాక్ సోడియం 10 శాతం (ఎస్.సి.) : మసో (సింజెంటా), అడోరా (బేయర్)

9. బ్యుటాక్లోర్ 50 ఇ.సి. : రసాయన్ క్లోర్ (కె.ఆర్. మిల్ క్లోర్ 50 ఇ.సి. మిల్ ఫాస్ట్, బాజ్ 50 ఇ.సి., థండర్ (ట్రాపికల్), సువ్‌క్లోర్, బంపర్, మితక్లోర్, కికౌట్, ఐరియో, హోల్‌మిన్స్, కెమ్‌క్లోర్, డిమాండ్

10. బ్యుటాక్లోర్ 5 జిఆర్ : మిల్ క్లోర్, బాజ్, థండర్

11. కార్‌ఫెంట్రాజోన్ ఇథైల్ 40 శాతం డిఎఫ్ : నాబూద్ (ధనూకా)

12. క్లోరిమ్యురాన్ ఇథైల్ 25 డబ్ల్యుజి : క్లోబెన్ (డూపాంట్), క్యురిన్ (ధనూకా), ట్రికెం 25, సైనో (అతుల్)

13. క్లొడినాఫాప్ ప్రొపార్గిల్ 15 (ఫైరోగ్సీఫాప్ ప్రొపనిల్ తరగతి) : టోపిక్ (సింజెంటా, ల్యుసిఫెర్ (బేయర్), చాపర్ (డూపాంట్), ఓటటాబీఎమెఖుల్ (షావాలెస్), మిల్‌విన్ (మిల్), విద్యాంస్ (ఎక్సెల్), జైకా (యుపిఎల్), దేవిక్లోడ్ (దేవీ దయాళ్), వియోలా 150 (సుమిల్), డైనోపాస్ (ధనూకా), ఒమెగా (ఐఐఎల్), డయోన్ (ట్రాపికల్), రక్షక్

ప్లస్ (కెమినోవా), అవతార్ (క్రిస్టల్), స్కిప్పర్ (కోరమండల్), హిల్‌పిక్ (హెచో ఐఎల్), రాజర్ (అడ్వాన్స్), ఏక్షన్ (సల్ఫర్‌మిల్స్), ఓమ్ (పిసిసిపిఎల్), సాయింటో (నాగార్జునా), లిటెస్ (అటుల్), మాచిస్ (బయో), ఎల్‌టాప్ (విల్ ఉడ్), కాంపాక్ట్ (అంబర్), ఫార్గో (ఎడిఎల్)(వర్షానికి, మంచుకు కొట్టుకొనిపోదు)

14. సైహలోఫాప్ బ్యుటైల్ 10 శాతం ఇ.సి. : క్లిచర్ (డౌ)

15. డైయురాన్ 80 డబ్ల్యుపి : డొరాన్ (ట్రాపికల్)

16. ఇథాక్సీ సల్ఫ్యూరాన్ 15 డబ్ల్యుడిజి : సన్‌రైజ్ (బేయర్)

17. ఫెనోగ్జోప్రాప్ - పి - ఇథైల్ 6.7 శాతం ఇ.సి. : రైస్ స్టార్

18. ఫెనోగ్జోప్రోప్ -పి ఇథైల్ 9.3 శాతం ఇ.సి. : విప్ సూపర్ (బేయర్), నాకా సూపర్ (కేఆర్), దేవీ ప్లాష్ (దేవీదయాళ్), వెగో సూపర్ (ఐఐఎల్), మెలినా (అతుల్) ఫినోగ్సా (అంబర్)

19. ఫ్లుజి పాప్ - పి - బ్యుటైల్ 13.4 శాతం ఇ.సి. : ఫ్యుసిలేడ్ మాక్స్ (సింజెంటా)

20. గ్లుఫోసివేట్ అమ్మోనియా 15 శాతం ఎస్.ఎల్ : బెస్టా (బేయర్)

21. గ్లైఫొసేట్ 20 ఎస్.ఎల్ (అమ్మోనియా సాల్ట్) : గాంబే

22. గ్లైఫొసేట్ 41 ఎస్.ఎల్ నేపోప్రొఫైల్ ఎమైన్ లవణం : రౌండ్ అప్ (మాన్‌సెంటో - బేయర్), ఆల్ కిల్ (కె.ఆర్.), డ్రైపాస్ఫేట్ (షావాలెస్), వీడ్ ఆల్ (డౌ), గ్లైసెల్ (ఎక్సెల్), మిల్‌సేట్ (మిల్), స్వీప్ (యుపిఎల్), ప్లాగ్లైఫో (పిఐ ఇండియా), గ్లాడియేటర్ 41 (దేవీ దయాళ్), గ్లైకేర్ (లిమాక్స్), గ్లైటాఫ్ (టాటా), ఖట్టం ఎస్ఎల్ (సుమిల్), క్లీన్ అప్ (ఇండోఫిల్), నోవీడ్ (ధనూకా), క్రాప్‌గ్లైఫో (ఎన్ఏసిఎల్), హైజాక్ (ఐఐఎల్), గ్లైపోకిల్ (కిల్‌పెస్ట్), సఫాల్ (ట్రాపికల్), గ్లైఫాస్ (కెమినోవా), సూపర్ కిల్ (సూపర్ సిఎస్ఎల్), క్లింటన్ (క్రిస్టల్), గ్లైమాక్స్ (ఎడ్వాన్స్), గ్లైయిసెల్ (ఏసెల్), వినాశ్ (సల్ఫర్‌మిల్స్), వీటో (పిసిసిపిఎల్), కొనియో (అతుల్), బ్రేక్ (బయో స్టాండర్డ్),, టీటార్ (కానరీ), విల్లోసేల్ (విల్ ఉడ్), దర్బన్ (అంబర్), లగామ్ (ఏఐఎల్)

23. గ్లైఫొసేట్ 5 శాతం ఎస్.ఎల్ అమ్మోనియం సాల్ట్ : టేక్ -5 (ఎక్సెల్)

24. గ్లైఫొసేట్ 71 శాతం ఎస్.జి. అమ్మోనియం సాల్ట్ : ఆల్‌కిల్ (కెఆర్), స్టార్ 71 (షావాలెస్), మిరా 71 (ఎక్సెల్), గ్లాడియేటర్ 71 (దేవీదయాళ్), మిల్ సేట్ 71 (ఎంఐఎల్), గ్లైగ్రాన్ (సుమిల్), ఫ్లైట్ 71 డేరా (ధనూకా), సఫాల్ 71 (ట్రాపికల్)

25. ఇమేజ్ థాపైర్ 10 శాతం ఎస్.ఎల్ : సాలిట్యూడ్ (బేయర్), పర్‌ఫెక్ట్ (కె.ఆర్.), స్పర్ (షావాలెస్), ఇన్‌రో (పిఐ ఇండియా), సుగమ్ (ఎక్సెల్), దేవిసూట్ (దేవీదయాళ్), సుమిజ (సుమిల్), సెలెక్టర్ (ఐఐఎల్), టాగ్‌పైర్ (ట్రాపికల్), డైనామాజ్ (కెమినోవా), గార్డ్ (క్రిస్టల్), ఫెర్‌వంట్ (కోరమాండల్), ఐమాసల్ (సల్ఫర్ మిల్స్), పేట్రెయాట్ (విల్లో ఉడ్), స్వేర్ కట్ (అంబర్)

26. ఐసో ప్రొట్యురాన్ 75 శాతం డబ్ల్యు.పి. : ఐసోగార్డ్ (గార్డా), మిల్ రాన్ (ఐఐఎల్), కమెండో 75 (కిల్‌పెస్ట్) వండర్ (ట్రాపికల్), హిల్‌ప్రొట్యురాన్ (హిల్), ఎచీవ్ (సిసిఐఎల్), అవలంచె 75 (ఎడిఎల్)

27. మెట్రిబ్యుజైన్ 70 డబ్ల్యు.పి. : టాటా మెట్రి (టాటా) సెంకార్ (బేయర్), క్రిజిన్ (కె.ఆర్.), మెట్రిమిల్ 70 (మిల్), మెట్రెక్స్ (ఎక్సెల్), ఎన్కోర్ (దేవీదయాళ్), సుమెత్రి (సుమల్), బారియర్ (ధనూకా), ఎన్కర్ (ఐఐఎల్), డిజైర్ (ట్రాపికల్), స్టీకర్ (క్రిస్టల్), గ్రోమెట్రి (కోరమండల్), మెట్రిట్ (సల్ఫర్‌మిల్స్), ఐ-మాక్స్ (నాగార్జున), ఎఫర్డ్ (కానరి), విల్‌వర్డ్ (విల్‌ఉడ్), వర్డిక్ట్ (జిఎస్‌పి), డియస్టర్ (అంబర్), రాఫ్టెక్ 70 (ఎర్సోల్)

28. మెట్‌సల్ఫ్యూరాన్ మిథైల్ 20 డబ్ల్యుజి / డబ్ల్యుపి : ఆల్‌గ్రిప్ (డూపాంట్), మెట్‌స్టార్ (షావాలెస్), మెస్టీ (యుపిఎల్), హుక్ 20 (ధనూకా), లీడ్ గ్రేస్ (ఐఐఎల్), కిల్ గ్రిఎ (కిల్ పెస్ట్), టాగ్రిస్ (ట్రాపికల్), మెట్‌సిల్ (కెమినోవ), సుల్‌గ్రిస్ (సూపర్ సిసిఎల్), అల్గో (క్రిస్టల్) మిట్‌సు (ఎడ్వాన్స్), సీజ్ (పిపిసిపిఎల్0, కొన్వా (అతుల్), ఎస్ఎంఎస్ (విల్ ఉడ్), బిల్ గ్రిప్ (భారత్), ప్యూజ్ (ఎడిఎల్)

29. అగ్సాడయార్గిల్ 6 శాతం ఇ.సి. : రాఫ్ట్ (బేయర్)

30. అగ్సా దయార్గిల్ 80 డబ్ల్యుపి : టాప్ స్టార్ (బేయర్)

31. ఆక్సీఫ్లు రోఫెన్ 23.5. ఇ.సి. : వినాశ్ (అడ్వాన్స్), గోల్ (డౌ), ఆక్సీగోల్డ్ (ఇండోఫిల్), హెూంచో (టాటా), క్రోల్ (కెఆర్), ఆయస్టర్ (దేవీదయాళ్), జార్గన్ (ధనూకా), ఆర్బిట్ (ఐఐఎల్), టాగ్ గ్లోబ్ (ట్రాపికల్), రొనాల్డో (క్రిస్టల్), వాడా (హెపిఎం), ఇన్‌గోల్డ్ (బయో), ఆక్సీగార్డ్ (విల్ ఉడ్),

32. పారక్వాట్ డైక్లోరైడ్ 24 శాతం ఎస్.ఎల్. : గ్రామోగ్జోన్ (సింజెంటా), కాపిక్ (కెఆర్), స్వాట్ (షావాలెస్), పారాగార్డ్ (ఘర్దా), ఫైర్‌స్టామ్ (కెమ్చుత్ర), క్రెజిల్ (లిమాక్స్), పరాలాక్ (టాటా), ఓజోన్ (ధనూకా), మిల్‌క్వాట్ (ఐఐఎల్), టాగ్విట్ (ట్రాపికల్), సూపర్ పెరా(సూపర్ సిఎస్ఎల్), ఆల్‌క్విట్ (క్రిస్టల్), వీడాక్స్ (కోరమండల్), స్ట్రైకర్ (ఎడ్వాన్స్), గ్రామెగ్జిల్ (ఎస్సెల్), పరాసాక్ (శివాలిక్), కిల్‌కాట్ (ఓష్‌విక్), రైనో (నాగార్జున), పరాక్వి (బయో), కటార్ (కానరి), విల్‌క్వాట్ (విల్ ఉడ్), తేజాస్ (అంబర్), గ్రామెక్స్ (సిసిఐఎల్)

33. పెండి మెథాలిన్ 30 ఇ.సి. : స్టాంప్ (బిఎస్ఎఫ్), టాటా పానిడా (టాటా), ధనుటాప్ (ధనూకా), క్రి-స్టాప్ (కెఆర్), స్వాల్ పెండి (షావలెస్), పెండిలిన్ (మిల్), ఎక్సెల్‌ప్లస్ (ఎక్సెల్), బంకర్ (విఐఇండి), డిపెండ్ (దేవీదయాళ్), స్పెంటా (సుమిల్), పెండిక్లీన్ (లిమాక్స్), పెండామిల్ (ఐఐఎల్), స్డంపు (కిల్‌పెస్ట్), టాగ్ పెండి (ట్రాపికల్), పెండి హెర్బ్ (కెమినోవ), సూపర్ పెండా (సూపర్ సిఎస్ఎల్), పెండ్రిల్ (క్రిస్టల్), ఈజికిల్ (కోరమండల్), పన్‌టాక్ (ఎడ్వాన్స్), పెండోష్ (ఓషినిక్), పెండిస్టార్ (హెచ్‌సిఎల్), పెండసల్ఫ్ (సల్ఫర్‌మిల్స్), క్లీన్ అప్ (పిసిసిపిఎల్), గ్లైరిస్ (అతుల్), పెండా (ఐపిఎల్), ధాయ్‌పన్ (కానరి), అక్టాలియా (విల్ ఉడ్), పెండి ఫిక్స్ (జిఎస్‌పి), రాపిడ్ ఎక్స్ (అంబర్)

34. పెండి మెథాలిన్ 38.7 శాతం : స్టాంప్ ఎక్స్ట్రా (బిఎస్ఎఫ్),

పెండిరిచ్ (జిఎస్‌పి), పెనిడా గ్రాండె (టాటా), గార్డెన్ క్లీన్ (డౌ)

35. పెనాగ్జీసులమ్ 240 ఎస్‌సి : గ్రానైట్ (డౌ)

36. పినొగ్జాడెన్ 5 శాతం ఇ.సి. : ఆగ్జియల్ 5.1 (సింజెంటా), మెల్సా (పిఐ ఇండియా)

37. ప్రెటిల్లాక్లోర్ 50 ఇ.సి. : రిఫ్ట్ (సింజెంటా), ప్రిన్స్ (కె.ఆర్.), పిల్లా (షావాలెస్) మెరిట్ (ఎక్సెల్), ప్రాఫిట్ 100 (దేవీదయాళ్), ఇటిలా (లిమాక్స్), ప్రీత్ (టాటా), ఫోబియో (సుమిల్), ఆఫ్‌సెట్ (ఇండోఫిల్), క్రేజ్ (ధనూకా), రేసర్ (ఐఐఎల్), టాగ్ హిట్ (ట్రాపికల్), ప్రెట్టీహెర్బ్ (కెమినోవ), సూపర్ కట్ (సూపర్ సిఎస్ఎల్), షిఫ్ట్ (క్రిస్టల్), ఫైరెట్ (కోరమండల్), హిల్ ప్రితి (హెచ్ఐఎల్), బాక్స్టర్ (అడ్వాన్స్), షూర్ షాట్ (సల్ఫరోమిల్స్), క్లీన్ అవుట్ (పిసిపిఐఎల్), ఇరేజ్ (నాగార్జున), లినియా (అతుల్), రిమువ్ (బయోస్టాండర్డ్), ప్రెట్లా (కానరి), విల్ ఫిట్ (విల్ ఉడ్), ఉజిలా (అంబర్), ప్రెటెలా (సిసిఐఎల్), రాప్ 50 (ఎడిఎల్)

38. ప్రెటైలాక్లోర్ 37 ఇ.డబ్ల్యు : రిఫ్ట్ ప్లస్ (సిజెంటా), ఉజలాసూపర్ (అంబర్)

39. ప్రొపాక్విజఫోప్ 10 ఇ.సి., : సొసైటీ (ఇండోఫిల్)

40. పైరజోసల్ఫ్యూరాన్ 10 డబ్ల్యుపి. : సాధీ (యుపిఎల్)

41. పైరి థయోబాక్ సోడియం 10 ఇ.సి. : రైఫ్ (కెమినోవ), నాన్‌చకు (బయోస్టాండర్డ్),

42. పైరొగ్సాఫోప్ ప్రొపినైల్ 15 శాతం డబ్ల్యుపి : సట్రజ్ (టాటా)

43. క్విజలోఫోప్ -పి-టెట్యురిల్ 4.41 శాతం ఇ.సి. : పన్‌టెరా (డూపాంట్)

44. క్విజలోఫోప్ ఇథైల్ 5 శాతం ఇ.సి. : టర్గా సూపర్ (ధనూకా), హక్‌మా (ఐఐఎల్), కింగ్ సూపర్ (స్వస్తిక్)

45. సల్ఫోసల్ఫ్యూరాన్ 75 డబ్ల్యుజి : యునిక్ (షావాలెస్), లల్కార్ (ఎక్సెల్), ఎస్.ఎఫ్-10 (యుపిఎల్), ఫతే (టాటా), ప్యూరో 123 (సుమిల్), సుల్‌టాప్ (ధనూకా), కైజర్/గురు (ఐఐఎల్), టాగ్‌స్టాక్ (ట్రాపికల్), సుమిత్ (కెమినోవ), సూపర్ సల్ఫ్ (సూపర్ సిఐఎల్), ఏరో (సల్ఫర్‌మిల్స్) బ్లాంకెట్ (పిసిపిఐఎల్), లాగ్జో (అతుల్), అవస్ట్ 10 (ఎడిఎల్)

46. టెమ్‌బొట్రయెరిన్ 42 శాతం ఎస్.సి. : లాడిస్ (బేయర్)

47. క్లొడినోఫావ్ ప్రొపార్‌గిల్ + మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ : సందేశ్ (షావాలెస్)

48. ఫాయె సేఫన్ + ఫ్యుజిఫాస్ బ్యుటైల్ : ఫ్యుసిఫ్లెక్స్ (సింజెటా)

49. ఇమెజ్ థఫైర్ + ఇమాజా మాక్స్ : ఒడ్డిస్సే (బిఎఎస్ఎఫ్), అడ్యు (బేయర్), బింగో (పిడి ఇండి), జోడి (బయో), పైరోమాక్స్ (కోరమండల్)

50. థయోబెన్ కార్బ్ + ప్రొపెనిల్ : సాటునిల్ 600 ఇ.సి. (బయోస్టాండర్డ్)

(తరువాత సంచికలో సూక్ష్మపోషక, మొక్క పెరుగుదల మార్పుకోసం వాడే మందుల మాయను చర్చించుకుందాం)

చెరకు రైతులకు అందని బకాయిలు

- **రూ.96.8 కోట్ల పెండింగు**
- **చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వినతి**

రాష్ట్రంలో చెరకు రైతులు తమకు ఫ్యాక్టరీ యాజమాన్యాల నుంచి రావాల్సిన డబ్బులు సకాలంలో అందక ఆర్థిక ఇబ్బందుకు గురువుతున్నారు. చెరకు బకాయిలపై ఫ్యాక్టరీ యాజమానుల నుంచి ఎలాంటి స్పందనా రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెరుకు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 2020-21 చెరకు సీజన్ బిల్లులు రూ.96.8 కోట్లు రైతులకు అందాల్సి ఉంది. చెరకు పంట చేతికి రావడానికి 10 నుంచి 12 నెలలు సమయం పడుతుంది. పండించిన పంటను ఫ్యాక్టరీకి సొంత ఖర్చులతో సరఫరా చేసిన రైతులకు సకాలంలో చెరకు డబ్బులు చేతికి రావడం లేదు. రెండు సంవత్సరాలుగా పెట్టబడులు పెట్టి తిరిగి రాకపోవడంతో అప్పులు, వడ్డీల భారం పెరిగి అన్నదాతలు కృంగిపోతున్నారు. 1966 సుగర్ కంట్రోలు చట్టం ప్రకారం పంట సరఫరా చేసిన 14 రోజుల్లో చెల్లింపులు చేయాలి. ఒక వేళ ఆలస్యం అయితే ఆ కాలానికి 15 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలి. కానీ ఇవేవీ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యాలకు పట్టడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని యాజమాన్యాల నుంచి బకాయిలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని చెరకు రైతులు కోరుతున్నారు. వివిధ ఫ్యాక్టరీల నుంచి రావాల్సిన బకాయిలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లాలోని సూదలగుంట మయూర్ సుగర్ ఫ్యాక్టరీ నుంచి రూ.34 కోట్లు, నేతం సుగర్ ఫ్యాక్టరీ నుంచి రూ.36 కోట్లు, నెల్లూరు జిల్లాలోని పొదలకూరు సుగర్ ఫ్యాక్టరీ నుంచి రూ.11 కోట్లు, విజయనగరం జిల్లాలోని లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ నుంచి రూ.15.80 కోట్లు రావలసిన బకాయిలున్నాయి.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- **ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ**

క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షాలకు పంట నష్టం తీవ్రంగా వాటిల్లిందని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై.కేశవరావు, మర్రాపు సూర్యానారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో కళ్లాల్లో ఉన్న మిర్చి పంట వర్షాలకు తడిసిపోయిందని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలో పలుచోట్ల మామిడి పంట తీవ్రంగా దెబ్బతిందన్నారు. విజయనగరం జిల్లాలో జీడి మామిడి, ఉభయ గోదావరి జిల్లాల్లో కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులు వర్షాలకు దెబ్బతిన్నాయని తెలిపారు. పిడుగుపాటుకు చిత్తూరు జిల్లాలో ఓ రైతు దుర్మరణం పాలయ్యారని, రైతు కుటుంబానికి ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, పంటల బీమా వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

హైబ్రిడ్ సీతాఫలం తోటలు

సంగిరెడ్డి హనుమంత రెడ్డి

పూర్వం గుట్టలు, కొండలు, గడ్డి మైదానాలలో సీతాఫలం చెట్లు విరివిగా పెరిగేవి. పశువులను మేపడానికి, కొండ గడ్డి కోసుకోవడానికి పోయినవారికి కావలసినన్ని సీతాఫలాలు దొరికేవి. వీటితోపాటు కలివె కాయలు, బలిజె కాయలు, బిక్కిరి కాయలు, రేగు పండ్లు, చెట్టు చేమల్లో, కొండ రాళ్లలో తేనెతుట్టెలు కోరినన్ని లభించేవి. ఇప్పుడు గుట్టలు, కొండలు, గడ్డి మైదానాలు జనారణ్యాలుగా మారాయి. ఇక పండ్లు, కాయలు ఎక్కడ దొరుకుతాయి. అన్నీ అపురూపాలే. అంగడి సరుకులే. వాణిజ్య వస్తువులే. అన్ని పండ్లలో వలెనే సీతాఫలాలలో కూడా స్వదేశీ రకాలు మాయమయ్యాయి. విదేశీ రకాలు, హైబ్రిడ్ పండ్లు అందుబాటులోకి వచ్చాయి. మనం కూడా కొంతయినా లాభం పొందాలంటే విదేశీ రకాలను, హైబ్రిడ్ పండ్లను పెంచక తప్పదు.

సీతాఫలం "అనొనేసియే వృక్ష" కుటుంబానికి చెందిన చెట్టు. దీనిలో 160 జాతులు ఉన్నాయి. వీటిలో చాలా జాతులను వాణిజ్య స్థాయిలో పెంచుతారు. ఇది ఉష్ణ మండల వాతావరణాలలో, మంచులేని ప్రాంతాలలో, సాధారణ భూముల్లో పెరిగే శీతాకాలం మొక్క. గుట్టలు, కొండలు, మెట్ట ప్రాంతాలలో ఈ మొక్కలు సహజంగా విరివిగా పెరుగుతాయి. ఈ సహజ వృక్షాలు ఐదారు అడుగుల కంటే ఎత్తు పెరగవు. కాపు కూడా పరిమితమే. ఇది రామాఫలం, లక్ష్మణఫలం రూపాలలో కూడా కాస్తుంది. ఇవి మూడూ చూడడానికి ఒకే రకంగా ఉన్నా.. రుచీ వాసనలలో కొంచెం తేడా ఉంటుంది. ఈ పేర్లు చూస్తే ఈ పండ్లు మన దేశానివేనేమో అనిపిస్తుంది. కానీ ఇది దక్షిణ అమెరికా, వెస్ట్ ఇండీస్, ఐరోపా, ఆఫ్రికా దేశాల చెట్టు. ఈ పండు కొంచెం అటు ఇటుగా ఎద్దు గుండె ఆకారంలో ఉంటుంది. అందువలన కొన్ని దేశాల్లో దీనిని ఎద్దు గుండె పండు అని కూడా పిలుస్తారు. ప్రచారంలో ఉన్న సమాచారం ప్రకారం స్పెయిన్ దేశ వ్యాపారులు దీనిని ఆసియా ఖండానికి పరిచయం చేశారు. పోర్చుగీసు వాళ్ళు దీనిని తొలిసారిగా 16 వ శతాబ్దంలో మన దేశానికి తెచ్చారు. పోర్చుగీసులో దీనిని 'అటా' అంటారు. అయితే భారత దేశ చారిత్రక నిర్మాణాలలో భిన్నమయిన దృశ్యాలు కనిపిస్తాయి. మధ్య ప్రదేశ్‌లోని బార్హట్, సాంచి స్థూపాలలో, మహారాష్ట్రలోని అజంతా గుహలలో, ఉత్తరప్రదేశ్‌లోని మధుర శిల్పాలలో సీతాఫలాల చిత్రాల చెక్కడాలు, బొమ్మలు, శిల్పాలు ఉన్నాయి. వీటినిబట్టి క్రీస్తు పూర్వం రెండో శతాబ్దానికి ముందు నుండే మన దేశంలో సీతాఫలాలు ఉన్నట్లు తెలుస్తోంది.

మన రాష్ట్రంలో ఎక్కువగా సీతాఫలాలు పండుతాయి. అందువలన మనకు సీతాఫలాలే తెలుసు. కానీ మన ఉత్తరాంధ్ర, కొన్ని తెలంగాణ జిల్లాలలో, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో రామా ఫలాలు, లక్ష్మణ ఫలాలు ఎక్కువగా పండుతాయి. అతి మధురంగా ఉండే సీతాఫలాన్ని ఇంగ్లీషులో 'కస్టర్డ్ యాపిల్' అని, 'షుగర్ యాపిల్' అని పిలుస్తారు. దక్షిణ అమెరికా దేశాలతోపాటు మన దేశంలోనూ ఇది ఎక్కువగా పండుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండలంలో సీతాఫలాలు అత్యధికంగా పండుతాయి. ఇక్కడ నుండి కోల్‌కతా (కలకత్తా), విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం ప్రాంతాల వ్యాపారులు ఎక్కువగా కొని తీసుకుపోతుంటారు. ముఖ్యంగా కోల్‌కతా ప్రాంతంలో ఈ పండ్లకు ఎక్కువ గిరాకీ ఉంది.

సీతాఫలం సాగు పద్ధతి : చలికాలంలో మూడు నెలలపాటు ఈ పండ్లు కాస్తాయి. సీతాఫలం చెట్లు మూడవ ఏట కాపునకు వచ్చి 15 ఏళ్ల పాటు కాపు కాస్తాయి. సర్వ సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో పూతకొచ్చి ఆగస్ట్, నవంబర్ నెలల్లో కాపుకొస్తాయి. చెట్టు పూలు పూసినప్పటి నుండి పండ్లు తయారు కావడానికి 20-25 వారాలు పడుతుంది. ఒక్కొక చెట్టు కాపుకు 50, 60 కాయలు కాస్తుంది. సగటున ఎకరానికి రూ. 1.5 నుండి రూ. 2 లక్షల ఆదాయం వస్తుంది. భూమిలో విత్తనాలునాటి చెట్లు పెంచడం మామూలు పద్ధతి. ఇంటి పెరట్లో పాదులు తీసి, సారవంతమైన మట్టి పోసి, తడిచేసి విత్తనాలు నాటి క్రమంగా నీరు పోసి మొక్కలు పెంచుకోవచ్చు. ఇదే పద్ధతిలో నారుమడి లాగా ఒక ప్రదేశంలో మొక్కలు పెంచి వాటిని పొలాలలో తిరిగి నాటవచ్చు. నారుమడికి విత్తనాలను రెండు మూడు సెంటీమీటర్ల లోతులో ఐదారు సెంటి మీటర్ల దూరంలో విత్తాలి. పెద్ద ఎత్తున నేరుగా తోటలలో నాటేటప్పుడు విత్తనాలను రెండు మూడు సెంటి మీటర్ల లోతులో, అటు ఇటు ఐదు మీటర్ల దూరంలో నాటాలి. విత్తనాలను, మొక్కలను సాధ్యమైనంతవరకు వర్షాకాలంలో పెట్టుకోవాలి. పూర్తి ఎండ వాతావరణం నుండి ఒక మోస్తరు నీడ వరకు సరిపోతుంది.

సీతాఫలం చెట్లు ఉప్పునేలల నుండి అనావృష్టి భూముల వరకు అన్ని రకాల పొలాల్లో తక్కువ నీటితో పెరుగుతాయి. చీడలు, క్రిములు, పురుగులను బాగా తట్టుకుంటాయి. ఈ చెట్లకు ఎక్కువ, నిర్వహణ, పోషణ అవసరం లేదు. కొర్ర, జొన్న, సొద్దలు (సజ్జలు), అపరాలు పండే భూములు సీతాఫలం చెట్లకు అనుకూలమైనవి. ఒక మోస్తరు నీటి వసతి చాలు. సారవంతమయిన, చదును చేసిన తడి నేలలో విత్తనాలు లేదా మొక్కలు నాటాలి. 25 నుండి 41 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉండాలి. ఏ విధమయిన సేంద్రీయ ఎరువు వాడినా సరిపోతుంది. సీతాఫలం చెట్టు రకం, జాతిని బట్టి 10 నుండి 30 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. పెద్ద గాలులకు ఈ ఎత్తు మొక్కలు విరిగి పోతాయి. అందువలన గాలి తక్కువ ప్రాంతాలలోనే ఈ చెట్లనుపెంచడం మంచిది. ఏడాది పొడవునా సాధారణ సంరక్షణ

రామాఫలం

ఎర్ర సీతాఫలం

సరిపోతుంది. చెట్టు చుట్టూ గడ్డి, కలుపు మొక్కలు పెరగ కుండా చూసుకుంటే చాలు. ఎలాంటి ప్రత్యేక జాగ్రత్తలు అవసరం లేదు. కాయలు పచ్చిగా ఉన్నప్పుడే చాలా అరుదుగా చీడలు సోకుతాయి. తొడిమకు రెండో వైపు భాగానికి రోగం సోకి కాయంతా వ్యాపిస్తుంది. 2-10 మిల్లి మీటర్ల వ్యాసంతో మృత కణాల ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడి నల్ల మచ్చలుగా మారతాయి. పెరుగుదల ఆగి కాయలు ముడుచుకుపోయి, ఎండిపోయి చెట్టుకు అంటి పెట్టుకుని ఉంటాయి. లేదా రాలిపోతాయి. చీడ సోకిన కాయలను పెరికి పారేయడం తప్ప వేరే చికిత్స లేదు.

సీతాఫలం చెట్లు నాటే పద్ధతి : 60 సెంటి మీటర్ల పొడవు, వెడల్పు, లోతులతో గుంటలు తీసి పెట్టుకోవాలి. తోట నేలలను బట్టి, చెట్టు రకాలను బట్టి ఈ గుంటల మధ్య దూరం 4, 5, 6 మీటర్లు వుండాలి. ఈ గుంటలను ఎరువుతో నింపి పెట్టుకోవాలి. వర్షాకాలంలో ఈ గుంటలలో మొక్కలు నాటుకోవాలి. 5 మీటర్ల దూరంతో ఎకరాకు 160 మొక్కలు నాటవచ్చు. ఇంతకు మునుపు టమోటా, బంగాళాదుంపలు, క్యాప్సికం, అల్లం పండించిన పొలాలలో సీతాఫలం చెట్లు నాటడం మంచిది కాదు.

సీతాఫలంలో పోషక పదార్థాలు - ఔషధ గుణాలు : పచ్చి సీతాఫలం తినడానికి పనికిరాదు. బాగా పండిన తర్వాత మాత్రమే తినడానికి వీలవుతుంది. సీతాఫలం చుట్టూ కళ్లులాగా బెరడులాంటి పదార్థం ఉంటుంది. పండిన సీతాఫలంపై ఈ కళ్లను విడదీస్తే లోపల ఒక్కొక్క గింజ చుట్టూ తెల్లటి మధురమయిన గుజ్జు ఉంటుంది. కాలానుగుణంగా ఉత్పత్తి అయ్యే పండ్లలో ఒక్కొక్క పండుకు ఒక్కొక్క ప్రాధాన్యత ఉంటుంది. ఏ పండు అయినా, శరీరానికి కేలరీలతో(శక్తి)పాటు తగిన మోతాదులో మాంసకృత్తులను సైతం అందిస్తుంది. అయితే సీతాఫలం ఇందుకు భిన్నమైనది. ఆహార పదార్థంగా ఆకలిని తీర్చడమేగాక, ఆరోగ్యాన్ని పెంచే ఔషధ గుణాలు ఇందులో ఉన్నాయి. సీతాఫలం ఆకు మొదలుకుని గుజ్జు తిన్న తరువాత పారవేసే గింజల వరకూ ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయని

వైద్యశాస్త్రం నొక్కి చెపుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే సీతాఫలం చెట్టులోని ప్రతి భాగం ఔషధమే. దేహపుష్టి పెంపు నుంచి కొన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులను నశింపచేసే శక్తి సీతాఫలానికి ఉంది. రోగనిరోధక శక్తిని ఇనుమడింపజేసే ఔషధ గుణగణాలు సీతాఫలంలో ఉన్నాయి. సీతాఫలం పోషకాలు నిండుగాగల పండు. మనం దీనిని కేవలం పండుగానే తింటాము. కానీ దీని గుజ్జుతో అనేక రకాల స్వీట్లు, జెల్లీలు, ఐస్ క్రీములు, జాములు తయారు చేస్తారు. ఛత్తీస్ గఢ్‌లో సీతాఫలాన్ని పండునే గాక ఆకులు, బెరడు, వేర్లను కూడా ఔషధాల తయారీలో ఉపయోగిస్తారు. ఆకుల కషాయం మధుమేహాన్ని, శరీర బరువును తగ్గిస్తుందని, జలుబును నివారిస్తుందని నిపుణులు తెలిపారు. ఈ సంజీవిని ఇంకా ఎన్ని విధాల ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుస్తుందో చూద్దాం.

సగటున సీతాఫలం బరువు 160 గ్రాములు ఉంటుంది. దాని నుండి వచ్చే 100 గ్రాముల గుజ్జు నుంచి 94 క్యాలరీల శక్తి, 20-25 గ్రాముల పిండి పదార్థాలు, 2.5 గ్రాముల ప్రొటీన్లు (పోషకపదార్థాలు), 4.4 గ్రాముల పీచు లభ్యమవుతాయి. సీతాఫలంలో కాల్షియం(సున్నం), ఫాస్పరస్ (భాస్వరం), పొటాషియం, మెగ్నీషియం, కెరోటిన్, థైమీన్, నియాసిన్, రిబోఫ్లేవిన్, బి6, బి2, బి3, బి5, బి9 విటమిన్లు, విటమిన్-సి సమృద్ధిగా లభిస్తాయి. విటమిన్ బి6 శ్వాసకోశ సంబంధ రోగాలు సోకే అవకాశాలను తగ్గించి ఉబ్బసం పోటును తగ్గిస్తుంది. మెగ్నీషియం వలన గుండెపోటు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. మెగ్నీషియం శరీరంలో నీటి సమతుల్యతను కాపాడి కీళ్ల నొప్పులను నివారిస్తుంది. ఈ పండులో సోడియం తక్కువ స్థాయిలో ఉండటం వలన కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించి రక్తపోటును నియంత్రిస్తుంది. ఇది కాలేయ ఆరోగ్యాన్ని కూడా పెంపొందిస్తుంది. ఈ పండును రసం రూపంలో కాకుండా నేరుగా తినడమే మంచిది. ఎందుకంటే దీని గుజ్జు నోటిలోని జీర్ణ రసాలను పెంచుతుంది. తద్వారా జీర్ణక్రియ వేగవంతమవుతుంది. సీతాఫలంలోని రాగి ధాతువు వలన కూడా జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఈ పండు గుజ్జుతో రసం చేసి, దానికి పాలు కలిపి పిల్లలకు తాగిస్తే సత్వర శక్తి లభిస్తుంది. ఎదిగే పిల్లలకు ప్రతి రోజూ ఒకటి, రెండు పండ్లు తినిపిస్తే మంచిది. బలవర్ధకమే కాక ఈ పండులోని ఫాస్పరస్ (భాస్వరం), క్యాల్షియం (సున్నం), ఇనుము లాంటి ఖనిజాలు ఎముకల, కేశాల పరిపుష్టికి తోడ్పడతాయి. రక్తహీనతను తగ్గించి, రోగనిరోధక శక్తిని, మెదడు చురుకుదనాన్ని పెంచుతాయి. కీళ్ల నొప్పులు, వాపులకు ఈ పండు దివ్యౌషధంలా పనిచేస్తుంది. రోజూ తినగలిగితే చాలా మార్పు కనిపిస్తుంది. హృద్రోగులు, కండరాలు, నరాల బలహీనత ఉన్నవారు దీన్ని అల్పాహారంగా తీసుకుంటే మంచి ప్రయోజనం ఉంటుంది. ఆహార నియంత్రణ (డైటింగ్) నియమాలు, పథ్యం పాటించే వారు కూడా ఈ ఫలాన్ని నిరభ్యంతరంగా తినవచ్చు. ఈ పండులోని సల్ఫర్ (గంధకం) చర్మవ్యాధులను తగ్గిస్తుంది. చర్మ క్యాన్సర్ రాకుండా ఎదుర్కొంటుంది. శరీరంలో ఇతర కణాలలో క్యాన్సర్ కణాల పెరుగుదలను అరికట్టి క్యాన్సర్ ను నిరోధిస్తుంది. సీతాఫలం దంతాల ఆరోగ్యానికి చాలా మంచిది. పంటి నొప్పి, పండ్ల పుచ్చులను నివారించడానికి బాగా సహాయపడుతుంది. సీతాఫలంలోని రెబోఫ్లేవిన్, విటమిన్ సి కళ్ళ ఆరోగ్యానికి చాలా మంచివి. సీతాఫలం గుజ్జు శరీరంలోని క్రిములు, వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపిస్తుంది.

సీతాఫలం ఆకులు కూడా ఉపయోగపడతాయి. ఆకుల్లోని హైడ్రోసైనిక్ ఆమ్లం (ఉదజనికామ్లం) చర్మసంబంధ సమస్యల్ని తగ్గిస్తుంది. ఆకులను మెత్తగా నూరి, కాస్త పసుపు కలిపి సెగగడ్డలకు, గాయాలకు, గజ్జి, తామరలకు పూతగా రాస్తే వాటిని నయం చేస్తుంది. బోరిక్ పౌడర్ కలిపి మంచం, కుర్చీల మూలల్లో ఉంచితే నల్లుల బెడద ఉండదు. సీతాఫలం బెరడును, వేర్లను కాచి కషాయాన్ని అధిక విరేచనాలకు ఔషధంగా ఇస్తుంటారు. సీతాఫలం గింజల్ని పొడిచేసి, కొబ్బరి నూనెలో కలిపి తలకు రాసుకుంటే పేల సమస్య ఉండదు. అయితే కళ్లల్లో పడకుండా చూసుకోవాలి. గర్భిణి స్త్రీలు ఈ పండును తక్కువగా తినాలి. గర్భిణీ స్త్రీలు సీతాఫలం తినడం వల్ల పొట్టలో పెరిగే శిశువు మెదడు, నాడీ వ్యవస్థ, వ్యాధి నిరోధకత పెరగడానికి సహాయపడుతుంది. గర్భస్రావాన్ని నివారిస్తుంది. వాంతులు, వికారాలను (మార్నింగ్ సిక్ నెస్) నివారిస్తుంది. ప్రసవం తర్వాత బరువు తగ్గడానికి సహాయపడుతుంది. గింజలు కడుపు లోపలికి పోతే గర్భస్రావం అయ్యే ప్రమాదముంది. పొరపాటున ఎవరైనా సీతాఫలం విత్తనాన్ని మింగినప్పుడు అది పగలకుండా ఉంటే ఏమీ కాదు. దాన్ని నమిలినా, పొట్టలో పగిలినా విషంలా మారుతుంది. మోతాదుకు మించి సీతాఫలాలు తింటే కడుపులో మంట, ఉబ్బరం బాధిస్తాయి. అలాంటప్పుడు వేడినీరు తాగినా, అరచెంచా వాము నమిలి మింగినా లేదా ఉప్పు మింగితే ఉపశమనం కలుగుతుంది. మధుమేహ

వ్యాధిగ్రస్తులు, ఊబకాయులు ఈ పండ్లను వైద్యుల సలహాతో తీసుకోవాలి. బరువు పెరగాలనుకునే వారు సీతాఫలం రసంలో తేనె, పాలు కలిపి క్రమం తప్పక తాగితే క్యాలరీలు పెరిగి బరువు పెరుగుతారు. జలుబు, దగ్గు, ఆయాసం, ఎలర్జీ (వికటించే గుణం)లతో బాధపడేవారు సీతాఫలాన్ని పరిమితంగా తీసుకోవాలి. ఇందులో ఉండే మెగ్నీషియం శరీరంలోని కండరాలకు విశ్రాంతి నిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది. కాల్షియం ఎముకల పటుత్వాన్ని పెంచుతుంది. పీచు పదార్థాలు మలబద్ధకాన్ని అరికడతాయి. ఇన్ని లాభాలున్నా మధుమేహ రోగులు వీటిని తినక పోవడమే మంచిది. ఎందుకంటే వీటిలో చక్కెర శాతం చాలా ఎక్కువ.

సోలాపూర్ జిల్లా బార్శి గ్రామంలో హైబ్రిడ్ సీతాఫలం తోట

ఉబ్బసం రోగులు వైద్యుల సలహాతో తినాలి. సీతాఫలాలను ఖాళీ కడుపుతో తినకూడదు, భోజనం చేశాకే తినాలి. తిన్నాక మంచి నీళ్లు ఎక్కువగా తాగాలి. సీతాఫలాల విత్తనాలతో చిన్నపిల్లలు చాలా రకాల ఆటలు ఆడుకుంటారు.

బీడు భూముల్లో హైబ్రిడ్ సీతాఫలం తోటలు : మహారాష్ట్రలో నీటి ఎద్దడి వలన పంటలు పండని బీడు భూముల్లో హైబ్రిడ్ సీతాఫలం తోటలు పెంచుతున్నారు. నీటి వసతి తక్కువగా ఉన్న అన్ని రకాల భూముల్లో అన్ని రుతువులలో సీతాఫలాలు పండిస్తున్నారు. ఇవి క్రిమి కీటకాలను బాగా ఎదుర్కొంటాయి. మంచి ఆదాయాలను అందిస్తున్నాయి. షోలాపూర్ జిల్లా బార్శి గ్రామంలో హైబ్రిడ్ సీతాఫలం తోటలను విపరీతంగా పెంచుతున్నారు. 2000 సంవత్సరంలో మహారాష్ట్ర ప్రభుత్వం పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించే పథకం చేపట్టింది. అందులో భాగంగా షోలాపూర్ జిల్లాలో హైబ్రిడ్ రకం సీతాఫలం తోటల పెంపకానికి రైతులకు సహకరిస్తోంది. ఇప్పుడు జిల్లాలో 1,600 కుటుంబాలు 4,260 ఎకరాలలో హైబ్రిడ్ సీతాఫలం తోటలు పెంచుతున్నారు. బార్శి గ్రామంలో ఇతర గ్రామాలలో కంటే ఎక్కువగా.. అంటే 500 కుటుంబాలు హైబ్రిడ్ సీతాఫలం తోటలు పెంచుతున్నారు. అంతేగాక ఇతర పంటల కంటే ఎక్కువ ఈ సీతాఫలాలే పండిస్తున్నారు. షోలాపూర్ జిల్లాతోపాటు బీడ్, ఔరంగాబాద్, పర్భని జిల్లాలలో కూడా హైబ్రిడ్ సీతాఫలం తోటలను పెంచుతున్నారు. హైబ్రిడ్ సీతాఫలంలో ఎన్.ఎం.కె.-01 (గోల్డన్) అతి శ్రేష్టమైనది. ఈ రకం సీతా ఫలాలను బార్శి గ్రామంలో ఎక్కువ పండిస్తారు. ఎర్ర సీతాఫలం, బాలానగరి, వాషింగ్టన్, పురంధర్, అనొన-2 వంటి ఇతర హైబ్రిడ్ రకాల సీతాఫలాలను మహారాష్ట్ర ఇతర ప్రాంతాలలో పండిస్తారు. గోల్డెన్ రకం సీతాఫలంలో విత్తనాలు తక్కువ. పండు మిగల పండినా పగలదు. కాపు కాపుకూ దిగుబడి పెరుగుతుంది. ఈ రకం పండు 400 నుండి 600 గ్రాముల బరువు ఉంటుంది. ఇతర రకాల పండ్ల సగటు బరువు 160 గ్రాములే. ఈ రకం చెట్టుకు 20 పండ్లు కాస్తాయి. ఎకరానికి 340 చెట్లు నాటుతారు. చెట్టుకు 7, 8 టన్నుల దిగుబడి వస్తుంది.

భారత దేశంలో 1,37,500 ఎకరాలలో సీతాఫలాలు పండిస్తున్నారు. ఒక్క మహారాష్ట్రలోనే అత్యధికంగా 17,500 ఎకరాలలో ఏడాదికి 93,000 టన్నుల సీతాఫలాలు పండుతున్నాయి. ముంబయి మార్కెట్‌లో 2019 నవంబర్‌లో క్వింటాల్ సీతాఫలాల ధర రూ.4,540లు. మహారాష్ట్ర నుండి సీతాఫలాలు ముంబయి, పుణే, హైదరాబాద్, విజయవాడ, బెంగుళూరు, ఢిల్లీలకు ఎగుమతి అవుతాయి. ఇటీవలి కాలంలో బార్శి తాలూకాలో సీతాఫలాలు పండించడం బాగా పెరిగింది. తనకు 13 ఎకరాలలో ఏడాదికి రూ.40 లక్షల ఆదాయం వస్తుందని వానేవాడే గ్రామ రైతు అనంత్ మహదేవ్ గర్డాడే చెప్పారు. ఈ గ్రామంలో ఈయన అన్నదమ్ములు మొత్తం 40 ఎకరాల్లో సీతాఫలాలు పండిస్తారు.

విత్తనాలు, మొక్కలు : రకాన్ని, కంపెనీని బట్టి ఒక్కొక్క సీతాఫలం మొక్క రూ.60 నుండి రూ.170 వరకు అమ్ముతారు. 100 గ్రాముల సీతాఫలం విత్తనాలను రూ.70 నుండి రూ.100 ల వరకు అమ్ముతారు. సీతాఫలం చెట్లకు అంటుగట్టి మొక్కలు పెంచి తోటల పెంపకానికి సరఫరా చేస్తారు. సీతాఫలం మొక్కలు మహారాష్ట్ర షోలాపూర్ జిల్లా బార్శి తాలూకాలో దొరుకుతాయి. అక్కడ 300 పైగా నర్సరీలలో గోల్డన్, సూపర్ గోల్డన్ రకాల మొక్కలు అమ్ముతారు. బార్శి నుండి 20 రాష్ట్రాలకు మొక్కల సరఫరా జరుగుతుంది. సోలాపూర్ లో 20 కి పైగా హోల్ సేల్ దుకాణాలు ఉన్నాయి. ఒక సీతాఫలం మొక్క రూ.60 లకు అమ్ముతారు.

చివరి మాట : భారతదేశంలో వర్షపాతం తగ్గింది. భవిష్యత్తులో పరిస్థితి ఇంకా అధ్వాన్నం అవుతుంది. మన రాష్ట్రం అందుకు అతీతం కాదు. ప్రత్యేకంగా కొన్ని జిల్లాలలో ప్రతి ఏడాదీ కరువు నాట్యం చేస్తోంది. కొన్ని జిల్లాలు ఎడారులుగా మారతాయని నిపుణులు నివేదించారు. ఈ పరిస్థితులలో అతి తక్కువ నీటితో అన్ని రకాల నేలల్లో పండే సీతాఫలాలను, అందులోనూ హైబ్రిడ్ రకాలను, పండించి రైతులు అధిక ఆదాయం పొందే అవకాశం ఉంది. ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహకాలను అభ్యర్థించవచ్చు.

(వ్యాసకర్త : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి)

వేసవిలో రైతులు పొలాల్లో చేయాల్సిన పనులు

డాక్టర్ కళ్యాణి (అసిస్టెంట్ ప్రొఫెసర్)
డాక్టర్ ఎం.అనురాధ (ప్రొఫెసర్),
జె.డి.సరిత (అసిస్టెంట్ ప్రొఫెసర్)
అగ్రికల్చరల్ పాలిటెక్నిక్, పాలెం

ఈ దిగువ తెలిపిన ప్రక్రియలు చేపట్టం వల్ల మనకు జీవనాధారమైన నేల ఆరోగ్యాన్నీ, సారవంతతనూ పెంచొచ్చు.

వేసవి దుక్కులు

పంటలకు వేసవి దుక్కులు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. చాలా మంది రైతులు రబీ పంటలు పూర్తవగానే పొలాన్ని అలాగే వదిలేసి ఖరీఫ్‌లో తొలకరి వర్షాలు పడగానే దున్నడం ప్రారంభిస్తారు. అలా కాకుండా వేసవిలో పడే అకాల వర్షాలను ఉపయోగించుకొని (ఏప్రిల్, మే నెలల్లో) నేలను 25 నుంచి 30 సెంటీమీటర్ల వరకూ లోతులో దుక్కి చేసుకోవడం వల్ల నేల లోపలి పొరల్లో ఉండే పంటలను ఆశించే క్రిమి, కీటకాల కోశస్థ దశలు, గుడ్డు దశలు, కలుపు మొక్కల విత్తనాలు సూర్య కిరణాల తాకిడికి చనిపోతాయి. పక్షులు (కొంగలు) ఏరుకుని తింటాయి. దీనివల్ల పంట వేసిన తర్వాత చీడ, పీడలు, కలుపు మందులకు అయ్యే ఖర్చును తగ్గించుకోవచ్చు.

భూసార పరీక్ష

నేలలు సహజంగా వాటిలో ఉన్న పోషక పదార్థాలతోపాటు అదనంగా వేసిన సేంద్రియ, రసాయనిక ఎరువుల్లోని పోషకాలను మొక్కలకు అందించి పంట దిగుబడికి తోడ్పడతాయి. కాబట్టి నేలల్లోని భూసారాన్ని తరచూ తెలుసుకోవడం ఎంతో అవసరం. తద్వారా ఎరువుల వాడకంలో అనవసరపు ఖర్చులు చేయకుండా భూసారాన్ని కాపాడుకుంటూ, అధిక, సుస్థిర దిగుబడులను పొందవచ్చు. రైతులు తమ పొలంలోని మట్టిని ప్రతి రెండేళ్లకోసారి పరీక్ష చేయించుకోవాలి. మట్టి నమూనా సేకరించడానికి పొలంలో పంటలేని సమయం అనువైనది. కనుక వేసవిలో పొలంలో 15 సెంటీమీటర్ల లోతు నుంచి మట్టి నమూనాలు సేకరించి సమీపంలోని భూసార పరీక్ష కేంద్రానికి తగిన సమాచారంతో పంపాలి. కొత్తగా పండ్ల తోటలు వేయాలనుకునేవారు తప్పకుండా వివిధ లోతుల నుంచి అంటే సున్నా నుంచి 30 సెంటీమీటర్ల వరకూ, 30 నుంచి 60 సెంటీమీటర్లు, 60 నుంచి 100 సెంటీమీటర్లు చొప్పున మబట్టి నమూనాను సేకరించి పరీక్షకు పంపాలి.

పచ్చిరొట్ట ఎరువులు

పోషక విలువల సమృద్ధిగా, సమతుల్యంగా కలిగిన రసభరిత పచ్చని మొక్కలను, వాటి ఆకులను పచ్చిరొట్ట ఎరువులు అంటారు. పచ్చిరొట్ట పైర్ల పెంపకం, వినియోగం సులభంగా ఉండటమే కాకుండా తక్కువ ఖర్చుతో భూమికి ఎక్కువ లాభం చేకూర్చుతాయి. జనుము, జీలుగ, పెసర, పిల్లిపెసర, అలసంద వంటి పైర్లు పూ మొక్క దశ (50 శాతం పూత దశ) వరకూ పెంచి భూమిలో కలియదున్నాలి. ఇవి తక్కువ సమయంలో అంటే 30-45 రోజుల్లో 50 శాతం పూతకు వస్తుంది. ఎక్కువ రొట్టను కలిగి భూమిలో కలియదున్నిన తరువాత త్వరగా చివికి నేల ఆరోగ్యం పెరగనివ్వదు. పచ్చిరొట్ట ఎరువులైన పిల్లి పెసర, అలసంద వంటి పప్పు జాతి మొక్కలు భూమికి నత్రజనిని అందిస్తాయి. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో వేసవిలో ఈ పంటను వేసుకుంటే పంట సమయం ఆదా అవుతుంది. పంట మార్పిడి ప్రయోజనాలు చేకూరతాయి.

నీటి కుంటలు

ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టి పంట పొలాలకు మళ్ళించడంలో నీటి కుంటలు ఎంతో తోడ్పాటునందిస్తాయి. భూగర్భ జలాలు వాటంతట అవే ఉబికివచ్చి పక్కన ఉన్న బావుల్లోకి సైతం నీరు చేరుతుంది. దీనివల్ల కరువు కాలంలోనూ పంటలు పండించుకోవచ్చు. కనుక రైతులు వారి పొలాల్లో ఈ నీటి కుంటల కోసం ఒకటి నుంచి రెండు గుంటల స్థలం కేటాయిస్తే.. వర్షాభావ పరిస్థితులను తట్టుకొని పంటలు పండించుకోవచ్చు. బావులు, బోర్లలో నీరు అడుగు అంటకుంటా ఉంటుంది.

వేసవిలో రైతులు పై చర్యలు పాటిస్తే.. నేల ఆరోగ్యం కాపాడుతూ, పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ.. ఎరువులు, పురుగు మందులు, కలుపు మందుల వాడకాన్ని తగ్గించుకుంటూ.. నీటి వృథాను అరికడుతూ.. చక్కని పంటలు పండించుకోవచ్చు.



వేసవిలో బెండను ఆశించే ఎర్రనల్లిని నివారించడం ఎలా?

మోటపలుకుల జ్యోతి,
పిహెచ్‌డి స్కాలర్, ఉద్యాన విభాగం
విఎన్ఎం వ్యవసాయ విశ్వవిద్యాలయం, పర్భాని, మహారాష్ట్ర
బందెల సంతోష,
పిహెచ్‌డి స్కాలర్, ఉద్యాన విభాగం
కొండా లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర ఉద్యానవనం విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఏడాది పొడవునా పండించే ముఖ్యమైన కూరగాయాల్లో బెండకాయ ఒకటి. లేతగా ఉన్న బెండకాయలను కర్రీ, సూప్ తయారీలో వినియోగిస్తారు. వీటిలో విటమిన్-ఏ, విటమిన్ -బి, ప్రోటీన్, అయోడీన్, ఖనిజ లవణాలు అధికంగా ఉంటాయి.

కూరగాయల్లో ఎర్రనల్లి పది నుంచి పదిహేను శాతం వరకూ నష్టాన్ని కలుగజేస్తుంది. వేసవిలో బెండను సాగు చేసే రైతులకు ఎర్ర నల్లి సమస్య ప్రధానంగా ఇబ్బంది పెడుతుంది. నల్లి పరిమాణంలో చాలా చిన్నదిగా ఉంటుంది. వివిధ రంగుల్లో ఉంటుంది. ఆకు పచ్చగా, ఆకుపచ్చ పసుపు, గోధుమ, నారింజ, ఎరుపు రంగుల్లో ఉంటూ శరీరంపైన రెండు నల్లని చుక్కలు కలిగి ఉంటుంది.

వీటి గ్రుడ్లు తెల్ల రంగులో గుండ్రని ఆకారాన్ని కలిగి ఉంటాయి. గ్రుడ్డు దశ రెండు నుంచి నాలుగు రోజుల వరకూ ఉంటుంది. గ్రుడ్డు దశ నుంచి లార్వా, నిమ్ఫ్, యవ్వన దశకు చేరతాయి. వీటి జీవితకాలం రెండు నుంచి మూడు వారాలు.

ఎర్రనల్లి ప్రభావం వాటి జాతి, వాతావరణం, మొక్కపైన ఆధారపడి ఉంటుంది. ఉష్ణోగ్రత, సాపేక్ష ఆర్ద్రత ఎర్ర నల్లి ఆశించడానికి ముఖ్య కారణాలు. ఉష్ణోగ్రత పెరగడం, సాపేక్ష ఆర్ద్రత తగ్గడం ఉంటే ఎర్ర నల్లి తీవ్రత అధికమవుతుంది. వీటి తాకిడి ఎక్కువగా వెచ్చని, పొడి సీజన్లో ఉంటుంది. మరీ ముఖ్యంగా మే నుంచి జూన్ నెలల్లో వీటి తీవ్రత అధికంగా ఉంటుంది. ఎర్ర నల్లి సమూహం చాలా వేగంగా వృద్ధి కావడం వల్ల రైతు పంటను క్రమం తప్పకుండా పరిశీలించడం చాలా ముఖ్యం. అనుభవలేమి వల్ల ఎర్రనల్లి సమస్యను గుర్తించడంలో చాలా మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎందుకంటే లక్షణాలు పోషకలోపం లేదా వ్యాధిని పోలి ఉంటాయి.

చిన్న, పెద్ద నల్లి పురుగులు ఆకు ఉదరం పైభాగంలో సిల్క్ వెబ్‌ను రక్షణగా చేసుకొని ఆకుల్లో ఉండే రసం పీల్చుకుంటాయి. దానివల్ల ఆకు వెనుక భాగంలో అనేక పసుపు మచ్చలు కనిపిస్తాయి. పత్రహరితం కోల్పోతుంది. మొక్కలో ఎదుగుదల ఉండదు. ఆకులు ముడుచుకుపోయి నలిగిపోతాయి. తీవ్రత ఎక్కువయినప్పుడు పైన ఆకులు కూడా ఉన్నట్లు కనిపిస్తుంది. ఎర్రనల్లి మొక్కల ఎందుగుదల దశ, పుష్పించే దశ, పంట కోత దశలను ఆశిస్తుంది. అందువల్ల పంట దిగుబడి తగ్గిపోతుంది.

ఎర్రనల్లిని నివారించడం ఎలా?

- పంట అవశేషాలు, కలుపు మొక్కలు, ఇతర ప్రత్యామ్నాయ మొక్కలను నాశనం చేయాలి
- వేసవిలో లోతుగా దున్నాలి
- పంట మార్పిడి పద్ధతిని చేపట్టాలి
- మాల్వేసి కుటుంబ పంటలను వరుసగా పెంచకుండా ఉండాలి
- వెట్టబుల్ సల్ఫర్ 80 డబ్ల్యుపి రెండు గ్రాములు / లీటరు లేదా డైకోఫోల్ 18.5ఇసి 2.5.మిల్లీలీటరు / లీటరు లేదా అబామెక్టిన్ 1.9 ఏసీ500 మిల్లీలీటర్లు లేదా అకారిసైడ్ 30 ఏసీ 250-340 మిల్లీ లీటర్లు 500 మిల్లీ లీటర్ల నీటిలో ఒక హెక్టారుకు పిచికారీ చేసుకోవాలి.
- అకారిసైడ్‌కు ప్రత్యామ్నాయంగా వేపనూనె లేదా వేప సబ్బు లేదా పొంగమియా సబ్బు ఒక శాతం పిచికారీ చేయాలి. ✷

కర్భుజాలో సరికొత్త వంగడాల సాగు

సభావత్ రాజు నాయక్,
పి. హెచ్.డి. వ్యవసాయ విభాగం,
మోటపలుకుల జ్యోతి,
పి. హెచ్.డి. ఉద్యాన విభాగం,
డాక్టర్ సి.భరద్వాజ్,
ప్రధాన శాస్త్రవేత్త జన్యు శాస్త్ర విభాగం
వసంత్రావ్ నాయక్ మరత్వాడ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పర్భాని, మహారాష్ట్ర.

వేసవిలో విరివిగా దొరికే పండు కర్బుజా. నీటి శాతం ఎక్కువగా ఉండడం వల్ల వేసవితాపం నుండి తప్పించుకోవడానికి ఈ పండు బాగా ఉపయోగపడుతుంది. అలాగే 'విటమిన్ – సి', 'విటమిన్ – ఎ'లతో పాటు వివిధ రకాలైన పోషకాలు ఎక్కువగా ఉండడంతో ఈ పండు రోగ నిరోధక శక్తిని పెంపొందించడంతోపాటు స్థూల కాయత్వాన్ని అదుపు చేయడంలో ఉపయోగపడుతుంది. మన తెలుగు రాష్ట్రాల్లో సుమారుగా పదిహేను వేల ఎకరాలలో సాగుచేయబడుతూ ఎకరానికి సరాసరి 65 క్వింటాల్ల దిగుబడిని రైతులకు అందిస్తోంది. ఎక్కువ దిగుబడులని ఇచ్చే వంగడాలనే ఎంచుకోవడం రైతులకి లాభదాయకంగా ఉంటుంది. అందుచేత ఇప్పుడు కర్బుజా పంటలో నాణ్యమైన ఎక్కువ దిగుబడిని ఇచ్చే సరికొత్త వంగడాలను ఐఏఆర్ఐ సంస్థ రైతు సోదరుల ముందుకు తీసుకువచ్చింది.

పూస మధురస్

గుజ్జు పసుపు రంగును కలిగి ఉంటుంది. మహా తీపి రకం. నెట్టెడ్ తోలు ఉండడం చేత దూర ప్రాంతాలకు సరఫరా చేయవచ్చు. వంద రోజుల లోపు పంట వస్తుంది. బూడిద తెగుళ్లను, ఎండు తెగుళ్లను తట్టుకుంటుంది. ప్రతి హెక్టారుకు 150 నుంచి 200 క్వింటాళ్ల దిగుబడిని ఇస్తుంది.

పూసా మధురిమ

ఇది మంచి దిగుబడిని ఇచ్చే కర్బూజ జాతి రకం. గుజ్జు కొంచెం ఆరంజ్ పసుపు రంగును కలిగి ఉంటుంది. 11 నుంచి 12 శాతం టీయస్ఎస్‌ని కలిగి ఉంటుంది. మందమైన గుజ్జును కలిగి ఉండడం వల్ల.. ప్రాసెస్సింగ్ ఇండస్ట్రీ వారు ఇష్టపడుతున్నారు. తీపి రకం. దూర మార్కెట్ సరఫరాకు అనుకూలం. మంచి సువాసనను కలిగి ఉంటుంది. అందువల్ల జ్యూస్ ఇండస్ట్రీ వారు బాగా ఇష్టపడుతున్నారు. ప్రతి హెక్టారుకు 22 టన్నుల దిగుబడిని ఇస్తుంది. 100 రోజుల లోపు పంట వస్తుంది.

కర్బుజాను గ్రీన్ హౌస్‌లో పాలీహౌస్‌లలో పెంచుతున్నారు. భూమి పైన పెంచే విధానంలో తీగలు నేల పైన పాకుతాయి. అప్పుడు కాయలు తీగ నుంచి విడిపోయినా రైతుకు పెద్దగా నష్టం ఉండదు. ఎప్పుడైతే కర్బుజాను గ్రీన్ హౌస్ లో లేదా పాలీహౌస్‌లో ట్రయలింగ్ విధానంలో నిటారుగా నిలువుగా పెంచినపుడు.. కాయలు తీగ నుంచి జారిపడితే పగిలి రైతుకు నష్టం జరుగుతుంది. ఈ సమస్యను తట్టుకునే విధంగా గ్రీన్ హౌస్‌లో పెంచుకోవడానికి ఐఏఆర్ వారు రెండో రకాన్ని తీసుకువచ్చారు.

పూసా సర్ద

ఇది కర్బుజా జాతి. కాయ పూర్తిగా పసుపు రంగును కలిగి వుంటుంది. గుజ్జు పసుపు రంగులో ఉంటుంది. రసం పీల్చే పురుగుల నుంచి తట్టుకుంటుంది. బూడిద తెగుళ్లను, కాండం కుళ్ళు తెగుళ్లను తట్టుకుంటుంది. కాయ పండిన తరువాత కూడా కిందకి రాలదు.

పూస సునె హరి

ఇది కూడా కర్బుజా జాతి హైబ్రిడ్. పాలీహౌస్‌లో అనుకూలం. కాయలు రాలవు. గుజ్జు ఆరంజ్ రంగులో ఉంటుంది. మంచి సువాసనను కలిగి ఉంటుంది. మంచి దిగుబడిని ఇస్తుంది. దూరపు ప్రాంతాలకు తరలించడానికి అనుకూలంగా ఉంటుంది. *

కూరగాయల్లో రసాయన అవశేషాలు నష్టాలు - పరిష్కారాలు

జి. క్రాంతిరేఖ, అసిస్టెంట్ ప్రొఫెసర్,
డి. శ్రీకాంత్, పి. హెచ్.డి. స్కాలర్,
ఎల్. నారమ్ నాయుడు, ప్రొఫెసర్
డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం
వెంకటరామన్నగూడెం

పురుగులు, తెగుళ్లు, కలుపు నివారణ మందులు విచక్షణా రహితంగా పంటలపై వాడటం వల్ల వాటి అవశేషాలు కొన్ని సంవత్సరాల వరకూ విచ్ఛిన్నం కాకుండా ఉంటాయి. మనం తినే వ్యవసాయ ఉత్పత్తుల్లో వీటి అవశేషాలు ఉండటం వల్ల ప్రతిరోజూ కొంత సూక్ష్మ మొత్తాల్లో మన శరీరంలో ప్రవేశిస్తాయి. అంతేగాక.. పర్యావరణంలోని అన్ని కణాల ప్రాణులపై కూడా ఈ అవశేషాలు రక్తంలో, పదార్థాలతో పేరుకుపోతాయి. అందువల్ల అనేక రకాల దీర్ఘకాలిక రుగ్మతలను కలుగచేస్తాయని పరిశోధనల్లో తేలింది. ముఖ్యంగా క్యాన్సర్, శిశుమరణాలు, గుండెజబ్బులు, అంగవైకల్యం వంటి విష ప్రభావాలు ప్రపంచ వ్యాప్తంగా వెలుగులోకి వచ్చాయి.

ప్రపంచ వాణిజ్యీకరణ నేపథ్యంలో ముఖ్యంగా మన దేశం నుంచి జరుగుతున్న ఎగుమతుల్లో సస్యరక్షణ మందుల అవశేషాలు పరిమితికి మించి ఉండటం వల్ల కొన్ని రకాల ముఖ్య ఎగుమతులు తిరస్కరించబడినాయి.

ఈ అవశేషాలు గరిష్ట పరిమితులను వివిధ రకాల పంటలపై సిఫారసు చేసిన సస్యరక్షణ మందులను ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ వ్యవసాయ, ఆహార సంస్థలతో సంయుక్తంగా నిర్వహిస్తున్న కోడెక్స్ కమిషన్ నిర్ధారిస్తాయి.

మనదేశంలో ఆరోగ్య మంత్రిత్వశాఖవారు అవశేషాల గరిష్ట పరిమితులను వివిధ వ్యవసాయ ఉత్పత్తుల గరిష్ట పరిమితులను వివిధ వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార పదార్థాలపై నిర్ధారిస్తారు. అంటే.. సస్యరక్షణ మందు ఏ విధంగా సాధారణ వ్యక్తి జీవిత కాలంలో వివిధ రకాల ఆహార పదార్థాల ద్వారా లేదా నీటి ద్వారా సేవించినప్పుడు వాటి శాతం గరిష్ట పరిమితికి మించనప్పుడు అవి ఆరోగ్యానికి ఏ విధంగానూ హానికరం కాదు.

కూరగాయల్లో కొవ్వు పదార్థాలు తక్కువగా ఉండి, విటమిన్లు, ప్రోటీన్లు, మినరల్స్ ఎక్కువగా ఉంటే మనకు మంచి ఆరోగ్యం, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతాయి.

ప్రస్తుత కరోనా వైరస్ నేపథ్యంలో మనం కూరగాయలు, పండ్లు ఎక్కువగా తింటున్నాం.

నష్టాలు

- వీటివల్ల మన డిఎన్ఏలో మార్పు జరిగి క్యాన్సర్ వంటి రోగాలు ఎక్కువగా వస్తాయి. అంతేకాదు శ్వాస సంబంధ వ్యాధులు, మెదడు, చర్మ సంబంధ, పార్కిన్‌సన్ జబ్బులు వచ్చే అవకాశాలున్నాయి.
- శిశువు మొదలు పదిహేనేళ్ల పిల్లల్లో పురుగుమందుల అవశేషాలు మూత్రంలో కూడా చాలా త్వరగా పెరుగుతున్నాయని పరిశోధనలో తేలింది.
- పని పిల్లలు, ఎదిగే పిల్లలు, గర్భవతిగా ఉన్న మహిళలు, పాలిచ్చే తల్లులకు ఈ అవశేషాలు చాలా ప్రమాదకరం.

❖ ఈ మధ్య ఏలూరులో ఏం జరిగిందో మనందరికీ తెలుసు. భార లోహాలు, లెడ్, నికెల్ వంటివి శరీరంలో ఉన్నందువల్ల తీవ్ర అస్వస్థతకు గురైనట్లు బాధితులను పరిశీలించడం ద్వారా తెలిసింది.

❖ మురుగు ద్వారా కూరగాయలను పెంచడం వల్ల ఇలా జరిగి ఉండొచ్చనే అభిప్రాయముంది.

❖ కాలపరిమితి ముగిసిన, నాణ్యతలేని పురుగుమందులు, డిడిటి, లిండేన్ చాలా సంవత్సరాల వరకూ నేలలో, నీటిలో విచ్ఛినం కాకుండా ఉంటుంది.

రైతులు చేయాల్సిన పనులు

❖ 2050 నాటికి ఇప్పుడున్న జనాభా కన్నా 30 శాతం ఎక్కువ పెరిగే అవకాశం ఉంది. అందరికీ మంచి ఆహారాన్ని అందించాలంటే ఎక్కువ ఆహారాన్ని ఉత్పత్తి చేయాలి. దానికి పురుగులు, తెగుళ్ల నుంచి పంటను కాపాడాలి.

❖ ఇందుకోసం పురుగుమందులు ఎక్కువగా వాడాల్సిన అవసరమొస్తుంది.

❖ కానీ ప్రజల ఆరోగ్యం చాలా ముఖ్యం. కనుక రైతులు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వాటిని కొంతవరకూ అరికట్టడానికి అవకాశం ఉంటుంది.

జాగ్రత్తలు

❖ భారత ప్రభుత్వ పురుగు మందుల చట్టం ప్రకారం కొన్ని మందుల వాడకాన్ని.. ఉదాహరణకు ఎండో సల్ఫాన్, మోనో క్రోటోఫాస్, క్వినాల్ ఫాస్ మొదలైన మందుల వాడకాన్ని పూర్తిగా నిషేధించింది.

❖ ఇలా నిషేధించిన మందులను రైతులు వాడటం మానేయాలి.

❖ ఎరుపురంగు త్రిభుజం ఉన్న సస్యరక్షణ మందులను సిఫారసు చేసిన పంటలపై మాత్రమే పిచికారీ చేయాలి.

❖ నిర్ధారించిన మోతాదులో, నిర్ణీత సమయంలో సరైన స్ప్రేయర్ (త్రైవాన్)ను వాడి పిచికారీ చేయాలి.

❖ ఒక వేళ పిచికారీ చేసినట్లయితే.. పిచికారీ చేసిన మందును బట్టి.. కూరగాయ పంటలను బట్టి.. ఏడు నుంచి పద్నాలుగు రోజుల వరకూ వేచి ఉండి కోతలను కోయాల్సి ఉంది.

❖ ఉదాహరణకు కార్బరిల్ బెండల్ అయితే ఎనిమిది రోజులు వేచి చూస్తే సరిపోతుంది.

❖ ఫెనవలరేట్ కాలిఫ్లవర్‌లో ఏడు రోజులు

❖ ఇమిడాక్లోప్రిడ్ మిరపలో 40 రోజులు

❖ మిథియోల్ టమాటాలో ఐదారు రోజులు

❖ సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించి సిఫారసు చేసిన సస్యరక్షణ మందులను అవసరాన్నిబట్టి మాత్రమే వాడాలి.

❖ సాధ్యమైనంతవరకూ తక్కువ కాలంలో విష ప్రభావం కోల్పోయే కొత్త రకాల సస్యరక్షణ మందులనే వాడాలి.

❖ జీవన ఎరువులు, జీవ రసాయనాలు, జీవ నియంత్రణ పద్ధతులు వంటి సేంద్రియ పద్ధతులు పాటించడం వల్ల ఈ విష ప్రభావాల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు.

సమగ్ర సస్యరక్షణ

ఇప్పుడు మనం ఒక పంటను పండించాలి అంటే మొదటిగా ఎరువుల యాజమాన్యం పాటించాలి. 1. ఎరువుల యాజమాన్యం, 2. తెగుళ్ల నివారణ, 3. పురుగుల నివారణ

1. ఎరువుల యాజమాన్యం : రైతులు సాధారణంగా రసాయన ఎరువులయిన యూరియా, పొటాష్‌లను ఎక్కువగా వాడుతున్నారు.

❖ వాటి మోతాదు తగ్గించి సేంద్రియ ఎరువులైన పశువుల పేడ, వానపాముల ఎరువులు, కోళ్ల ఎరువులు, మేకల పేడ ఎక్కువగా వాడొచ్చు.

❖ పచ్చిరొట్ట ఎరువులైన జనుము, పిల్లిపెసర, గానుగ, జీలుగ వంటి వాటిని విత్తడానికి నెల రోజుల ముందు చల్లి పూత దశలో నేలలో కలియ దున్నడం వల్ల, నేలలో సేంద్రియ కర్బనం పెరిగి.. మొక్క దృఢంగా పెరుగుతుంది.

జీవన ఎరువులు : అంటే భూమిలో నానాటికీ తగ్గు ముఖం పడుతున్న సూక్ష్మాంగ జీవుల్లో మొక్కలకు పోషక పదార్థాలకు, పెరుగుదలకూ ఉపయోగపడే పదార్థాలను సమకూర్చే సూక్ష్మజీవుల సముదాయం.

❖ ఈ సూక్ష్మ జీవులు పంటకు కావలసిన పోషక పదార్థాలను ప్రకృతిలోని సహజ వనరుల నుంచి అందించే గుణాన్ని కలిగి ఉంటుంది.

❖ జీవన ఎరువులు భూమిలో వేసినప్పుడు వాటిలో ఉన్న సూక్ష్మ జీవుల సంఖ్య అనూహ్యంగా పెరిగి మొక్కలు చురుకుగా పెరగడానికి, వివిధ పోషకాలతోపాటు అవసరమైన హార్మోన్లను, విటమిన్లను అందిస్తాయి. అవి సహజసిద్ధమైనవి. వాటి వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడదు. వీటి వాడకం ద్వారా రసాయన ఎరువుల మోతాదు కొంతమేర తగ్గుతుంది. ఉదాహరణకు రైబోజియం, అజట్ బ్యాక్టర్, అజోస్పైరిల్లమ్, అసిటోబాక్టర్ మందులు.

కలుపు నివారణ : కలుపు మందులపైనే పూర్తిగా ఆధారపడకుండా.. సమగ్ర పద్ధతిలో రెండుసార్లు కూలీలతో తీయించాలి. కలుపుతీసే మిషన్లనూ వాడొచ్చు. మల్చింగ్ షీటును కూడా వాడి కలుపు నివారించుకోవచ్చు.

❖ కూరగాయల్లో మల్చింగ్ షీటు వాడినందువల్ల కలుపు పెరగదు. కూరగాయలు కూడా నాణ్యంగా పెరుగుతాయి. దిగుబడి కూడా పెరుగుతుంది.

2. సస్యరక్షణలో తెగుళ్లు : నేల ద్వారా వచ్చే తెగుళ్లకు జీవ సిలీంద్రాలైన ట్రికోడెర్మా, సూడోమోనాస్, వీసిలోమైసిన్ రెండు కిలోల చొప్పున ఒక టన్ను పశువుల పేడ కొని, వేప చెక్కగానీ, వానపాములు ఎరువుకు బాగా కలిపి పది రోజులు నీడలో నానబెట్టి, తడి ఇచ్చి, తరువాత మొక్కల మొదళ్లలో మనకు చాలా వరకూ వేరు కుళ్లు, తెగుళ్లు రాకుండా నివారించుకోవచ్చు.

- పైపాటుగా కూడా పురుగు మందులను తగ్గించి జీవన శిలీంద్రాలను పిచికారీ చేసుకుంటే చాలా వరకూ వీటిని తగ్గించొచ్చు.

3. పురుగుల నివారణ : చిక్కుడు జాతి పంటల్లో పంట మార్పిడి చేసుకోవాలి.

- విత్తన శుద్ధి చేయాలి. ఒక కిలో విత్తనానికి మూడు గ్రాముల ధిరం, ఆ తర్వాత 8 గ్రాముల ట్రికోడెర్మా కల్చర్‌తో విత్తనశుద్ధి చేయాలి.
- వేసవిలో దుక్కులు లోతుగా చేయాలి
- పొలం చుట్టూ జొన్న లేదా సజ్జ పంటను అడ్డు పంటగా వేయడం వల్ల రసం పీల్చే పురుగులు ఉధృతి తగ్గి టొమాటాలో వైరస్ తెగులు కొంత వరకూ తగ్గుతుంది.
- ఎర పంటగా బంతి, ఆముదం పంటలను వేయాలి.
- పొలంలో అక్కడక్కడా ఎకరానికి నాలుగు చొప్పున పసుపు, నీలిరంగు జిగురు అట్టలను ఉంచడం వల్ల తెల్లదోమ, తామర పురుగుల ఉధృతి తగ్గుతుంది.
- శనగపచ్చ పురుగుకు, రబ్బరు పురుగుకు లింగాకర్షణ బుట్టలను వాడాలి.
- ఎకరానికి 20 చొప్పున పక్షి స్థావారాలను ఏర్పాటు చేయాలి.
- నాటిన 30 రోజుల నుంచి పూత వరకూ ఐదు శాతం వేప గింజల కషాయాన్ని 15 రోజుల తేడాతో పిచికారీ చేయాలి.
- బాక్టీరియా తెగులు నివారణకు నాటే ముందు నారును 100 పిపిఎం (1000 ఎంజి/లిబర్ హెచ్2ఓ) స్ట్రెప్టోసైక్లిన్ ద్రావణంలో ముంచి నాటాలి
- అవసరాన్ని బట్టి పురుగు, తెగుళ్ల మందును తగిన మోతాదులో పిచికారీ చేయాలి
- అంతేగాక.. కొత్తగా అనేక రకాల మందులు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి
- వాటి వాడకం కూడా విస్తృతంగా ముఖ్యంగా కూరగాయల్లో అధికంగా ఉంటుంది
- భారత ప్రభుత్వం ద్వారా కొన్ని పురుగు మందులు కొన్ని పంటలకు మాత్రమే వాడటానికి అనుమతిచ్చినప్పటికీ .. ఇతర సిఫార్సు చేసుకునే పంటలపై కూడా వాడటం జరుగుతున్నది.
- అయితే మన ఆహార ఉత్పత్తులను ఎగుమతి చేయాలంటే, దిగుమతి చేసుకునే దేశం వారు నిర్ధారించిన నాణ్యతా ప్రమాణాలతోపాటు, ముఖ్యంగా సస్యరక్షణ మందుల అవశేషాలు కూడా పరిమితికి మించి ఉండకూడదు.
- ఉదాహరణకు... గత ఐదారేళ్లుగా మన దేశం నుంచి ఎగుమతి అయిన మిర్చి, తేనె, ద్రాక్ష, వరి, కరివేపాకు వివిధ దేశాలవారు ముఖ్యంగా ఐరోపా, దుబాయి దేశాల వారు వాటిలో అవశేషాలున్నాయని తిరస్కరించారు. అందువల్ల సస్యరక్షణ మందుల అవశేషాలు మన వ్యవసాయ ఉత్పత్తిలో లేకుండా ఉండాలంటే ఇప్పుడు చెప్పిన జాగ్రత్తలన్నీ పాటించక తప్పదు మరి.

వినియోగదారులు చేయాల్సిన పనులు

- గృహంలో వినియోగించే కూరగాయలను, పండ్లను రెండు శాతం ఉప్పు ద్రావణంలో 20 నిమిషాలుంచి కడిగితే అవశేషాలు చాలా వరకూ తీసివేయబడతాయి.
- కూరగాయలను ఉప్పు నీటి ద్రావణంలో శుభ్రపరిచి ప్రెషర్ కుక్కర్‌తో ఉడికించితే కొన్ని అవశేషాలు పూర్తిగా తొలగించడానికి ఆస్కారం ఉంటుంది.
- వెనిగర్ (ఎసిటిక్ ఆసిడ్) ద్రావణంలో క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటివి ఉంచి తరువాత కడిగితే.. పురుగు మందుల అవశేషాలు తగ్గుతాయి.
- ఉదాహరణకు టొమాటోలో కార్బరిల్ మందు అవశేషాలను రెండు శాతం ఉప్పు ద్రావణంలో కడిగిన తరువాత 15 నిమిషాలు ఉడికించడం వల్ల 10 నుంచి 75 శాతం తగ్గించుకోవచ్చు. రెండు శాతం ఉప్పు ద్రావణంలో కడగటం వల్ల 27.4 శాతాన్ని, నీటిలో కడగడం వల్ల 128 శాతాన్ని తగ్గించుకోవచ్చు.
- ఫెనలవకేట్ మందు రెండు శాతం చింతపండు ద్రావణంలో కడగడం వల్ల 46.7 శాతం, ఫాస్పరస్ మందు రెండు శాతం ఉప్పు ద్రావణంలో కడిగిన తరువాత 15 నిమిషాలు ఉడికించడం వల్ల 63 శాతం, అలాగే క్వినాల్ పాస్, క్లోరిపైరిపాస్ మందులు క్యాబేజీ గడ్డపై ముందు ఆకులను తీసివేయడం వల్ల నూరు శాతం అవశేషాలను తగ్గించుకోవచ్చు.
- సేంద్రియ పద్ధతిలో పెరటిలో కూరగాయలను పెంచడం మంచి పద్ధతి
- ఇప్పుడు నగరాల్లో ఉండేవారికి ఇంటి ముందు స్థలం ఉండదు. కాబట్టి టెర్రస్‌లోగానీ, బాల్కనీలోగానీ, కుండీల్లోగానీ సేంద్రియ పద్ధతిలో కూరగాయలను పెంచుకోవచ్చు.
- ఇలా పెంచడం వల్ల శరీరానికి వ్యాయామం అవుతుంది. మనం పండించిన పంటను తిన్నామనే సంతృప్తి కూడా మిగులుతుంది.
- ఇలా చేయడం వల్ల మన కుటుంబానికీ, మనం ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించిన వాళ్లమవుతాము. వీటివల్ల మన డిఎన్ఏలో మార్పు జరిగి క్యాన్సర్ వంటి రోగాలు ఎక్కువగా వస్తాయి. అంతేకాదు శ్వాస సంబంధ వ్యాధులు, మెదడు, చర్మ సంబంధ, పార్కిన్సన్ జబ్బులు వచ్చే అవకాశాలున్నాయి.
- శిశువు మొదలు పదిహేనేళ్ల పిల్లల్లో పురుగుమందుల అవశేషాలు మూత్రంలో కూడా చాలా త్వరగా పెరుగుతున్నాయని పరిశోధనలో తేలింది.
- పని పిల్లలు, ఎదిగే పిల్లలు, గర్భవతిగా ఉన్న మహిళలు, పాలిచ్చే తల్లులకు ఈ అవశేషాలు చాలా ప్రమాదకరం.
- ఈ మధ్య ఏలూరులో ఏం జరిగిందో మనందరికీ తెలుసు. భార లోహాలు, లెడ్, నికెల్ వంటివి శరీరంలో ఉన్నందువల్ల తీవ్ర

అస్వస్థతకు గురైనట్లు బాధితులను పరిశీలించడం ద్వారా తెలిసింది.

- మురుగు ద్వారా కూరగాయలను పెంచడం వల్ల ఇలా జరిగి ఉండొచ్చనే అభిప్రాయముంది.
- కాలపరిమితి ముగిసిన, నాణ్యతలేని పురుగుమందులు, డిడిటి, లిండేన్ చాలా సంవత్సరాల వరకూ నేలలో, నీటిలో విచ్ఛినం కాకుండా ఉంటుంది.

రైతులు చేయాల్సిన పనులు

- 2050 నాటికి ఇప్పుడున్న జనాభా కన్నా 30 శాతం ఎక్కువ పెరిగే అవకాశం ఉంది. అందరికీ మంచి ఆహారాన్ని అందించాలంటే ఎక్కువ ఆహారాన్ని ఉత్పత్తి చేయాలి. దానికి పురుగులు, తెగుళ్ల నుంచి పంటను కాపాడాలి.
- ఇందుకోసం పురుగుమందులు ఎక్కువగా వాడాల్సిన అవసరమొస్తుంది.
- కానీ ప్రజల ఆరోగ్యం చాలా ముఖ్యం. కనుక రైతులు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వాటిని కొంతవరకూ అరికట్టడానికి అవకాశం ఉంటుంది.

జాగ్రత్తలు

- భారత ప్రభుత్వ పురుగు మందుల చట్టం ప్రకారం కొన్ని మందుల వాడకాన్ని.. ఉదాహరణకు ఎండో సల్ఫాన్, మోనో క్రోటోఫాస్, క్వినాల్ ఫాస్ మొదలైన మందుల వాడకాన్ని పూర్తిగా నిషేధించింది.
- ఇలా నిషేధించిన మందులను రైతులు వాడటం మానేయాలి.
- ఎరుపురంగు త్రిభుజం ఉన్న సస్యరక్షణ మందులను సిఫారసు చేసిన పంటలపై మాత్రమే పిచికారీ చేయాలి.
- నిర్ధారించిన మోతాదులో, నిర్ణీత సమయంలో సరైన స్ప్రేయర్ (తైవాన్)ను వాడి పిచికారీ చేయాలి.
- ఒక వేళ పిచికారీ చేసినట్లయితే.. పిచికారీ చేసిన మందును బట్టి.. కూరగాయ పంటలను బట్టి.. ఏడు నుంచి పధ్నాలుగు రోజుల వరకూ వేచి ఉండి కోతలను కోయాల్సి ఉంది.
- ఉదాహరణకు కార్బరిల్ బెండల్ అయితే ఎనిమిది రోజులు వేచి చూస్తే సరిపోతుంది.
- ఫెనవలరేట్ కాలిఫ్లవర్‌లో ఏడు రోజులు
- ఇమిడాక్లోప్రిడ్ మిరపలో 40 రోజులు
- మిథియోల్ టమాటాలో ఐదారు రోజులు
- సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించి సిఫారసు చేసిన సస్యరక్షణ మందులను అవసరాన్నిబట్టి మాత్రమే వాడాలి.
- సాధ్యమైనంతవరకూ తక్కువ కాలంలో విష ప్రభావం కోల్పోయే కొత్త రకాల సస్యరక్షణ మందులనే వాడాలి.
- జీవన ఎరువులు, జీవ రసాయనాలు, జీవ నియంత్రణ పద్ధతులు వంటి సేంద్రియ పద్ధతులు పాటించడం వల్ల ఈ విష ప్రభావాల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు.

సమగ్ర సస్యరక్షణ

ఇప్పుడు మనం ఒక పంటను పండించాలి అంటే మొదటిగా ఎరువుల యాజమాన్యం పాటించాలి. 1. ఎరువుల యాజమాన్యం,

2. తెగుళ్ల నివారణ, 3. పురుగుల నివారణ

1. ఎరువుల యాజమాన్యం : రైతులు సాధారణంగా రసాయన ఎరువులయిన యూరియా, పొటాష్‌లను ఎక్కువగా వాడుతున్నారు.

- వాటి మోతాదు తగ్గించి సేంద్రియ ఎరువులైన పుశువుల పేడ, వానపాముల ఎరువులు, కోళ్ల ఎరువులు, మేకల పేడ ఎక్కువగా వాడొచ్చు.
- పచ్చిరొట్ట ఎరువులైన జనుము, పిల్లిపెసర, గానుగ, జీలుగ వంటి వాటిని విత్తడానికి నెల రోజుల ముందు చల్లి పూత దశలో నేలలో కలియ దున్నడం వల్ల, నేలలో సేంద్రియ కర్బనం పెరిగి.. మొక్క దృఢంగా పెరుగుతుంది.

జీవన ఎరువులు : అంటే భూమిలో నానాటికీ తగ్గు ముఖం పడుతున్న సూక్ష్మంగ జీవుల్లో మొక్కలకు పోషక పదార్థాలకు, పెరుగుదలకూ ఉపయోగపడే పదార్థాలను సమకూర్చే సూక్ష్మజీవుల సముదాయం.

- ఈ సూక్ష్మ జీవులు పంటకు కావలసిన పోషక పదార్థాలను ప్రకృతిలోని సహజ వనరుల నుంచి అందించే గుణాన్ని కలిగి ఉంటుంది.
- జీవన ఎరువులు భూమిలో వేసినప్పుడు వాటిలో ఉన్న సూక్ష్మ జీవుల సంఖ్య అనూహ్యంగా పెరిగి మొక్కలు చురుకుగా పెరగడానికి, వివిధ పోషకాలతోపాటు అవసరమైన హార్మోన్లను, విటమిన్లను అందిస్తాయి. అవి సహజసిద్ధమైనవి. వాటి వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడదు. వీటి వాడకం ద్వారా రసాయన ఎరువుల మోతాదు కొంతమేర తగ్గుతుంది. ఉదాహరణకు రైబోజియం, అజటో బ్యాక్టర్, అజోస్పైరిల్లమ్, అసిటోబాక్టర్ మందులు.

కలుపు నివారణ : కలుపు మందులపైనే పూర్తిగా ఆధారపడకుండా.. సమగ్ర పద్ధతిలో రెండుసార్లు కూలీలతో తీయించాలి. కలుపుతీసే మిషన్లనూ వాడొచ్చు. మల్చింగ్ షీటును కూడా వాడి కలుపు నివారించుకోవచ్చు.

- కూరగాయల్లో మల్చింగ్ షీటు వాడినందువల్ల కలుపు పెరగదు. కూరగాయలు కూడా నాణ్యంగా పెరుగుతాయి. దిగుబడి కూడా పెరుగుతుంది.

2. సస్యరక్షణలో తెగుళ్లు : నేల ద్వారా వచ్చే తెగుళ్లకు జీవ సిలీంద్రాలైన ట్రికోడెర్మా, సూడోమోనాస్, వీసిలోమైసిన్ రెండు కిలోల చొప్పున ఒక

టన్ను పశువుల పేడ కొని, వేప చెక్కగానీ, వానపాములు ఎరువుకు బాగా కలిపి పది రోజులు నీడలో నానబెట్టి, తడి ఇచ్చి, తరువాత మొక్కల మొదళ్లలో మనకు చాలా వరకూ వేరు కుళ్లు, తెగుళ్లు రాకుండా నివారించుకోవచ్చు.

- ❖ పైపాటుగా కూడా పురుగు మందులను తగ్గించి జీవన శిలీంద్రాలను పిచికారీ చేసుకుంటే చాలా వరకూ వీటిని తగ్గించొచ్చు.

3. పురుగుల నివారణ : చిక్కుడు జాతి పంటల్లో పంట మార్పిడి చేసుకోవాలి.

- ❖ విత్తన శుద్ధి చేయాలి. ఒక కిలో విత్తనానికి మూడు గ్రాముల థిరం, ఆ తర్వాత 8 గ్రాముల ట్రికోడెర్మా కల్చర్‌తో విత్తనశుద్ధి చేయాలి.
- ❖ వేసవిలో దుక్కులు లోతుగా చేయాలి
- ❖ పొలం చుట్టూ జొన్న లేదా సజ్జ పంటను అడ్డు పంటగా వేయడం వల్ల రసం పీల్చే పురుగులు ఉధృతి తగ్గి టొమాటాలో వైరస్ తెగులు కొంత వరకూ తగ్గుతుంది.
- ❖ ఎర పంటగా బంతి, ఆముదం పంటలను వేయాలి.
- ❖ పొలంలో అక్కడక్కడా ఎకరానికి నాలుగు చొప్పున పసుపు, నీలిరంగు జిగురు అట్టలను ఉంచడం వల్ల తెల్లదోమ, తామర పురుగుల ఉధృతి తగ్గుతుంది.
- ❖ శనగపచ్చ పురుగుకు, రబ్బరు పురుగుకు లింగాకర్షణ బుట్టలను వాడాలి.
- ❖ ఎకరానికి 20 చొప్పున పక్షి స్థావారాలను ఏర్పాటు చేయాలి.
- ❖ నాటిన 30 రోజుల నుంచి పూత వరకూ ఐదు శాతం వేప గింజల కషాయాన్ని 15 రోజుల తేడాతో పిచికారీ చేయాలి.
- ❖ బాక్టీరియా తెగులు నివారణకు నాటే ముందు నారును 100 పిపిఎం (1000 ఎంజి/లిబర్ హెచ్2ఓ) స్ట్రెప్టోసైక్లిన్ ద్రావణంలో ముంచి నాటాలి
- ❖ అవసరాన్ని బట్టి పురుగు, తెగుళ్ల మందును తగిన మోతాదులో పిచికారీ చేయాలి
- ❖ అంతేగాక.. కొత్తగా అనేక రకాల మందులు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి
- ❖ వాటి వాడకం కూడా విస్తృతంగా ముఖ్యంగా కూరగాయల్లో అధికంగా ఉంటుంది
- ❖ భారత ప్రభుత్వం ద్వారా కొన్ని పురుగు మందులు కొన్ని పంటలకు మాత్రమే వాడటానికి అనుమతిచ్చినప్పటికీ .. ఇతర సిఫార్సు చేసుకునే పంటలపై కూడా వాడటం జరుగుతున్నది.
- ❖ అయితే మన ఆహార ఉత్పత్తులను ఎగుమతి చేయాలంటే, దిగుమతి చేసుకునే దేశం వారు నిర్ధారించిన నాణ్యతా ప్రమాణాలతోపాటు, ముఖ్యంగా సస్యరక్షణ మందుల అవశేషాలు కూడా పరిమితికి మించి ఉండకూడదు.
- ❖ ఉదాహరణకు... గత ఐదారేళ్లుగా మన దేశం నుంచి ఎగుమతి అయిన మిర్చి, తేనె, ద్రాక్ష, వరి, కరివేపాకు వివిధ దేశాలవారు ముఖ్యంగా ఐరోపా, దుబాయి దేశాల వారు వాటిలో అవశేషాలున్నాయని తిరస్కరించారు. అందువల్ల సస్యరక్షణ మందుల అవశేషాలు మన వ్యవసాయ ఉత్పత్తిలో లేకుండా ఉండాలంటే ఇప్పుడు చెప్పిన జాగ్రత్తలన్నీ పాటించక తప్పదు మరి.

వినియోగదారులు చేయాల్సిన పనులు

- ❖ గృహంలో వినియోగించే కూరగాయలను, పండ్లను రెండు శాతం ఉప్పు ద్రావణంలో 20 నిమిషాలుంచి కడిగితే అవశేషాలు చాలా వరకూ తీసివేయబడతాయి.
- ❖ కూరగాయలను ఉప్పు నీటి ద్రావణంలో శుభ్రపరిచి ప్రెషర్ కుక్కర్‌తో ఉడికించితే కొన్ని అవశేషాలు పూర్తిగా తొలగించడానికి ఆస్కారం ఉంటుంది.
- ❖ వెనిగర్ (ఎసిటిక్ ఆసిడ్) ద్రావణంలో క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటివి ఉంచి తరువాత కడిగితే.. పురుగు మందుల అవశేషాలు తగ్గుతాయి.
- ❖ ఉదాహరణకు టొమాటోలో కార్బరిల్ మందు అవశేషాలను రెండు శాతం ఉప్పు ద్రావణంలో కడిగిన తరువాత 15 నిమిషాలు ఉడికించడం వల్ల 10 నుంచి 75 శాతం తగ్గించుకోవచ్చు. రెండు శాతం ఉప్పు ద్రావణంలో కడగటం వల్ల 27.4 శాతాన్ని, నీటిలో కడగడం వల్ల 128 శాతాన్ని తగ్గించుకోవచ్చు.
- ❖ ఫెనలవకేట్ మందు రెండు శాతం చింతపండు ద్రావణంలో కడగడం వల్ల 46.7 శాతం, ఫాస్ఫరస్ మందు రెండు శాతం ఉప్పు ద్రావణంలో కడిగిన తరువాత 15 నిమిషాలు ఉడికించడం వల్ల 63 శాతం, అలాగే క్వినాల్ ఫాస్, క్లోరిపైరిపాస్ మందులు క్యాబేజీ గడ్డపై ముందు ఆకులను తీసివేయడం వల్ల నూరు శాతం అవశేషాలను తగ్గించుకోవచ్చు.
- ❖ సేంద్రియ పద్ధతిలో పెరటిలో కూరగాయలను పెంచడం మంచి పద్ధతి
- ❖ ఇప్పుడు నగరాల్లో ఉండేవారికి ఇంటి ముందు స్థలం ఉండదు. కాబట్టి టెర్రస్‌లోగానీ, బాల్కనీలోగానీ, కుండీల్లోగానీ సేంద్రియ పద్ధతిలో కూరగాయలను పెంచుకోవచ్చు.
- ❖ ఇలా పెంచడం వల్ల శరీరానికి వ్యాయామం అవుతుంది. మనం పండించిన పంటను తిన్నామనే సంతృప్తి కూడా మిగులుతుంది.
- ❖ ఇలా చేయడం వల్ల మన కుటుంబానికీ, మనం ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించిన వాళ్లమవుతాము.

వేసవిలో లోతు దుక్కులు ప్రయోజనాలు

జి. హారిక,
రీసెర్చ్ అసోసియేట్ (సస్యరక్షణ),
డా. పి. వెంకట రావు,
శాస్త్రవేత్త (విస్తరణ),
డా. జె. జగన్నాథం, కో-ఆర్డినేటర్,
ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, శ్రీకాకుళం.

వేసవి కాలంలో అంటే రబీ పంట తీసిన తర్వాత రైతులు ఏప్రిల్-మే నెలల్లో దుక్కి చేసుకోవటానికి ట్రాక్టర్ లేక 'ఇనుప నాగళ్ళ'తో లేదా 'మౌల్డ్ బోర్డ్ ప్లవ్'తో లోతు దుక్కులు సుమారు తొమ్మిది అంగుళాలకు తగ్గకుండా చేసుకోవాల్సి ఉంటుంది.

చాలా మంది రైతులు ఖరీఫ్, రబీలలో పైరు సాగు తర్వాత మళ్ళీ తొలకరి వర్షాల వరకు పొలాలను అలాగే వదిలేస్తారు. పంట అవశేషాలను కొయ్య కాళ్ళను తొలగించటం, దుక్కి చేయడం వంటి చర్యలు చేపట్టరు. దాని వలన కలిగే నష్టాలలో ముఖ్యమైనవి :

- కలుపు మొక్కలు విపరీతంగా పెరిగి నీటిని పోషక పదార్థాలను గ్రహిస్తూ భూసారం తగ్గడానికి దోహదపడతాయి. భూమిలోని లోతైన పొరల నుండి తేమను తీసుకుంటూ ఆవిరి రూపంలో బయటకు పంపుతాయి. దీని వలన పోషకాల కొరత ఏర్పడి తర్వాత వేసే పంటలకు అధిక మోతాదులో రసాయన ఎరువులు వేయాల్సి ఉంటుంది.
- అంతే కాకుండా చీడ పీడల సంగతి కూడా బాగా వృద్ధి చెందుతాయి. రైతులు భూమిని పంట తర్వాత దుక్కి దున్ని వదిలేయడం వల్ల మళ్ళీ వర్షాకాలం వచ్చిన తర్వాత భూమిని తయారు చేయడం ఆలస్యమవుతుంది.
- ఇటువంటి నష్టాల నుండి అధిగమించాలంటే రబీ పంట కోసిన తర్వాత నేలలో తగిన తేమ ఉన్నప్పుడు ట్రాక్టర్ కు సబ్ సోయిలర్, రోటవేటర్ వంటి పరికరాలను అమర్చి వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేసుకోవాలి. దీనివలన నేల గుల్ల బారుతుంది. అందువల్ల తొలకరిలో వేసే పైర్ల వేర్లు నేలలోకి విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది.
- రైతులు వేసవిలో నేలను లోతుగా దున్నినప్పుడు పై మట్టి కింద ఉండే గట్టి పొర కదిలి నేలకు నీటిని పీల్చుకునే శక్తి అధికమవుతుంది.
- పంటలులేని వేసవి సమయంలో పంటలను ఆశించే చీడ పురుగులు, తెగుళ్ళను కలుగజేసే శిలింద్రాలు భూమిలో ఆశ్రయం పొందుతాయి.
- వేరుశనగ, చెరకు, పండ్ల చెట్లను ఆశించే వేరు పురుగు, పచ్చపురుగు, లద్దె పురుగుల కోశస్థ భూమిలోనే ఉంటాయి. రెక్కల పురుగులు ప్యూపాల నుండి బయటకు వస్తాయి. వేసవి దుక్కులు చేయడం వల్ల నేలలో ఉన్న చీడపురుగులు కోశస్థ దశలు, గుడ్లు బయటపడి వేడికి చనిపోతాయి. కొంగలు, కాకులు మొదలైన పక్షులు వీటిని తిని నాశనం చేస్తాయి. అందువలన సమగ్ర సస్యరక్షణలో వేసవి దుక్కులకు మొట్టమొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. దీనిని ఆచరించడం వలన పురుగు మందుల ఖర్చు కూడా తగ్గుతుంది. పంటలలో మందుల పిచికారీ తగ్గుతుంది. వాతావరణాన్ని కూడా కాపాడినవారమవుతాం.
- అంతేకాకుండా రైతులు వేసవి దుక్కులు చేయడం వల్ల బహువార్షిక కలుపు మొక్కలైన తుంగ, గరిక, దర్భ వంటి కలుపు మొక్కలను కొంత వరకు నిర్మూలించవచ్చు. ఈ కలుపు మొక్కలు కాయలు, వేర్లు, దుంపలు పైకి తేలి ఉపరితలంలో ఉష్ణోగ్రతకు నశించే అవకాశం ఉంటుంది. నేల పైకి తేలిన కాయలు, వేర్లను, దుంపలను ఏరి వేసి నాశనం చేయాలి.
- పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, లోగడ పైర్ల నుండి రాలిన ఆకులు లోతుగా దున్నినప్పుడు భూమిలో కలిసి కుళ్ళటం వల్ల నేలలో సేంద్రియ కర్బనం పెరిగే అవకాశం ఉంది.
- నేల ముందుగానే వేసవిలో బాగా దున్నుకోవడం వలన తొలకరి వర్షాలు పడగానే పెళ్లలు మెత్తబడి వర్షాలు పడిన తరువాత నీరు బాగా ఇంకడం వలన, నేలను మరోసారి దున్ని పైర్లను సకాలంలో విత్తుకునే అవకాశం ఉంటుంది.

ఈ విధంగా రైతులు వేసవి కాలంలో వాలుకు అడ్డంగా లోతు దుక్కులు చేసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు పొంది తరువాత పంటలో కలుపు, చీడపీడల ఉధృతిని కొంత వరకు తగ్గించి, భౌతిక లక్షణాలు మెరుగుపరుచుకొని అధిక దిగుబడులను పొందవచ్చు.

మిరప సాగులో మెళకువలు

డి. శ్రీకాంత్, పి. హెచ్. డి. స్కాలర్
యం. లక్ష్మీ నాగ నందిని, పి. హెచ్. డి. స్కాలర్
వై. మౌనిక, పి. హెచ్. డి. స్కాలర్
డా. వై. యస్. ఆర్. ఉద్యాన విశ్వ విద్యాలయం,
వెంకటరామన్నగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా,
ఫోన్ నెంబర్: 8179468870

దేశంలో పండించే వాణిజ్య పంటలలో మిరప ముఖ్యమైనది. దీనిని కూరలో పచ్చికాయలుగానూ, ఎండు కాయలను పొడి చేసి కారం గానూ వినియోగిస్తారు. మిరప పంట పండించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో మొదటి స్థానంలో ఉంది. ఇండియాలో పండించే 13 లక్షల టన్నుల్లో ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి సుమారు 50 శాతం వాటా అంటే 6.5 లక్షల టన్నులు ఉత్పత్తి అవుతుంది. దీనిలో ఒక్క గుంటూరు జిల్లా నుండే 3.20 లక్షల టన్నులు అంటే 50 శాతం వాటా పండుతున్నాయి. దేశంలో మిరప పంటను సుమారు 7.9 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేయగా ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే 1.31 లక్షల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. దీనిలో ఒక్క గుంటూరు జిల్లా నుంచే సుమారు 50 శాతం విస్తీర్ణంలో అంటే 64,000 హెక్టార్లలో మిరపను సాగు చేస్తున్నారు.

దేశంలో మిరప సాగుకు చాలా సుదీర్ఘ చరిత్ర ఉంది. ఆ క్రమంలోనే దీనిలో చాలా రకాల జన్యుక్రమాలు ఏర్పడ్డాయి. వీటన్నింటిలో ఉత్తరప్రదేశ్‌లో ఊరగాయ లేదా పచ్చళ్ళ తయారీకీ వినియోగించే మిరప, కర్ణాటకలో స్వాష్, బ్యాగది మిరప, తమిళనాడులో మందు రకం, గుంటూరులో సన్న మిరప, వరంగల్‌లో టమాట మిరప చాలా ప్రాముఖ్యాన్ని కలిగి ఉన్నాయి.

నేలలు

వర్షాధారపు పంటకు నల్ల నేలలు, నీటి ఆధారపు పైర్లకు నల్ల నేలలు, చల్కా నేలలు, లంక భూములు, ఇసుకతో కూడిన ఒండ్రు నేలలు అనుకూలం. ఉదజని సూచిక 6-6.5 ఉన్న నేలలు అనుకూలం. నీటి ఎద్దడిని కొంత వరకు తట్టుకుంటుంది.

వాతావరణం

మిరపకు 10-35 డిగ్రీల ఉష్ణోగ్రత అనుకూలం. ఎండు మిరప కోసం వేసే పంటను ఖరీఫ్‌లో వేసుకోవడం మంచిది. పచ్చి మిరప కోసం సంవత్సరం పొడవునా సాగు చేసుకోవచ్చు.

నేల తయారీ

మిరపకు మెత్తటి దుక్కి కావాలి. 3-4 సార్లు దుక్కి దున్ని 2 సార్లు గుంటక తోలాలి.

విత్తన మోతాదు

నారు పెంచేందుకు సెంటుకు 650 గ్రా. (ఒక ఎకరానికి సరిపడే) నారు విత్తనం, ఎద బెట్టేందుకు ఎకరాకు 2.5 కిలోల విత్తనం కావాలి.

విత్తనశుద్ధి

కిలో మిరప విత్తనానికి మెదలుగా వైరస్ తెగుళ్ళు నివారణకు గాను విత్తనశుద్ధి 150 గ్రా. ట్రైసోడియం ఆర్థోఫాస్ఫేట్ తర్వాత రసం పీల్చే పురుగుల నివారణకు గాను 8 గ్రా. ఇమిడాక్లోప్రిడ్‌ను, చివరగా ఇతర తెగుళ్ళ నివారణకు గాను 3 గ్రా. కాప్టాన్ లేదా మాంకోజెబ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

మిరప ఎగుమతులు

మన దేశం నుండి మిరప కాయలు పచ్చి మిర్చి గాను, ఎండు మిరప కాయలు, తొడిమెలు తీసేసి మిరపకాయలు, నలగ కొట్టిన మిరప కాయలు, మిరప పొడి ఒలియోరెజిన్ వంటి రూపాలలో ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. గుంటూరు నుండి వివిధ దేశాలకు 1.25 లక్షల టన్నులు ఎగుమతి అవుతున్నాయి.

ఎగుమతి చేసే మిరపను 3 రకాలుగా విభజించవచ్చు.

1. ఎక్కువ కారం ఉన్న రకాలు : (80 వేల నుండి 11 లక్షల ఎస్.ఎచ్.యు. వరకు) - తేజ, వండర్ హాట్, యు.ఎస్ - 4884, బర్డ్స్ ఐ చిల్లీ - 1 నుండి 2 లక్షల ఎస్.హెచ్.యు.

నాగా చిల్లీ -10 లక్షల ఎస్.హెచ్.యు.

2. మధ్యస్త కారం ఉన్న రకాలు : (15 వేల నుండి 80 వేల ఎస్.ఎచ్.యు. వరకు) - ఎల్.సి.ఎ-334, ఎల్.సి.ఎ-341, 273, సూపర్ 10 వంటి రకాలు.

3. తక్కువ కారం గల రకాలు : (15 వేల ఎస్.ఎచ్.యు. కంటే తక్కువ) - దేవనూరు డీలక్స్, బ్యాడిగి, వరంగల్ చపట (టమాటో చిల్లీ)

మిరప రకాలు

1. అర్క లోహిత : ఇవి ఐ.ఐ.ఎచ్.ఆర్. బెంగళూరు విడుదల చేసిన ఓపెన్ పాలినేటెడ్ రకం. మొక్కలు పొడవుగా నిటారుగా, కాయలు సూటిగా, నునువుగా మధ్య రకం పొడవుగా కొనలు మెనదేలి వుంటాయి. ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి, పక్వదశలో ముదురు ఎరుపు రంగులోకి మారుతాయి. కారం అధికంగా ఉంటుంది. పంటకాలం -180 రోజులు,

దిగుబడి : పచ్చికాయలు - హెక్టారుకు 25 టన్నులు. ఎండు కాయలు - హెక్టారుకు 3 టన్నులు.

2. అర్క మేఘన : ఐ.ఐ.ఎచ్.ఆర్. విడుదల చేసిన హైబ్రిడ్ పచ్చి కాయలలో, ఎండు కాయలలో దిగుబడులను ఇస్తుంది. కాయ పొడవు 8-10 సెం.మీ., కాయ మందం 1-1.2 సెం.మీ. కలిగి ఉంటుంది. దిగుబడి: - పచ్చివి హెక్టారుకు 30-35 టన్నులు. ఎండు మిరప - హెక్టారుకు 5 టన్నులు. పంట కాలం-180 రోజులు.

3. అర్క సఫల్ : ఇవి ఐ.ఐ.ఎచ్.ఆర్. విడుదల చేసిన ఓపెన్ పాలినేటెడ్ రకం. కాయలు ఆకుపచ్చగా, నునులుగా మధ్యరకం పొడవుగా క1నలు మెండుబోయి కొమ్మలకు వేలాడుతూ ఉంటాయి. దిగుబడి : 25 టన్నులు/హెక్టారు, పంటకాలం : 160-180 రోజులు.

4. అర్క అభీర్ : ఐ.ఐ.ఎచ్.ఆర్. విడుదల చేసిన రకం. మొక్కలు పొడవుగా నిటారుగా కాయలు లేత ఆకుపచ్చ రంగులో ముడతలుగా ఉండి పక్వదశలో ముదురు ఎరుపుగా మారుతాయి. పంటకాలం 160-180 రోజులు,

దిగుబడి : హెక్టారుకు 2 టన్నులు.

5. జి-3 : పొడవు కాయలు, వర్షాధారపు పైరుకు అనుకూలం. దిగుబడి వర్షాధారంగా 6-7 క్వి/ఎ, నీటి వసతి కింద ఎకరానికి 15-18 క్వింటాళ్లు.

6. జి-4 (భాగ్యలక్ష్మి) : కాయలు సన్నగా పొడవుగా ఉంటాయి. పచ్చికాయకు, ఎండుకాయకు అనుకూలం. వైరస్‌ను తట్టుకుంటుంది. ఎకరానికి 40-50 క్వింటాళ్లు.

7. జి-5 (ఆంధ్రజ్యోతి) : కాయలు పొట్టిగా, లావుగా ఉంటాయి. నెల్లూరుకు, చిత్తూరుకు, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో నీటి వసతి కింద సాగుకి నుకూలం. దిగుబడి ఎకరానికి 40-50 క్వింటాళ్లు.

8. సి.ఎ.960 (సింధూర్) : కాయలు పొడవుగా, లావుగా ఉంటాయి. పచ్చిమిరప, ఎండు మిరపకు అనుకూలం. నీటి వసతి కింద వేయ దగిన రకం. త్వరగా కాపుకొస్తుంది. కారం తక్కువ. వేసవి పైరుకు అనుకూలమైన రకం. దిగుబడి ఎకరానికి 50-55 క్వింటాళ్లు.

9. ఎల్.సి.ఎ.235 (భాస్కర్) : కాయలు పొడవు తక్కువ. కారం ఎక్కువ. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో వర్షాధారంగాను, నీటి వసతి కింద సాగుకు అనుకూలం. వైరస్‌ను బాగా తట్టుకుంటుంది. అన్ని జిల్లాలకు అనుకూలం. దిగుబడి ఎకరానికి 50-60 క్వింటాళ్లు.

విత్తేకాలం : ఖరీఫ్ - జులై, ఆగస్టు, రబీ - అక్టోబర్, నవంబర్

నారుమడి యాజమాన్యం

ఒక మీటరు వెడల్పు 15 సెం.మీ. ఎత్తు ఉండేటట్లు నారుమడులు చేసి మధ్యలో 30 సెం.మీ. కాలువలు తీయాలి. సెంటు నారుమడిలో 650 గ్రాముల విత్తనం చల్లుకోవాలి. విత్తనంతోపాటు సెంటు నారుమడికి 80 గ్రా. ఫిప్రోనిల్ గుళికలను వాడితే రసం పీల్చే పురుగులను (నల్లి తప్ప) నివారించవచ్చు. సెంటుకు ఒక కిలో వేప పిండి వేయాలి. ఒక శాతం బోర్డో మిశ్రమం లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ ను లీటరు నీటిలో కలిపిన నీళ్ళతో నారుమడిని రెండో రోజు తడపాలి. ఆరు వారాల వయస్సుగల మొక్కలు నాటుకోవాలి.

ఇలా నాటాలి

ఆరు వారాల వయస్సుగల మొక్కలు నాటడానికి అనుకూలం. వర్షాధరపు పైరుకు 60 × 15 సెం.మీ. దూరంలో పాదుకు ఒక మొక్క చొప్పున నీటి వసతి కింద 60 × 60 లేదా 75× 60 లేదా

90 × 60 సెం.మీ.ల చొప్పున పాదుకు రెండు మొక్కల చొప్పున నాటుకోవాలి.

కలుపు నివారణ, అంతరకృషి

నాటిన 48 గంటల లోపు పెండిమిథాలిన్ 30 శాతం, ఎకరాకు 1.3 నుండి 1.6 లీటర్ల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

ఎరువులు

ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు వాడితే.. లేదా పచ్చిరొట్ట పైరును పెంచి కలియదున్నాలి. వర్షాధారపు పైరుకు 24-16-20 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్ నిచ్చే ఎరువులను ఒక ఎకరానికి వాడాలి. ఆరుతడి పైరుకు 120-24-48 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్‌ను ఇచ్చే ఎరువులను వేయాలి. నత్రజని మూడు సమ పాళ్ళుగా చేసి నాటిన 30,45, 60 రోజున పైపాటుగా వేసి బోదెలు ఎగదోయాలి.

మిరపలో సమగ్ర యాజమాన్యం:

ప్రస్తుతం ఉన్న పరిస్తితుల్లో రైతులు విచక్షణా రహితంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడుతున్నారు. అందువలన నేల నిస్సారమై పంట దిగుబడి తగ్గిపోతుంది. మనం పండించే కాయలలో పురుగు మందుల అవశేషాలు ఎక్కువగా ఉండటం వలన విషపూరితంగా తయారవుతాయి. దీనివలన ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. రాబోయే కాలంలో నేలలు నిర్జీవమై ఏ పంటలు పండించడానికి పనికిరాకుండా పోతాయి. అందువలన రైతులందరు సమగ్ర సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి.

- సాగు చేయబోయే పొలం మట్టి నమూనాలను సేకరించి, మట్టి పరీక్ష చేయించి ఫలితాలను బట్టి ఎరువులు వాడాలి.
- పిల్లి పెసర, జనుము లాంటి పప్పు జాతి పచ్చిరొట్ట పంటలను సాగుచేసి పొట్ట దశలో రోటోవేటర్‌తో పొలంలో కలియదున్నాలి. పురుగులు, తెగుళ్ళను నివారించడానికి విత్తనశుద్ధి చేయాలి.
- ఎత్తు నారుమళ్ళలో నారు పెంచాలి. లేదా షేడ్ నెట్లలో పెంచిన వైరస్ సోకని నారును నాటాలి.
- పశువుల ఎరువు, వేపపిండితో ట్రైకో డెర్మా విరిడి మిశ్రమం తయారు చేసి పొలంలో వేయాలి.
- పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలి.
- మిరప చేను చుట్టూ రక్షణ పంటలుగా హైబ్రిడ్ జొన్న లేదా మొక్కజొన్నను రెండు లేదా మూడు సాళ్ళలో వేయాలి.
- కీటక ఆకర్షణ (ఎర) పంటలుగా బంతి, ఆముదాన్ని పొలంలో అక్కడక్కడా వేయాలి.
- సకాలంలో అంతరసేద్యం చేసి కలుపు నివారించాలి.
- నిషేధించిన పురుగు మందులను కూడా అవసరం మేరకే సకాలంలో మార్చి మార్చి పాడాలి.
- ఎకరానికి నాలుగు లింగాకర్షణ బుట్టలు పెట్టి పురుగుల ఉనికి గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలి.

రైతుల ఆందోళనల్లో ఘనంగా అంబేద్కర్ జయంతి

మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న రైతులు ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు దేశవ్యాప్తంగా అంబేద్కర్ జయంతి సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతు ఉద్యమ కేంద్రాల్లో రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. హికానాలోని దళిత సంస్థలు టిక్రీ సరిహద్దుకు చేరుకోవడం ద్వారా రైతుల ధర్నాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించాయి. చంద్రశేఖర్ ఆజాద్ ఘాజీపూర్ సరిహద్దు, సింఘూ సరిహద్దుకు చేరుకొని ఈ ఉద్యమానికి సంఘీభావం తెలుపుతూ ఉమ్మడి పోరాటానికి పిలుపునిచ్చారు. కిసాన్ బహుజన్ ఐక్యత దినోత్సవాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత, బహుజన నాయకులు మాట్లాడుతూ.. కరోనా మహమ్మారి సమయంలో కేంద్ర ప్రభుత్వం చర్చలు, సంప్రదింపులు లేకుండా మూడు వ్యవసాయ చట్టాలను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందని విమర్శించారు.

జీవో 138ని రద్దు చేయాలి

ఏపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్

తెల్లజొన్న పంటకు మద్దతు ధర లభించకుండా దెబ్బదీసే జీవో 138ని తక్షణమే రద్దు చేయాలని ఏపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగబోయిన రంగారావు, పి.జమలయ్య ఏప్రిల్ 27న ఒక ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తెల్ల జొన్నలను క్వింటాలుకు రూ.2,620 మద్దతు ధర నిర్ణయించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గతేడాది తెల్ల జొన్న, పచ్చజొన్నలను క్వింటా రూ.2,600 చొప్పున రాష్ట్రప్రభుత్వం కొనుగోలు చేసిందని, ఈ యేడు జీవో 138 తీసుకువచ్చి దానిలో తెల్ల జొన్న క్వింటా ధర రూ.1,850 మాత్రమే చెల్లించేలా చేయడం దారుణ మన్నారు. రైతు పక్షపాతి ప్రభుత్వం అని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కూరగాయ పంటలలో జీవన ఎరువుల ప్రాముఖ్యత

ఎన్.రత్నకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్,
ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, బాపట్ల
డి.శ్రీకాంత్, పి. హెచ్.డి. రీసెర్చ్ స్కాలర్,
ఎ.రజని, శాస్త్రవేత్త,
డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం,
వెంకటరామన్నగూడెం, ప.గో.జిల్లా.

ప్రస్తుత పరిస్థితుల్లో రసాయన ఎరువుల ధరలు అధికంగా ఉండటం వల్ల, పశువుల ఎరువు కొరత వల్ల వివిధ పంటల్లో జీవన ఎరువుల ప్రాధాన్యత పెరుగుతోంది. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తూ భూమిలో పోషకాల సమతుల్యతను కాపాడి, తక్కువ ఖర్చుతో సుస్థిర అధిక దిగుబడులు సాధించాలంటే రైతు సోదరులు పంటల్లో సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతయినా ఉంది. ముఖ్యంగా కూరగాయ పంటల్లో సమగ్ర ఎరువుల యాజమాన్యంలో జీవన ఎరువులు వాడకం ముఖ్యమైన అంశంగా నేల బలం, ఫలదత, పంట దిగుబడి, నాణ్యత పెంచడంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది.

కొన్నిరకాల సూక్ష్మజీవులు గాలిలో 78 శాతం ఉన్న సూక్ష్మ నత్రజనిని సేకరించి మొక్కలకు అందించి భూసారాన్ని పెంపొందిస్తాయి. మరికొన్ని శిలీంద్రాలకు భాస్వరాన్ని లభ్యమయ్యే విధంగా మార్చగలిగే శక్తి ఉంది. ఈ విధంగా మొక్కలకు పోషకాలు అందించడానికి తోడ్పడే వాటిని జీవన ఎరువులు అంటారు.

జీవన ఎరువుల వాడకం - ఉపయోగాలు

- కూరగాయల సాగులో జీవన ఎరువులు వాడకం పెంచడం ద్వారా 20 నుంచి 50 శాతం వరకూ రసాయన ఎరువులు వాడకం తగ్గుతుంది.
- ఇవి వాతావరణంలోని నత్రజనిని స్వీకరిస్తాయి. నేలలోని భాస్వరాన్ని మొక్కలకు అందుబాటులోకి తెస్తాయి.
- హార్మోన్లు, విటమిన్లు, ఎంజైములు లభ్యమై మొక్క పెరుగుదల చురుకుగా ఉంటుంది.
- సాధారణంగా పంట దిగుబడులు పది నుంచి ఇరవై శాతం వరకూ పెరుగుతాయి.
- నేల నుంచి సంక్రమించే తెగుళ్లు కొంతవరకు నిరోధించబడతాయి
- నేల భౌతిక లక్షణాలు మెరుగుపడతాయి
- పరికరాల అనుకూలత, వాతావరణ మిత్రత్వం కలిగి ఉంటాయి
- కాలుష్యం ఉండదు. నేలకు, పంటకు ఎలాంటి హానీ కలగదు
- జీవన ఎరువుల వాడకం వల్ల వేర్లు సమృద్ధిగా పెరగడంతోపాటు..

మొక్కలకు నీటి ఎద్దడిని తట్టుకునే శక్తి పెరుగుతుంది. ఒకసారి జీవన ఎరువులు నేలకు అందిస్తే, అవి వాటంతటవే భూమిలో వృద్ధి చెందుతాయి.

జీవన ఎరువుల్లో రకాలు

రైజోబియం : ఈ బాక్టీరియాను ముఖ్యంగా బఠాణి, చిక్కుడు, ఫ్రెంచి చిక్కుడు వంటి కూరగాయల పైర్లపై వాడతారు. ఇవి ఈ కూరగాయల వేర్లలో బుడిపెలు కలుగజేసి.. వాటితో సహజీవనం చేస్తూ, గాలిలోని నత్రజనిని మొక్కలకు అందుబాటులో ఉండే రూపంలో బుడిపెలతో స్థిరీకరింపచేస్తాయి. దీనితోపాటు 16 నుంచి 32 కిలోల నత్రజనిని భూముల్లో నిలువ చేస్తే.. ఆ తర్వాత మొక్క పెరుగుదలకు ఉపయోగ పడుతుంది.

వాడే విధానం : ఒక లీటరు నీటిలో 50 గ్రాముల బెల్లం లేదా పంచదారను కరిగించి 15 నిమిషాలు మరగ కాచి చల్లార్చాలి. ఆ ద్రావణానికి 20 గ్రాములు రైజోబియం కల్చర్ కలిపి విత్తనానికి పట్టించి ఆరబెట్టి విత్తాలి.

అజితోబాక్టర్ : ఇవి స్వతంత్రంగా జీవించే సూక్ష్మజీవులు. ఇవి మొక్కలపై ఆధారపడకుండా స్వతంత్రంగా నేలలో నివసిస్తూ గాలి

నుంచి నత్రజనిని స్వీకరించి మొక్కలకు అందజేస్తాయి. కొద్దిపాటి క్షార గుణంగల నేలలకు అజతోబాక్టర్ బీజరింకె జాతి అనువైనది. ఇది కొన్ని కూరగాయ పంటల్లో పెరుగుదలకు కావలసిన హార్మోన్లు, విటమిన్లను ఉత్పత్తి చేస్తుంది. పంటలకు అజతోబాక్టర్ జీవన ఎరువు వాడటం వల్ల (ఉదాహరణకు బెండలో 8.3 శాతం, వంగలో 8.9 శాతం, కాలీఫ్లవర్‌లో 10.3 శాతం) అధిక దిగుబడులు సాధించొచ్చని పరిశోధనా ఫలితాలు తెలుపుతున్నాయి.

వాడే విధానం : నీరు ద్వారా అయితే ఒక కిలో జీవన ఎరువును 10 లీటర్ల నీటిలో కలిపి ద్రావణం తయారు చేయాలి. ఒక ఎకరానికి సరిపడే నీరును చిన్నచిన్న కట్టలుగా కట్టి ఈ మిశ్రమంలో 15 నుంచి 20 నిమిషాలుంటే, ఆ తర్వాత మొక్కలు నాటాలి. నేల ద్వారా అయితే రెండు మూడు కిలోల జీవన ఎరువును 40-60 కిలోల మట్టితోగాని లేక సేంద్రియ ఎరువులోగాని కలిపి అజతోబాక్టర్ ఎరువు భూమిలో సేంద్రియ పదార్థం ఎక్కువగా ఉన్నప్పుడు మాత్రమే సమర్థవంతంగా ఉపయోగపడుతుంది.

అజోస్పైరిల్లం : వీటిని సహజ సిద్ధ సూక్ష్మజీవులు అని పిలుస్తారు. ఇవి వివిధ పంటల వేర్లు మీద లేదా వేర్ల దగ్గర జీవిస్తాయి. ఇవి గాలిలో నత్రజనిని, హార్మోన్లను విసర్జించడం వల్ల మొక్క చురుగ్గా పెరుగుతుంది. ఇవి ఎకరానికి 8-16 కిలోల నత్రజనిని స్థిరీకరించుతాయి. వీటిలో అజోస్పైరిల్లం, లిపోఫరమ్ రకాలు అనువైనవి .

ఈ రెండు రకాలను టొమాటో, వంగ, బెండ, ఇతర కూరగాయల పంట పొలాల్లో వాడొచ్చు. ఈ జీవన ఎరువులను వాడి ఎకరానికి 25 నుంచి 30 శాతం వరకూ మనం వేసే నత్రజనిని ఆదా చేసుకోవచ్చు. ఈ కల్చర్‌ను కూడా అజతోబాక్టర్ వాడే పద్ధతిలోనే, అదే మోతాదులో ఉపయోగించి మంచి దిగుబడులు సాధించొచ్చు. అజతోబాక్టర్ కన్నా ఎక్కువ నత్రజనిని స్వీకరించి తక్కువ సేంద్రియ పదార్థంగల నేలలో కూడా అజోస్పైరిల్లం బాగా అభివృద్ధి చెందుతుంది.

ఫాస్ఫోబాక్టీరియా : వీటిని ఫాస్పరస్ సాల్యుబులైజింగ్ మైక్రోఆర్గానిజమ్స్ లేదా ఫాస్ఫో బాక్టీరియా అంటారు. వీటిలో భాసిల్లస్, సూడో మోనస్ సూక్ష్మజీవులు, ఆస్పర్జిల్లస్, పెన్సిలియం శిలీంద్రాలు ముఖ్యమైనవి. వీటి నుంచి తయారయ్యే సేంద్రియ ఆమ్లాల వల్ల భూమిలో బిగిసుకుపోయి లభ్యంకాని స్థితిలో ఉన్న భాస్వరాన్ని ట్రైకెల్షియం ఫాస్ఫేట్ రూపంలోకి మొక్కలకు లభ్యమయ్యే విధంగా మారుస్తాయి. మొక్కల పెరుగుదలకు ఉపయోగపడే హార్మోన్లను కూడా ఉత్పత్తి చేస్తాయి. మొక్క వేర్లు దగ్గర వీటి చర్య చురుగ్గా ఉండి జీవక్రియకు తోడ్పడతాయి. వీటి వాడకం వల్ల సిఫార్సు చేసిన ఫాస్ఫోబాక్టీరియాను అన్ని కూరగాయ పంట పొలాల్లో వాడవచ్చు.

వాడే విధానం : 200 - 400 గ్రాముల ఫాస్ఫోబాక్టీరియా ఎరువును ఎకరానికి సరిపడే విత్తనానికి పట్టించొచ్చు. ఒకటి రెండు కిలోల కల్చర్‌ను సుమారు 200 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరం నేలలో దుక్కిలో వేయవచ్చు.

వెసిక్యులర్ ఆర్‌బస్కులర్ మకోరైజా (వి.ఎ.ఎం) : ఈ శిలీంద్రాన్ని మైకోరైజా అనే పేరుతో పిలుస్తారు. వీటిని గ్లోమస్ పేరుతో పిలుస్తారు. వీటిలో శిలీంద్ర రకాలు ముఖ్యమైనవి. ఇవి వేరు మండలం మీద మొక్కలతో కలిపి మైత్రితో అతిథిగా జీవిస్తాయి. మైకోరైజా శిలీంద్రపు మూలాలు వేర్లలో, వాటిపై పొరల్లోకి, లోపలి పొరల్లోకి కూడా చొచ్చుకొని పోతాయి. ఇవి ఆహారానికి మొక్కలపై ఆధారపడతాయి. దీనికి బదులుగా ఇవి నేల నుండి భాస్వరాన్ని మొక్కలకు అందిస్తాయి. ఈ ప్రక్రియల్లో శిలీంద్రం కన్నా మొక్క అధిక లాభాన్ని పొందుతుంది. ఈ శిలీంద్రం భాస్వరాన్ని గ్రహించి నిల్వ ఉంచి అవసరమైనప్పుడు మొక్కకు అందిస్తుంది. వేరు వ్యవస్థ చుట్టూ ఈ శిలీంద్రం ఒక రక్షణ కవచం మాదిరిగా ఏర్పడి, రోగకారకాలైన సూక్ష్మజీవుల ప్రవేశాన్ని నిరోధిస్తుంది. నీటి ఎద్దడిని తట్టుకోవడానికి కూడా తోడ్పడుతుంది. ఈ కల్చర్‌ను కూడా ఫాస్ఫోబాక్టీరియా వాడే పద్ధతిలోనే, అదే మోతాదులో అన్ని కూరగాయ పంటల్లోనూ వాడొచ్చు. సమగ్ర ఎరువుల పంటల్లోనూ వాడొచ్చు. సమగ్ర ఎరువుల వాడకంలో జీవన ఎరువుల వాడకం ముఖ్యమైనది. నేల, ఆరోగ్యం, పంట దిగుబడి, నాణ్యత పెరగడంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది.

జీవన ఎరువుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- జీవన ఎరువు ప్యాకెట్లను ఎండ, వేడి తగలని చల్లని నీడ ప్రదేశంలో నిల్వ ఉంచాలి.
- రైతు వాడే జీవన ఎరువు ప్యాకెట్ ఆ పంటకు సరైనదై ఉండాలి. ఉపయోగించే జీవన ఎరువు ప్యాకెట్టుపై ఉన్న గడువు తేదీ లోపల మాత్రమే ఉపయోగించాలి.
- రసాయనాలలో విత్తనశుద్ధి చేసేటప్పుడు విధిగా 24 నుంచి 48 గంటల వ్యవధి ఉండాలి.
- రసాయన ఎరువులతో కలిపి జీవన ఎరువులను వాడకూడదు.
- జీవన ఎరువు సమర్థవంతంగా పనిచేయడానికి నాణ్యతగల కల్చర్‌ను వాడుకోవాలి
- సేంద్రియ ఎరువుతో జీవన ఎరువు కలిపిన వెంటనే పంటకు వాడాలి
- జీవన ఎరువులను ప్రభుత్వ రంగ సంస్థల నుంచి గాని నమ్మకమైన ప్రయివేటు సంస్థల నుంచి గాని కొనుగోలు చేయాలి

ఈ విధంగా రైతులు జీవన ఎరువులను సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా ఉపయోగించడం వల్ల వాతావరణ కాలుష్యం తగ్గించడమే కాకుండా అధిక పంట దిగుబడులు పొందొచ్చు.



కాండం ముక్కల ద్వారా దొండ సాగు

డి. శ్రీకాంత్, పి. హెచ్. డి. స్కాలర్
యం. లక్ష్మీ నాగ నందిని, పి. హెచ్. డి. స్కాలర్
వై. మౌనిక, పి. హెచ్. డి. స్కాలర్
డా. వై. యస్. ఆర్. ఉద్యాన విశ్వ విద్యాలయం,
వెంకటరామన్నగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా,
ఫోన్ నెంబర్: 8179468870

కూరగాయల పంటలలో దొండకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. దొండలో విటమిన్లు (విటమిన్ బి-1, విటమిన్-బి2), పోషకాలు (ఐరన్, కాలియం), పీచు పదార్థాలు లభ్యమవుతాయి. దొండ ఔషధ గుణాలను కూడా కలిగి ఉంటుంది. మధుమేహం (డయాబెటిస్), శ్వాస నాళాల వాపు (బ్రాంకైటిస్), రక్తపోటు లాంటి వ్యాధుల నివారణ లక్షణాలను దొండ కలిగి ఉంటుంది. చూర్ణంగా చేసిన దొండకాయ గుజ్జును తలపై రుద్దడం వలన జట్టు రాలడాన్నీ చుండ్రునూ నివారించవచ్చు. దొండ ఆకులను చూర్ణంగా చేసి నుదుట రుద్దడం వలన తలనొప్పిని కూడా అరికట్టవచ్చు.

దొండ కాండం ముక్కలను ఒక్కసారి పొలంలో నాటుకొని పందిరి సహాయంతో సాగు చేస్తే మూడు సంవత్సరాల వరకు పంట దిగుబడిని అధికంగా పొందవచ్చు. ఆంధ్రరాష్ట్రంలో పందిరి కూరగాయలను 20,041 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. సంవత్సరానికి 3,00,615 టన్నుల దిగుబడి వస్తోంది. ఒక ఎకరం పొలంలో శాశ్వత పందిరి నిర్మాణానికి అంచనా వ్యయం సుమారుగా రూ.2 లక్షల వరకూ అవుతోంది.

శాశ్వత పందిరి నిర్మాణానికి అంచనా వ్యయం (ఒక ఎకరాకు)

వివరాలు	పరిమాణం	ధర (రూ.)	మొత్తం (రూ.)
రాతిస్థూపం	155	350	64,750
10 అడుగుల ఎత్తు			
15 13 అ. అంతరంలో నిర్మాణం			
స్టీల్ వైర్ (అల్లిక కోసం)	15 క్వి.	7,500	1,12,500
లేబర్ ఖర్చు	-	-	40,000
(గుంతలు తీయడం, రాళ్ళను పాతడం, స్టీల్ వైర్ అల్లడం)			

సబ్సిడీ : 50 శాతం (ఒక యూనిట్ వ్యయానికి రూ. 1,00,000/- ఎకరాకు)
గరిష్ట సబ్సిడీ పరిమితి : ఒక హెక్టారు మేరకు రూ. 2,50,000/-

వాతావరణం :

దొండ సాగుకు తేమతో కూడిన పొడి వాతావరణం అనుకూలం. ఉష్ణోగ్రత 25-30 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉంటే దొండ పెరుగుదల బాగుండి పూత, పిందె బాగా వస్తుంది.

నేలలు :

నీటిని నిలుపుకొనే బంకమట్టి నేలలు దొండ సాగుకు అనుకూలంగా ఉంటాయి. మురుగు నీరు పోయే సౌకర్యం గల ఒండ్రు నేలల్లో కూడా సాగు చేయవచ్చు. నేల ఉదజని సూచిక 6-7 మధ్య ఉండాలి.

నాటే సమయం :

నీటి కొరత లేనంత వరకు సంవత్సరం పొడవునా అన్ని రుతువుల్లో సాగు చేయవచ్చు. ముఖ్యంగా మే, జూన్, జూలై, ఫిబ్రవరిలో నాటుకుంటే అధిక దిగుబడి వస్తుంది.

నాటటం :

దొండను కాండం ముక్కల ద్వారా ప్రవర్ధనం చేస్తారు. చూపుడు వేలు మందంతో (2-3 అంగుళాలు), 20 సెం.మీ. పొడవు కలిగి నాలుగు కణుపులు ఉన్న కాండం ముక్కలను పొలంలో నాటుకోవడానికి ఎన్నుకోవాలి. ఒక ఎకరానికి సుమారుగా రెండు వేల కాండం ముక్కలు అవసరమౌతాయి. కాండం ముక్కలను ఒక లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ ద్రావణంలో మంచి ప్రధాన పొలంలో వరుసల మధ్య 2 మీటర్లు., మొక్కల మధ్య ఒక మీటరు దూరం ఉండేలా నాటుకోవాలి.

కాండం ముక్కలను నాటడానికి ఒక అడుగు గుంతను తయారు చేసుకొని అందులో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి. మట్టి, కంపోస్టు కొద్దిగా ఇసుక కలిపి నాటడానికి ముందు గుంతలలో వేసుకోవాలి. ప్రతి గుంతలో 100 గ్రాముల ఎరువును 7:10:5 ఎన్.పి.కె. నిష్పత్తిలో వేసుకోవాలి. జీవ ఎరువులైన పేడ, వేప గింజల నూనెను ఉపయోగించవచ్చు.

కలుపు నివారణ, అంతర కృషి :

కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసివేయాలి. 2-3 తడులు తర్వాత మట్టిని గుల్ల చేయాలి. ఎకరాకు పెండిమిథాలిన్ 1.2 లీ. 200 లీటర్ల నీటిలో కలిపి నాటిన 24-48 గంటలలోపు పిచికారీ చేయాలి. మొక్కలు 2-4 ఆకుల దశలో ఉన్నప్పుడు లీటరు నీటికి 3 గ్రాముల బోరాక్స్‌ను కలిపి ఆకులపై పిచికారీ చేస్తే ఆడ పూలు ఎక్కువగా పూసి పంట దిగుబడి బాగా ఉంటుంది. సి.సి.సి. 250 మి.గ్రా. లేదా మాలిక్ హైడ్రజైడ్ 50 మి.గ్రా. లీటరు నీటికి కలిపి కూడా ఈ దశలో పిచికారీ చేయవచ్చు. పంటను పందిరిపై పెంచితే నాణ్యతగల కాయలు ఏర్పడి, మంచి మార్కెట్ ధర లభిస్తుంది.

నీటి యాజమాన్యం :

మామూలుగా వారానికి ఒకసారి చొప్పున తడులు ఇవ్వాలి. నీరు ఎక్కువ కాలం పాదు చుటూ నిలవ ఉండకూడదు. వేసవి కాలంలో నాలుగైదు రోజులకు ఒకసారి నీరు ఇవ్వాలి.

దొండ కాండం ముక్కలను నాటిన 45-60 రోజులకు పూత, 85-100 రోజులకు కోత ప్రారంభమవుతుంది. మూడు సంవత్సరాల వరకు పంట దిగుబడిని పొందవచ్చు.

దిగుబడి :

ఒక ఎకరాకు అత్యధికంగా 60 టన్నుల దిగుబడిని పొందే అవకాశం ఉంది.

సస్యరక్షణ :

దొండ పంటను తెగుళ్ళు పురుగులు ఆశిస్తాయి. సరైన సమయంలో చర్యలు తీసుకోవాలి. లేకపోతే పంటకు నష్టం వచ్చి దిగుబడి తగ్గుతుంది.

పురుగులు

పండు ఈగ :

పంట పూత దశలో తల్లి ఈగలు పువ్వులపై గుడ్లను పెడతాయి. పూత, పిందెలలోకి చేరి కాయలను తిని పంటను నష్టపరుస్తాయి. దీని నివారణకు పూత, పిందె దశలలో మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పైరుపై పిచికారీ చేయాలి. 100 మి.లీ. మలాథియాన్‌కు 100 గ్రా. చక్కెర లేదా బెల్లం పాకం లీటరు నీటిలో కలపాలి. ఈ ద్రావణాన్ని మట్టి ప్రమిదలలో పోసి పొలంలో అక్కడక్కడ పెట్టాలి. ఇది విషపు ఎరగా పనిచేస్తుంది.

గాల్ఫై :

ఇది పంట తొలి దశలోనే ఆశిస్తుంది. కావున 5 శాతం వేప కషాయం తొలి దశలోనే పిచికారీ చేయడం వలన ఈ పురుగు విచక్షణ

శక్తిని కోల్పోయి పంటను ఆశించకుండా ఉంటుంది. గాల్ఫై ఆశించిన తీగలను కత్తిరించుకొని ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి, లేదా క్లోరోఫైరిఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే మళ్ళీ ఈ పురుగు ఆశించకుండా నివారించవచ్చు.

తెగుళ్ళు

వేరుకుళ్ళ తెగులు :

దొండ కాండం ముక్కలను భూమిలో నాటినప్పుడు ఒక్కోసారి వేరు ప్రాంతం కుళ్ళిపోతూ ఉంటుంది. కుళ్ళిన ప్రాంతం మొత్తం పొలుసులుగా మారుతుంది.

వేరుకుళ్ళ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణంతో శుద్ధి చేసిన కాండం ముక్కలను వాడాలి. మొక్కల చుట్టూ లీటరు నీటికి 2 గ్రా. మెటలాక్సిల్ కలిపి నేలంతా తడిసేలా పోయాలి. తెగులు ఆశించిన మొక్క చుట్టూ దాదాపు ఒక మీటరు దూరంలో ఈ ద్రావణాన్ని పోయాలి.

వెర్రి తెగులు :

వెర్రి తెగులు పంటకు సోకితే ఆకు, ఈనెల మధ్య మందంగా చారలు ఏర్పడతాయి. ఆకులు పెళుసుగా గిడసబారిపోతాయి. దీంతో పూత, పిందెలు కాయడం ఆగిపోతుంది.

దీని నివారణకు తెగులు సోకిన మొక్కలను తీసి నాశనం చేయాలి. తెగులును వ్యాప్తి చేసే పేనుబంక నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఎండాకాలంలో దుక్కిని లోతుగా దున్నాలి. కలుపు మొక్కలు లేకుండా జాగ్రత్త పడాలి. అల్లిక రెక్కల పురుగులను మొక్కకు రెండు చొప్పున వదలాలి. వరి పంటతో పంట మార్పిడి చేసుకోవాలి.

గంధకం సంబంధిత పురుగు, తెగుళ్ళ మందులను వాడకూడదు. వాడినట్లయితే ఆకులు మాడిపోతాయి. తగిన సమయంలో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించుకోవచ్చు.

సహజసిద్ధ ఎరువులతో ఆకు, కాయగూరల సాగు

- ఇటు ఆరోగ్యం.. అటు ఆదాయం..
- సాంబిరెడ్డికి ఎన్జీ రంగా 'వర్సిటీ ఉగాది పురస్కారం

- పద్మావతి



మనుషులకొచ్చే రకరకాల రోగాలకు రసాయనిక ఎరువులు వాడిన పంటలు ఒక ముఖ్య కారణమని గ్రహించారాయన. తన జీవితంలో తారసపడ్డ ఓ సంఘటన.. ఆయనను సహజసిద్ధ వ్యవసాయం వైపు మళ్లించింది. తిండి ఆరోగ్యాన్నీ, ఆయుష్షునీ ఇవ్వాలి తప్ప - అనారోగ్యాన్నీ, ఆర్థిక నష్టాన్నీ కాదని ఆయన బలంగా అనుకున్నారు. 17 ఎకరాల్లో సహజసిద్ధ వ్యవసాయం చేస్తూ.. వినియోగదారులకు ఆరోగ్యాన్ని పంచుతున్నారు.

ఆయన పేరు ఆరుమల్ల సాంబిరెడ్డి. తొమ్మిదేళ్లుగా అత్యాధునిక పద్ధతుల్లో సహజసిద్ధ ఎరువులు ఉపయోగిస్తూ పలు రకాల పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. ఆయన కృషిని గుర్తించిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉగాది పురస్కారాన్ని అందించింది. గతంలోనూ ఎన్నో ఉత్తమ రైతు అవార్డులు అందుకున్న సాంబిరెడ్డిది గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచినపల్లి. చిన్నతనం నుంచి తండ్రితో పాటు పొలం పనులకు వెళ్లేవాడు. నాగలితో పొలం దున్నడం, కలుపు తీయడం, ఎరువులు, విత్తనాలు చల్లడం చేసేవాడు. వ్యవసాయం చేస్తూనే డిగ్రీ పూర్తి చేశాడు. వ్యవసాయ రంగంపై ఉన్న ఇష్టంతో పై చదువులకు వెళ్లలేదు. మొదట తండ్రి ఇచ్చిన 17 ఎకరాల్లో రసాయనిక ఎరువులతో పంటలను సాగుచేస్తూ లాభాలు సాధించాలనుకున్నాడు. కానీ పంటకు మద్దతు ధర లేక నష్టాలను చవిచూశాడు. ప్రయోగాలు చేస్తే లాభాలు వస్తాయన్న ఆలోచనతో విదేశాల నుంచి కొత్త రకం విత్తనాలను తీసుకొచ్చి పంటలను సాగుచేశారు. స్వీట్ కార్న్, క్యారెట్, బీట్‌రూట్, కీరదోస.. ఇలా 20 రకాల కూరగాయలను పండించి మార్కెట్లకు పంపిణీ చేశారు.

ఆ ఘటనతోనే మార్పు

పదేళ్ల క్రితం కుటుంబ సభ్యుల్లో ఒకరికి క్యాన్సర్ రావడంతో వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ కంటపడిన కాన్సర్ బాధితుల దృశ్యాలు, వైద్యులు తెలిపిన విషయాలు ఆయన ఆలోచనా తీరును మార్చివేశాయి. అక్కడ ఓ నాలుగేళ్ల బాబు క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. తల్లి కన్నీరు కారుస్తూ.. దూరంగా నిలబడి ఉంది. నెలలు నిండిన ఆ తల్లిని బాబుకు దూరంగా ఉండమని వైద్యులు చెప్పారు. తల్లిని పట్టుకోవాలని ఆ బాబు ఒకటే ఏడుపు.. ఈ దృశ్యం సాంబిరెడ్డి హృదయాన్ని కలిచివేసింది. పొలాల్లో వాడే 'గ్లైసిల్' అనే కలుపు నివారణ రసాయనిక మందు ప్రభావం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంటుందని వైద్యుల ద్వారా తెలుసుకున్నాడు. రసాయనిక పురుగు మందులు శరీరంలోని వివిధ భాగాలపై తీవ్ర దుష్ప్రభావం చూపుతాయని అర్థం చేసుకున్నాడు. అప్పటి నుంచి తాను ఆచరించే వ్యవసాయ పద్ధతులను పూర్తిగా మార్చేయాలని నిశ్చయించుకున్నాడు.

రసాయనిక ఎరువులతో కలుషితమైన తన 17 ఎకరాల భూమిని సుమారు రెండేళ్లపాటు సాగు చేయకుండా అలాగే ఉంచేశాడు. పశువుల మందను తీసుకొచ్చి తన పొలంలో కొన్ని నెలల పాటు వుంచాడు. విదళ బీ పిండి, వేప కషాయం ఉపయోగిస్తూ సేద్యానికి శ్రీకారం చుట్టాడు. సాంబిరెడ్డి 10 రకాల పంటలను ఏకకాలంలో ఒకదానికొకటి అడ్డురాకుండా అంతర పంటలుగా వేస్తున్నాడు. అరటి, పసుపు, మామిడి, బొప్పాయి, జామ, చేమ, కాశ్మీర్ గుమ్మడి, పుదీన, తోటకూర, చుక్కకూర, గోంగూర, వంగ, బెండ, దొండ, సొరకాయ, బీర, టమోట, వంకాయ వంటి పంటలను సాగు చేస్తున్నాడు. ప్రతిరోజూ ఆకుకూరల మీదే రూ. 4,500 చొప్పున ఎకరాకు సంవత్సరానికి లక్ష రూపాయల ఆదాయం వస్తోందని ఆయన తెలిపారు.

9 నెలల కాలపరిమితి గల పసుపు పంట కోసం 12 సార్లు జీవామృతం వేస్తున్నారు. వేప కషాయం పిచికారి చేస్తున్నాడు. ఆకుకూరలకు రెండు సార్లు, బొప్పాయి, జామ వంటి పండ్ల మొక్కలకు 15 రోజులకు ఒకసారి జీవామృతం వేస్తున్నారు. 10 రోజులకోసారి నీరందిస్తూ.. పాదుల్లో అర లీటర్ చొప్పున జీవామృతం ఇస్తున్నాడు. గతంలో రసాయన ఎరువులు వాడితే ఎకరానికి 70 వేలు ఖర్చు అయ్యేది. ఇప్పుడు సహజసిద్ధ ఎరువుల వల్ల 30 వేలు మాత్రమే ఖర్చు అవుతుందని ఆయన చెప్పారు.

ఆదాయం కన్నా ఆరోగ్యం ముఖ్యం

రసాయనిక ఎరువులు వాడితే పంట త్వరగా చేతికి వస్తుంది. సహజసిద్ధ ఎరువుల వల్ల పంట ఆలస్యంగా వస్తుంది. దిగుబడి తక్కువగా వుంటుంది. అయినా, సరే ఆరోగ్యం ముఖ్యమని భావించాడు సాంబిరెడ్డి. ఆయన ఉత్పత్తి చేస్తున్న సేంద్రియ పంటలకు తక్కువకాలంలో మంచి ఆదరణ లభించింది. విదేశాలకు ఎగుమతి చేయమని ఆర్డర్లు వచ్చాయి. కానీ ఆయన తన చుట్టూ ఉన్న ప్రజల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పొలంలోనే వ్యవసాయ వుత్పత్తులకు స్థానికంగా అమ్ముతున్నాడు. దళారుల ప్రమేయం లేకుండా పంటనంతా పొలంలోనే చిన్న పాకలో ఉంచి అమ్మకం సాగిస్తున్నాడు. పలువురు వినియోగదారులు నిత్యం ఇక్కడకు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా వైద్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, న్యాయవాదులు వారాంతాల్లో వచ్చి కొనుగోలు చేస్తున్నారు. సాంబిరెడ్డి సాగు గురించి తెలిసిన తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ప్రశంసించారు. భవిష్యత్తు తరాలకు ఇటువంటి సాగు విధానాన్ని నేర్పించాలని ఎపి డిజిపి మాలకొండయ్య పలుసార్లు సాంబిరెడ్డిని కోరారు.

కూరగాయలు పాడవ్వవు

నేను మూడేళ్ల నుంచి ఇక్కడకు వచ్చి కూరగాయలు తీసుకువెళుతున్నాం. ఫ్రిజ్ ఉన్నా అందులో పెట్టడంలేదు. బయటే ఉంచుతాము. అయినా వారంరోజుల వరకూ అసలు పాడవ్వవు. కూర కూడా చాలా రుచిగా ఉంటుంది. అందుకే అంత దూరం నుంచి వచ్చి కొంటున్నాను.

- శాంతి కుమారి,
విజయవాడ, పడమటలంక.

ప్రకృతి సిద్ధంగా పండిస్తారు

ఈ పంటలన్నీ సహజసిద్ధమైన ఎరువుల ద్వారా పండిస్తారని నాకు నాలుగు సంవత్సరాల క్రితం మా అపార్ట్‌మెంట్ వాళ్ల ద్వారా తెలుసుకున్నాను. అప్పటి నుంచి పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు తీసుకెళుతున్నాను. ఈ సరుకు అంతా మా కళ్ల ముందే పొలంలో నుంచి కోసుకువస్తారు. ఇలా తాజాగా పొలంలోంచి తీసుకోవటంలో గొప్ప సంతృప్తి ఉంది.

- ఓ గృహిణి, కుంచనపల్లి

రుద్ర ఛారిటబుల్ ట్రస్ట్‌కి అంబులెన్స్‌ను అందచేసిన వేద సీడ్స్ - కంఠాస్ సంజీవని హాస్పిటల్ యాజమాన్యం

గుంటూరు-గుంటూరు నగరంలోని పేద , బడుగు బలహీన వర్గాలకు నిర్విరామంగా సేవలు అందచేస్తున్న రుద్ర ఛారిటబుల్ ట్రస్ట్‌కు.. వేద సీడ్స్, కంఠాస్ సంజీవని సైకీయాట్రి హాస్పిటల్ యాజమాన్యం అంబులెన్స్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మ చరణ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా గుంటూరు పరిసర ప్రాంతాల్లో రుద్ర ఛారిటబుల్ ట్రస్ట్ వారు చేస్తున్న సేవలకు మనం వెలకట్టలేమని, ఆకలితో చేయి చాచిన వారికి కాదనకుండా, కరోన సోకిన వారికి కడుపునిండా ఆహారాన్ని అందచేస్తూ వారి గొప్ప మనసును చాటుకున్నారని అభినందించారు. గత ఏడాది నుండి నేటి వరకు కరోనాతో మరణించిన వారి దహన సంస్కారాలను చేస్తున్న ట్రస్ట్ వారికి సహాయంగా ఉంటుందనే ఈ అంబులెన్స్‌ను ట్రస్ట్ వారికి అందచేస్తున్నట్లు ధర్మచరణ్ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం కరోన విజృంభణ భయంకరంగా ఉందని, కావున ప్రజలు ఇంటి నుండి బయటకు రాకుండా జాగ్రత్తలు పాటిస్తూ కరోనాను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అందరూ తప్పనిసరిగా మాస్క్‌ను ఉపయోగిస్తూ ఎప్పటికప్పుడు చేతులను శుభ్రం చేసుకోవాలని..ఆరోగ్య సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే అశ్రద్ధ వహించకుండా దగ్గరలోని హాస్పిటల్‌కి వెళ్లి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకోవాలన్నారు. ఆ కార్యక్రమంలో హాస్పిటల్ ఎమ్.డి డా. కంఠా జగదీష్, కదిరి గణేష్, పుల్ల గుర చంద్రశేఖర్, ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు సుభాని, మస్తాన్ పాల్గొన్నారు.

రుద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులుకు అంబులెన్స్‌ను అందచేస్తున్న వేద సీడ్స్ ఈ.డి తులసి ధర్మచరణ్, తదితరులు.

బచ్చలిలో... పోషక విలువలు, సాగు పద్ధతులు

బచ్చలిని ఇండియన్ స్పినాచ్ లేదా మలబార్ స్పినాచ్ అని పిలుస్తారు. ఈ పంట భారతదేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలలో సాగవుతోంది. బచ్చలి కూర సాధారణంగా తీగలాగా పెరిగే బహు వార్షిక పంట. దీన్ని ఏక వార్షిక పంటగా కూడా పండిస్తారు. దీని కాండం మెత్తగా ఉండి లేత ఆకులు కలిగి ఉంటుంది. దీని లేత కొమ్మలు, ఆకులు కాడలుసహా కూర చేసుకోవడానికి వాడతారు.

ఉపయోగాలు :

- బచ్చలి కూర అధిక మోతాదులో కాల్షియం, పొటాషియం, మెగ్నిషియం, ఇనుమును సరఫరా చేస్తుంది. అంతేగాక 'విటమిన్ - ఎ', 'విటమిన్ - సి' లను కలిగి ఉంటుంది. లేత కాడలలో కూడా 'విటమిన్ - ఎ' ఎక్కువగా ఉంటుంది.
- బచ్చలి ఆకులలో (బాసిల్లరు(బ) ఉండే బీటా కెరాటిన్ కంటి చూపును మెరుగు పరుస్తుంది.
- బచ్చలిలోని ఆక్సాలిక్ ఆసిడ్స్ మిగతా ఆకుకూరల కంటే తక్కువ మోతాదులో ఉండడం వలన ఆరోగ్యానికి చాలా మంచిది. ముఖ్యంగా కిడ్నీలకు ఎలాంటి హాని కలగదు.
- ఊపిరితిత్తులకు బచ్చలి ఎంతో మేలు చేస్తుంది. అంతేగాక వృద్ధాప్య ప్రక్రియను తగ్గిస్తుంది.
- ఆకులలోని జిగట పదార్థం మల బద్ధకపు నివారణలో తోడ్పడుతుంది.
- సాఫోనిన్ అనే పదార్థం బచ్చలిలో ఉండడం వలన క్యాన్సర్ రాకుండా చేస్తుంది.
- ఆకులు, కాండం నుండి తీసిన రసం తరచుగా వచ్చే తలనొప్పిని తగ్గించడానికి ఉపయోగపడుతుంది.
- బచ్చలి పండ్ల నుండి తీసిన రసం ఎరుపు రంగులో ఉండడం వలన ఆహార పదార్థాలలో రంగు చేర్చడానికి, వస్త్రాలకు అద్దకాలుగా ఉపయోగిస్తారు.
- బచ్చలి కూర శరీరంలోని చెడు కొవ్వును తగ్గించి కాండం మంచి కొవ్వును పెంచుతుంది.

డి. శ్రీకాంత్, పి.హెచ్. డి. స్కాలర్
యం. లక్ష్మీ నాగ నందిని, పి.హెచ్. డి. స్కాలర్
వై. మౌనిక, పి.హెచ్. డి. స్కాలర్
డా. వై. యస్. ఆర్. ఉద్యాన విశ్వ విద్యాలయం, వెంకటరామన్నగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా,
ఫోన్ నెంబర్: 8179468870

పోషక విలువలు

పోషకాలు	విలువలు
శక్తి	16 కిలో క్యాలరీ
పిండి పదార్థం	3.40 గ్రా.
ప్రోటీన్	1.80 గ్రా.
కొవ్వు	0.30 గ్రా.
కొలెస్ట్రాల్	0 మి.గ్రా.
ఫోలేట్స్	140 మైగ్రో గ్రా.
విటమిన్-ఎ	400 మైక్రో గ్రా.
విటమిన్-సి	102 మి.గ్రా.
కాల్షియం	109 మి.గ్రా.
ఐరన్ (ఇనుము)	1.2 మి.గ్రా.
మెగ్నీషియం	65 మి.గ్రా.
పొటాషియం	510 మి.గ్రా.
జింక్	0.43 మి.గ్రా.

వాతావరణం

బచ్చలిని సాగు చేయడానికి తేమతో కూడిన వేడి వాతావరణం అనుకూలం. నీడ పాక్షికంగా ఉండే ప్రాంతాల్లో బచ్చలి పెద్ద సైజు

ఆకులను ఇస్తుంది. తక్కువ ఉష్ణోగ్రతగల ప్రాంతాల్లో మొక్క పెరుగుదల తగ్గి ఆకుల సైజు తగ్గిపోతుంది. ఎక్కువ ఉష్ణోగ్రతగల ప్రాంతాల్లో ఉష్ణోగ్రత 25-32 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉంటే బాగా పెరుగుతుంది.

నేలలు

బచ్చలి కూరను అన్ని రకాల నేలల్లో సాగుచేయవచ్చు. కానీ అధిక దిగుబడి కోసం ఇసుకతో కూడిన గరప నేలలు చాలా అనుకూలమైనవి. అధిక సేంద్రియ ఎరువులు కలిగి ఉండి, ఉదజని సూచిక 5.5-6.5 ఉన్న నేలలు అనుకూలం. బచ్చలి ఉదజని సూచిక 8.0 వరకు ఉన్న నేలను కూడా తట్టుకొని పెరుగుతుంది.

రకాలు

బాసిల్ల ఆల్బ : గుండ్రటి ఆకులను కలిగి ఉండి, కాండం ఆకుపచ్చ రంగులో ఉంటుంది.

బాసిల్లరుబ్ర (ఎర్ర బచ్చలి) : ఆకులు అండాకారంలోను, కాండం ఎరుపు రంగులో ఉంటుంది. బాసిల్ల ఆల్బతో పోల్చినప్పుడు బాసిల్లరుబ్ర అధిక పోషకాలు కలిగి ఉంది.

పంట కాలం

బచ్చలికూరను సంవత్సరం పొడవునా సాగు చేసుకోవచ్చు. కానీ వర్షాకాలంలో జూన్ నుండి జూలై వరకు, వేసవి కాలంలో జనవరి-ఫిబ్రవరి వరకు నాటుకోవచ్చు.

విత్తన మోతాదు

బచ్చలిని గింజలు, వేరు లేదా కాండం ముక్కల ద్వారా ప్రవర్ధనం చేయవచ్చు. ఎకరాకు 5.0-6.4 కిలోల విత్తనం, ముక్కలయితే 11,100 - 22,000 వరకు కావాల్సి ఉంటుంది.

నేల తయారీ

భూమిని 3-4 సార్లు దున్ని చదును చేయాలి. ఎకరా భూమికి 10 టన్నుల పశువుల ఎరువును చివరి దుక్కిలో వేసి దున్నాలి. ఎకరాకు 200 కిలోల వేప పిండిని పశువుల ఎరువుతో పాటు వేయాలి.

విత్తే విధానం

విత్తనాలను నారుమడులలో పెంచిన తర్వాత కూడా ప్రధాన పొలంలో నాటవచ్చు. ఈ విధానంలో ఎకరాకు 1.5 కిలోల విత్తనం సరిపోతుంది. ఈ విధంగా పెంచిన నారును 2-3 ఆకుల దశలో ఉన్నప్పుడు పొలంలో నాటుకోవాలి. కాండం ముక్కలయితే 20-25 సెం.మీ. పొడవు 3-4 కణుపులు కలిగిన కాండవు ముక్కలను వుపయోగించుకోవాలి.

విత్తే దూరం

నేల మీద పాకిస్తే 60 × 60 సెం.మీ.

పందిరిపై అయితే 60 × 30 సెం.మీ.

ఎరువులు

నేల సారాన్ని బట్టి ఎరువుల మోతాదును నిర్ణయించుకోవాలి. 8-10 టన్నుల పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేయాలి. ఎకరా భూమికి 24 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు సరిపోతాయి. సగం నత్రజని, పూర్తి భాస్వరం, పొటాష్ ఆఖరి దుక్కిలో వేయాలి. మిగిలిన సగం నత్రజనిని నాటిన 30 రోజులకు వేయాలి.

విత్తిన 15-20 రోజుల తర్వాత 2 శాతం యూరియా (లీటరు నీటికి 20 (గ్రా) + 50 పి.పి.ఎం (లీటరు నీటికి 50 మి.గ్రా.) జిబ్బరిల్లిక్ ఆసిడ్ కలిపిన ద్రావణం పిచికారీ చేస్తే అధిక లాభాలు పొందవచ్చు.

నీటి యాజమాన్యం

విత్తనం నాటినప్పుడు నేలలో తగినంత తేమ ఉండేటట్లు నీటిని ఇవ్వాలి. భూమిలో తేమను బట్టి శీతాకాలంలో 7-10 రోజులకొకసారి, వేసవిలో 5-6 రోజులకొకసారి, వర్షాకాలంలో అవసరాన్ని బట్టి నీరు ఇవ్వాలి. నీరు తక్కువైతే తీగలు సన్నగా గిడసబారి పోతాయి. ఆకులు చిన్నవిగా వస్తాయి. ఎక్కువ రోజులు నేలలో తేమ లేకుండా ఉంటే మొక్కలు త్వరగా వాడిపోయి చనిపోతాయి. కనుక అవసరమైనంత తేమ ఉండేటట్లు చూసుకోవాలి.

కలుపు నివారణ, అంతర కృషి

కలుపు నివారణకు ఎకరాకు పెండిమిథాలిన్ ఒక లీటరు 200 లీటర్ల నీటిలో కలిపి నాటిన 48 గంటలలోపు లేదా తడినేలపై పిచికారీ చేయాలి. బచ్చలి విత్తనాలు త్వరగా మొలకెత్తవు కనుక తొలిదశలో కలుపు నివారణ చాలా అవసరం. ఎప్పటికప్పుడు కలుపు తీసి నేల గుల్లబారేటట్లు చేయాలి. బహు వార్షిక పంటగా సాగుచేయాలి. అనుకున్నప్పుడు తీగ ఏపుగా పెరిగి మంచి దిగుబడి పొందడానికి తీగలను ట్రెల్లిస్ పద్ధతిలో పెంచాలి.

సస్యరక్షణ

ఆకుతినే పురుగు : చిన్న పెద్ద పురుగులు ఆకులను కొరికి వేయడం వలన ఆకులు పనికిరాకుండా పోతాయి. పైగా మార్కెట్లో సరైన ధర రాదు. వీటి నివారణకు మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పిచికారీ చేసిన తర్వాత కనీసం పది రోజుల వ్యవధి ఇచ్చి ఆకులు కోయాలి.

తెగులు

ఆకుమచ్చ తెగులు : తెగులు ఉధృతి ఎక్కువైనప్పుడు ఆకుల మీద మచ్చలు ఏర్పడి మచ్చలన్నీ కలిసిపోతాయి. ఆకులు మాడిపోయి రాలిపోతాయి. దీని నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కుళ్ళ తెగులు : 3 గ్రా. కాప్టాన్ లేదా థైరాంను కిలో విత్తనానికి పట్టించి విత్తనశుద్ధి చేసుకోవాలి. నేలను గుల్ల బారేటట్లు చేయాలి. పాదుల మొదట్లో కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి ముంపుగా తడపాలి.

కోత

కాండం ముక్కలతో ప్రవర్ధనం చేసిన మొక్కలు 6 వారాలకు కోతకు వస్తాయి. గింజలు నుండి వచ్చిన మొక్కకి 8-10 వారాలలో కోతకు సిద్ధమవుతాయి. మొక్క మొత్తాన్ని ఒకేసారి కోయవచ్చు. లేక అనేకసార్లు కోయవచ్చు. అనేక సార్లు కోయడానికి మొక్క 15-25 సెం.మీ. పొడవు ఉన్నప్పుడు కాండం మొదలు వరకు కోయాలి.

దిగుబడి : ఎకరాకు 6-8 టన్నులు.

ఓ మోడీ సారూ! చెప్పండి మీరు!!

- బొంతు దశరథ
సెల్ : 70 13 21 33 57

పల్లవి : శవాల మీద పైస లేరుకుంటారా
కరోనా మహమ్మారి నడ్డుకుంటారా
చెప్పండి మీరూ!ఓ మోడీ సారూ!!
ప్రపంచమంత మనల చూసి కార్చె కన్నీరు

చరణం :

చప్పట్లు దీపాలని గోమూత్రం పేడ అని
మూఢత్వం నూరిపోసి మరణాలను పెంచితివి
కూలి నాలి బక్కరైతు బతికే దారేదని
మొరపెట్టుకున్న వినకుండా నెమలి తో ఆడితివి

చరణం: 2

లాక్ డౌన్ తో ఫ్యాక్టరీలు నష్టపోయాయని
కార్మికులను తగ్గించి పనిగంటలు పెంచితివి
పనిలేక తిండి లేని ప్రజల గాలికొదిలేస్తివి
ఫ్యాకటరీల యాజమాన్లకు కోట్లు రాయితి లిస్తివి

చరణం: 3

గత ఏటి గుణపాఠం మేల్కొలిపే ప్రపంచాన్ని
పోటీ పడి సిద్ధపరిచే మందులు వ్యాక్సిన్ లన్ని
ప్రజల క్షేమ మొదిలి నీవు ఎన్నికల్లో మునిగితివి
అక్సిజన్ లేక ప్రజలను కోవిడ్ కొదిలేస్తివి

చరణం: 4

ఇల్లుకాలి ఏడుస్తుంటే బొగ్గులేరుకుంటారా
రాష్ట్రాలతో వ్యాక్సిన్ ల వ్యాపారం చేస్తారా
విగ్రహాలు ఆలయాలు నిర్మించిన వేల కోట్లు
వైద్యం అభివృధి చేస్తే ఉండేవా ఈ ఇక్కట్లు

చిక్కకోయీ కరోనాకు...

- సురేంద్ర రెడ్డి, తిరుపతి.

సెల్ : 94 91 52 35 70

నిన్ను నీవు బంధించికో
గృహ నిర్బంధం వలన నీవు
నష్టపోయేది ఎంతైనా కానీ
నీ ప్రాణంకన్నా విలువైనది
ఏమున్నది నష్ట పోవడానికి
అత్యవసరమై వెళ్లాల్సి వస్తే
ముక్కుకు మాస్క్
చేతులకు శానిటైజర్
మన దేహాంగాలు కావాలి
భౌతిక దూరం పాటించాలి
కంటికి కనిపించని కరోనాతో
అప్పుడే కళ్ళు తెరచిన
నవజాత శిశువూ
ఓ యోధుడిలా పోరాడాల్సిందే
ఎందెందు వెదకిచూచినా
అందు కలదు కరోనా అనే చందాన
అందరూ అప్రమత్తంగా వుండాల్సిందే
చిక్కకోయీ కరోనాకు.. చిక్కావా..
ఆసుపత్రిలో బెడ్ వుండదు
శ్మశానంలో స్థలం వుండదు
చిక్కి బిక్కిరించుట కంటే
తప్పించుకొని వెక్కిరించుట మేలు
ఏది ఏమైనా ఆత్మస్థైర్యం కోల్పోకు !

రాబోయే తరాల కోసం

- ముప్పాళ్ళ భార్గవశ్రీ,

సెల్ : 98 48 12 01 05

ప్రాణం తీయాలని చూసిన
విశాఖ ఉక్కు నేడు ప్రాణం పోస్తోంది
ఖాతాదారులకు అభయమిచ్చే
బ్యాంకుల ప్రైవేటీకరణతో
జీవిత బీమాతో ధీమాను పెంచిన
ఎల్ ఐ సి ప్రైవేటీకరణతో
ప్రజల ప్రయాణాలకు అందుబాటులో ఉన్న
రైల్వేల ప్రైవేటీకరణతో
గాలిలో చీకూచింతా లేకుండా ఎగిరే
విమానాల ప్రైవేటీకరణతో
ఒకటేమిటి అన్ని ప్రభుత్వ రంగాలను
కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే
అభినవ నీరో చక్రవర్తులు ఉన్నంతవరకు
దేశం ఆర్థిక సంక్షోభ జ్వాలల్లో
తగలబడి పోతూనే ఉంటుంది
పర్యావరణాన్ని కూడా
తూకం వేసి అమ్మి వేస్తూ ఉంటే
కరోనా సెకండ్ వేవ్ లే కాదు
థర్డ్ వేవ్ లు వచ్చినా
ఈ నీరో చక్రవర్తులు
ఆత్మ నిర్భర్ పేరుతో
ఫిడేలు వాయిస్తూనే ఉంటారు
ప్రజలారా తస్మాత్ జాగ్రత్త !
సమాజానికి ప్రాణాలు పోసే శక్తులను
ప్రాణాలు పోయినా కాపాడుకుందాం
మనకి కాకపోయినా
రాబోయే తరాల కోసం !

Printed & Published by B. Tulasi Das on behalf of A.P. Rytusangam, 3/4B, Bypass Road, Vaddeswaram, Tadepalli, Guntur Dt, A.P.
At Prajasakti Daily Printing Press, Krishna nagar, Tadepalli (M), Guntur (Dt.,) **Editor** : P. NarasimhaRao

VIVA

THE SCHOOL BY VVIT

With Best compliments from..

THE FIRST AUTHORISED International Baccalaureate PYP SCHOOL IN A.P.

పిల్లలపై అత్యంత ప్రేమగల తల్లిదండ్రులు వివాని ఎలా కాదనగలరు ?

HOW CAN LOVING PARENTS DENY VIVA TO THEIR CHILDREN?

AVANT GARDE INFRASTRUCTURE		RESIDENTIAL SPACE	65,000 SQ. FT.	FOOTBALL COURTS	2	SKATING RINK	1
		GROUND	10 ACRES	BASKETBALL COURTS	3	OBSTACLE COURSE	1
AIR CONDITIONED ACADEMIC BLOCK	1,12,000 SQ. FT.	SWIMMING POOL	25/16 MTS.	VOLLEYBALL COURTS	4	INDOOR (TABLE TENNIS, CARROMS, CHESS.)	ENOUGH
INDOOR AUDITORIUM CUM DINING HALL	23,000 SQ. FT.	KIDS POOL	17.25/4 MTS.	BADMINTON COURTS	2	AIR CONDITIONED BUSES	ENOUGH

DAY BOARDING CUM RESIDENTIAL CAMPUS: Nambur, Guntur, A.P., India - 522 508. Cell : 73311 42336, 91003 05336, 73373 59336
JUNIOR CAMPUS: Ring Road, Guntur. Cell : 70327 01336. www.viva.school

రైతు సోదరులకు, మిత్రులకు మరియు శ్రేయోభిలాషులందరికీ ఈ సంవత్సరం అన్ని విధాల సిరిసంపదలు కలిగి
ఉజ్వలమైన భవిష్యత్తు పొందాలని కోరుకుంటూ...

తులసి యోగీష్
మేనేజింగ్ డైరెక్టర్

తులసి రామచంద్ర ప్రభు
ఛైర్మన్ - తులసి గ్రూప్

తులసి కృష్ణ చైతన్య
డైరెక్టర్

తులసి
జాబిల్లి
JABILLI బీజీ II
ప్రత్తి విత్తనాలు

తులసి
తులసి - 7
TULASI-7 బీజీ II
ప్రత్తి విత్తనాలు

తులసి సీడ్స్
ISO 9001 : 2015 Certified

మేడే శుభాకాంక్షలతో...
మండవ హాస్పిటల్
శ్రీ సాయి హాస్పిటల్ క్యాంపస్, 6/2 అరండల్ పేట,
గుంటూరు-2. ఫోన్ : 0863-2251849

* Hbs Ag+ve, * HIV+,
* ఎయిడ్స్ కేసులకు ప్రత్యేక చికిత్స మరియు అన్ని రకముల ఆపరేషన్లు చేయబడును.
* పురుగుమందు మరియు యాక్సిడెంట్ కేసులకు ప్రత్యేక I.C.U చికిత్స కలదు.
* షుగర్ వ్యాధులకు * సెక్స్ ప్రాబ్లమ్స్‌కు ప్రత్యేక చికిత్స.
ప్రత్యేక కౌన్సిలింగ్ మరియు అత్యాధునిక చికిత్స చేయబడును.

డా॥ మండవ శ్రీనివాసరావు
ఎం.డి.ఓబిజి, సీనియర్ గైనకాలజిస్ట్

గమనిక : ఆదివారం సెలవు - దూర ప్రాంతాల వారు ఫోన్ చేసి రావలెను.

మేడే శుభాకాంక్షలతో...

మేనేజింగ్ పార్టనర్ :
ఈదా శ్రీకాంత్‌రెడ్డి, ఎం.బి.ఎ
సెల్ : 73823 55577

ఈదా సాంబిరెడ్డి
9440261732, 9866337933

ESR CONSTRUCTIONS
Vijayadurga Towers, Flat No.103,
Mahatma Gandhi Inner Ring Road, Y.S.R. Circle,
Reddypalem, Guntur

రైతు, కార్మిక శంఖారావం దృశ్య మాలిక

With Best Compliments From...

ఈ-చౌపాల్ ಈ-ಚೌಪಾಲ್ ई-चौपाल

ITC Enduring Value

eChoupal 4.0
Reimagining Indian Agriculture

- Crop Advisory
- Agri Shop
- Market Prices
- Crop Monitoring
- Farmer Forums
- Agri Services

Download the eChoupal App

Call us at: 1800 103 0545

With Best compliments from..

ఇంజినీరింగ్ విద్యలో తిరుగులేని మలినేని!
విద్యార్థుల ఉపాధి అవకాశాలకు తరగని మలినేని!!
ఉన్నత విలువలు.. అత్యుత్తమ ప్రమాణాలకు
సాటిలేని మలినేని..

Malineni Perumallu
Chairman

	EAMCET & ICET CODE :
మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్ పుల్లడిగుంట (గ్రా), ప్రత్తిపాడు రోడ్డు, గుంటూరు జిల్లా-17.	**MLEW**
మలినేని పెరుమాళ్ళు ఇంజనీరింగ్ & ఫార్మసీ కాలేజెస్ పుల్లడిగుంట (గ్రా), ప్రత్తిపాడు రోడ్డు, గుంటూరు జిల్లా-17.	**MPES**
మలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కాలేజ్ శింగరాయకొండ, ప్రకాశం జిల్లా.	**MLEC**
మలినేని లక్ష్మయ్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ శింగరాయకొండ, ప్రకాశం జిల్లా.	**MLCP**

Courses : CSE | IT | ECE | EEE | MECH | CIVIL | B.Pharmacy



✆ 98855 09898, 88865 09898

✆ 88864 49999, 97031 44771 /2/3

Malineni Lakshmaiah Engineering & Group of Colleges

(Approved by AICTE, New Delhi & Affiliated to JNTUK, Kakinada)

❖ SINGARAYAKONDA ❖ GUNTUR

City Office : ❖ Bhagyanagar, 2nd Lane, Dia Complex, 2nd Floor, RTO Office Road, ONGOLE.
❖ Brundavan Gardens, 4th Lane, H.No. 3-28-18/90, Beside Syndicate bank, Guntur.

www.malinenicolleges.ac.in

KLVA106m23

Date of Publication : 12th May 2021 Posted on 19th & 20th May 2021
MANARYTUVANI MAY- 2021
R.NI. 52715/90 Pages : 56 Postal Regd. No. VJ/181/2019-21

3/4B, Vaddeswaram Bypass , Vaddeswaram (Post), Tadepalli (Mandal), Guntur Dt, A.P.

మనను ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA106M233
పుస్తకం పేరు	రైతువాణి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	57
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	madhu
పేజీలు విడదీసినది	madhu
స్కాన్ చేసినది	Navya
పరీక్ష చేసినది	AMRUTHA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good